సాహితి గత వారంరోజులపై విహంగవీక్షణ

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

శ్రీకాకుళం

: fb.com/vaartha Digital

Published from Srikakulam ,Visakhapatnam,Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem

19-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 200 పేజీలు: 16 వెల: 6.50

సిజెపిపై పోలీసు చర్య.. విచారణ కమిటీ ఏర్పాటు

ఇమ్రాన్‌కు తక్షణమే ఆస్పత్రికి తరలించండి: పాక్ సుప్రీం

5లో

# జయహో బిసి

## స్థానిక సంస్థల్లో 34% రిజర్వేషన్

### నిబంధనలకనుగుణంగా పెంపు

### 28జిల్లాలకూ జిల్లా పరిషత్‌లు

### మేయర్, చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు

### అసెంబ్లీలో సభ్యుల హర్షాతిరేకాల మధ్య మంత్రివర్గ నిర్ణయాన్ని ప్రకటించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** జయహో బిసి అంటూ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ దద్దరిల్లింది. సభ్యుల హర్షాతిరేకాల మధ్య స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్ నిర్ణయాన్ని మంగళవారం జరిగిన రెండో రోజు అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి, బిసి సాధికారతకు కట్టుబడి ఉందని అసెంబ్లీ సాక్షి గా స్పష్టం చేశారు. పంచాయతీ నుంచి పార్లమెంట్ దాకా సామాజిక న్యాయమే అజెండా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి వెల్లడించారు. స్థానిక సంస్థల్లో బిసిలకు తొలిసారిగా రిజర్వేషన్‌లను వర్తింప చేస్తూ ఎన్టీఆర్ నాడు తీసుకున్న నిర్ణయం మొదలుకుని ఇప్పటి వరకు జరిగిన పరిణామాలను సిఎం చంద్రబాబు సభలో వివరించారు. నిబంధనలకు అనుగుణంగా అన్ని పరిమితులకు లోబడి స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్ల పెంపుపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకు న్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల్లో 34శాతం, పట్టణ స్థానిక ప్రాంత సంస్థల్లో 33.33శాతం మేర రిజర్వేషన్‌లను బిసి వర్గాలకు వర్తింప చేయనున్నట్టు అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటించారు. ఉమ్మడి రాష్ట్రానికి తొలిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన పంచాయతీరాజ్ చట్ట ప్రకారం రిజర్వేషన్ల పెంపును అమలు చేస్తున్నట్టు తెలిపారు. 1995, 2001, 2006, 2013 సంవత్సరాల్లో 34శాతం రిజర్వేషన్‌లతోనే స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించినట్టు ముఖ్యమంత్రి సభకు గుర్తు చేశారు. సామాజిక న్యాయం అజెండాతో పని చేయడం వల్లే ఎర్రన్నాయుడు, కెఇ కృష్ణమూర్తి, యనమల రామకృష్ణ, దేవేందర్ గౌడ్, అయ్యన్న పాత్రుడు వంటి లెజెండరీ నాయకత్వం బిసి వర్గాల నుంచి వచ్చిందని ముఖ్యమంత్రి తెలిపారు.

గత ప్రభుత్వం స్థానిక సంస్థల్లో బిసిల రిజర్వేషన్‌లను 24శాతానికి కుదించడం ద్వారా 16800 మంది స్థానిక బిసి నేతలకు రాజకీయాల్లో అవకాశాలు దక్కలేదని అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన వర్గాల సామాజిక, రాజకీయ, ఆర్థిక అభ్యున్నతే ధ్యేయం గా కూటమి ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 34శాతం రిజర్వేషన్‌లను వర్తింప చేస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ, ప్రత్యేక కేబినెట్ సమావేశం నిర్వహించి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపుపై కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. ఈ 34శాతం రిజర్వేషన్ ప్రతిపాదనను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించాలని ముఖ్యమంత్రి కోరారు.

**స్థిరమైన పాలన కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో ప్రత్యక్ష ఎన్నికలు:** ఆయారాం.. గయారాం అనే విధానం కాకుండా సుస్థిరమైన పాలన అందించడం కోసమే పట్టణ స్థానిక సంస్థల్లో మేయర్లు, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికలను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా చేపడతామని సిఎం చంద్రబాబు వెల్లడించారు. ఈ మేరకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. దీంతో పాటు జిల్లాల విభజన జరిగినా ప్రస్తుతం 13 జిల్లా ప్రజా పరిషత్‌లే ఉండటంతో, పరిపాలనా సౌలభ్యం కోసం రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లా ప్రజా పరిషత్‌లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. 16వ ఆర్థిక సంఘం నుంచి రావాల్సిన రూ.2,300 కోట్ల గ్రామీణ గ్రాంట్లు, రూ.1,562 కోట్ల పట్టణ గ్రాంట్లు రావాలంటే స్థానిక ఎన్నికలు నిర్వహించడం అత్యంత ఆవశ్యకమని, సరైన అభ్యర్థుల ఎంపిక ద్వారా భావి నాయకత్వాన్ని >>2

## అక్టోబర్ లోగా లోకల్ పోల్స్

### ప్రత్యక్ష పద్ధతిలోనే మేయర్, చైర్మన్ల ఎన్నిక

### జిల్లాల విభజనకనుగుణంగా జడ్పీలు

### సిఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్‌లో నిర్ణయం

### 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం

### 10,060 పోస్టులతో జాబ్ కేలెండర్‌కు ఓకే

### బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్లు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బిసి రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం బిసి రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. కేంద్రఆర్థికసంఘం నుంచి రావాల్సిన >>2



మంగళవారం సిఎం చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రిమండలి సమావేశం



## గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా రమాదేవి, రామయ్య

**విజయవాడ,ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ గవర్నర్ కోటా ఎంఎల్‌సీలను ఖరారు చేసింది. ఎప్పటి నుంచో పార్టీకి విధేయంగా ఉంటున్న వర్ల రామయ్య, దళవాయి రమాదేవి గవర్నర్ కోటా ఎమ్మెల్సీలుగా ఖరారయ్యారు. వర్ల రామయ్య ప్రస్తుతం టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడిగా ఉన్నారు. ఆయనకు ఎస్సీ కోటాలో మండలిలో ప్రాతినిధ్యం కల్పించనున్నారు. వర్లరామయ్య గతంలో అనేక పర్యాయాలు ప్రజాప్రాతినిధ్య పదవిని అడుగుతూ వచ్చారు.పార్టీ ఆయన ఎంఎల్‌ఏ అభ్యర్థిగా అవకాశం ఇచ్చినప్పటికి గెలవలేకపోయారు.పార్టీ తగిన బలం లేనప్పటికి అసెంబ్లీ నుంచి రాజ్యసభకు పోటీ ఒటమి పాలయ్యారు.టీడీపీ హయంలో ఆయన ఆర్టీసీ చైర్మన్‌గా చేసారు.ఇక అనంతపురంలో డ్వాక్రా సంఘం అధ్యక్షురాలిగా ఉన్న రమాదేవికి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించారు. ఆమె బీసీ మహిళ, టీడీపీ క్లస్టర్ ఇన్‌ఛార్జ్‌గా ఉన్నారు. ఈ నియామకంతో పనిచేసే వారికి పదవులు దక్కుతాయని టీడీపీ సంకేతం పంపింది. ఈ మేరకు ప్రభుత్వం లోక్‌భవన్‌కు దస్త్రం పంపింది.

హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్ 2లో



## పుల్లెల గాయత్రి, ధనుష్ శ్రీకాంత్ సహా 17 మందికి 'అర్జున' అవార్డులు

### ముగ్గురికి 'ద్రోణాచార్య'

### ఈ సారికూడా లేని ఖేల్‌రత్న

### జాతీయ క్రీడాపురస్కారాలు ప్రకటించిన కేంద్రం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ప్రభుత్వం 2025 సంవత్సరానికి గాను జాతీయ క్రీడా పురస్కారాలను మంగళవారం ప్రకటించింది. భారత బ్యాడ్మింటన్ దిగ్గజం, కోచ్ పుల్లెల గోపీచంద్ కుమార్తె గాయత్రిని ప్రతిష్ఠాత్మక అర్జున అవార్డు వరించింది. మహిళల డబుల్స్‌లో తన భాగస్వామి ట్రీసా జాలీతో కలిసి పుల్లెల గాయత్రి ఈ పురస్కారానికి ఎంపికైంది. వీరితో పాటు డెకాథ్లాన్ అథ్లెట్ తేజస్విన్ శంకర్, చెస్ ప్రపంచకప్ విజేత దివ్య దేశ్‌ముఖ్ సహా మొత్తం 17 మంది క్రీడాకారులకు అర్జున అవార్డులను ప్రకటించారు. ఈ ఏడాది దేశ అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డును ఎవరికీ ప్రకటించకపోవడం గమనార్హం. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ (రిటైర్డ్) అరుణ్ కుమార్ మిశ్రా నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సిఫార్సుల మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ఈ అవార్డుల జాబితాను విడుదల చేసింది. గత నాలుగేళ్లుగా నిలకడగా రాణిస్తూ, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించిన వారికి అర్జున అవార్డును ప్రదానం చేస్తారు. కామన్వెల్త్ క్రీడల్లో డెకాథ్లాన్‌లో పతకం గెలిచిన >>2

# డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

### రూ.5వేల కోట్ల పెట్టుబడులు లక్ష్యం

### 5వేల మందికి ప్రత్యక్షంగా, 25వేల మందికి పరోక్షంగా ఉపాధి

### 3నెలల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక కమిటీ చర్యలు

### కేంద్ర పౌరవిమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

**కర్నూలు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** ఓర్వకల్లు డ్రోన్ సిటీని దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన డ్రోన్ తయారీ, పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సాంకేతిక సేవల కేంద్రంగా అభివృద్ధి చేస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో డ్రోన్ సిటీని దశలవారీగా అభివృద్ధి చేస్తున్నాయని చెప్పారు. మంగళవారం ఓర్వకల్లు డ్రోన్ సిటీలో డ్రోన్ పరిశ్రమలకు చెందిన సుమారు 150 మంది ప్రతినిధులతో సమావేశం నిర్వహించిన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. డ్రోన్ సిటీలో మొత్తం 600 ఎకరాలు కేటాయించగా, తొలి దశలో 12ప్లాట్లకుగాను 8 ప్లాట్లను ఇప్పటికే కంపెనీలకు కేటాయించినట్లు తెలిపారు. సుమారు 55ఎకరాల్లో వివిధ సంస్థలు తయారీ యూనిట్లు ఏర్పాటుచేసేందుకు చర్యలు చేపడుతున్నాయన్నారు. డ్రోన్ పరిశ్రమ ప్రతిని ధులు టెస్టింగ్, శాండ్‌బాక్స్ సదుపాయాలతో పాటు >>2



మంగళవారం ఓర్వకల్లులో డ్రోన్లను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు

# గ్రామగ్రామానికి పార్టీ జెండా అదే బిజెపి అజెండా



మంగళవారం విశాఖలో జరిగిన రాష్ట్ర బిజెపి కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపి పురందేశ్వరి

### ప్రజలతో నిరంతరం మమేకం కావాలి

### పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేయాలి

### వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా పనిచేయండి

### పార్టీ శ్రేణులకు జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం

### స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పిలుపు

**విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కేవలం పార్టీసమావేశాలకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల్లో కి వెళ్లి వారితో నిరంతరం మమేకం కావాలని బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఎపి బిజెపి క్షేత్రస్థాయి శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. విశాఖపట్నం వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బిజెపిని ప్రతి గ్రామానికి, ప్రతి బూత్‌కు తీసుకెళ్లాలని, ప్రజలతో నిరంతరం మమేకమవుతూ సేవా కార్యక్రమాల ద్వారా వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంపర్కం, సంభాషణ, సంబంధం అనే విధానంతో ప్రజల మధ్య నిరంతరం ఉండాలని పిలుపునిచ్చారు. సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి జాతీయ స్థాయికి ఎదిగిన వెంకయ్యనాయుడు వంటి నాయకుల ప్రస్థానం బిజెపి ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. పదవులు కాకుండా ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణం లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని నితిన్ నబిన్ పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయేకు ప్రజలు ఇచ్చిన అపూర్వ విజయాన్ని అభివృద్ధి, ప్రజాసేవకు వేదికగా మార్చాలని అన్నారు. 2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమికి 21 లోక్‌సభ స్థానాలు, 164 >>2




మంగళవారం మంత్రి నారా లోకేష్‌ను అభినందిస్తున్న ఢిల్లీ విద్యాశాఖమంత్రి సర్దార్ మన్‌జిందర్‌సింగ్ శిర్సా

## మెగా డిఎస్సీ నిర్వహణ అభినందనీయం

### 16వేల టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేశారు

### టీచర్ రిక్రూట్‌మెంట్ అంటే ఢిల్లీలో కోర్టులు, కేసుల చిక్కులే

### విద్యా మంత్రి నారా లోకేష్‌ను ప్రశంసించిన ఢిల్లీ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఎలాంటి వివాదాలకు తావివ్వకుండా పారదర్శకంగా రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి 16వేల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిన తీరుపై ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా విద్యా శాఖ మంత్రి నారా లోకేష్‌పై ప్రశంసలు కురిపించారు. మంగళవారం ఆయన ఆర్‌టిజిఎస్‌లో విద్యా, ఐటి, ఆర్‌టిజిఎస్ శాఖల మంత్రి నారా లోకేష్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా డిఎస్సీ ద్వారా 16వేల మంది ఉపాధ్యాయులను ఎలాంటి వివాదాలకు తావు లేకుండా ఎలా నియామకాలు చేపట్టగలిగారని ఆయన మంత్రి నారా లోకేష్‌ని ఆసక్తిగా అడిగారు. ఢిల్లీలో టీచర్ రిక్రూట్మెంట్ అంటేనే కోర్టులో కేసులు, ఫిర్యాదులు, గందరగోళాలు సృష్టించేసి దాని జోలికెళ్లాలంటే జడిపించేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిలో ఎలాంటి వివాదాలు లేకుండా పారదర్శకంగా టీచర్ రిక్రూట్మెంట్ పూర్తి చేసిన లోకేష్‌కు అభినందనలు తెలిపారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ తాము డిఎస్సీ ద్వారా పరీక్ష నిర్వహించి ఎక్కడా ఎలాంటి చిన్న పొరబాట్లకు తావు లేకుండా 16వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టామన్నారు. దీనిపైన కూడా ప్రతిపక్ష పార్టీ చాలా ఆరోపణలు చేసి విఫలమైందన్నారు. కోర్టుల్లో సైతం వారు ఎక్కడా చిన్న అక్రమం జరిగినట్లు ఆధారాలు చూపించలేక పోయారన్నారు. త్వరలో మరో 3వేల మందికిపైగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యాశాఖ తనకు ఎంతో ఇష్టమైన శాఖని, విద్యాశాఖలో వినూత్న విధానాలు అమలు చేయడం ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు. మొట్టమొదటి సారి ప్రైవేటు పాఠశాలల నుంచి 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరారని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలపై, ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా సంస్కరణలపై ప్రజల్లో పెరిగిన నమ్మకానికి ఇదో ఉదాహరణ అన్నారు. ఉపాధ్యాయుల కార్యకలాపాలు, విద్యాశాఖలో మొత్తం కార్య కలాపాలన్నీ పర్యవేక్షించడానికి లీప్ యాప్ రూపొందించామన్నారు. >>2



ఎఇ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు
అల్లుడిని చంపింది సాధిక్కేనా? 3లో



సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ 2లో



మంగళవారం హైదరాబాద్‌లో స్వాధీనం చేసుకున్న కల్తీనెయ్యి రసాయనాలను పరిశీలిస్తున్న సిపి సజ్జనార్

## తినేదంతా నెయ్యేనా?

హైదరాబాద్‌లో విస్తరిస్తున్న కల్తీనెయ్యి మాఫియా 4లో



మంగళవారం ఓర్వకల్లులో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు సమక్షంలో ఒప్పందపత్రాలు

# డ్రోన్ సిటీగా ఓర్వకల్లు

>> డ్రోన్లను గగనతలంలో పరీక్షించేందుకు అవసరమైన అనుమతులు వేగంగా లభించే ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించారని మంత్రి తెలిపారు. ఈ అంశాలపై నిర్ణయాలు వేగంగా తీసుకునేందుకు కేంద్ర పౌర విమానయాన మంత్రిత్వ శాఖ, డిజిసిఎ, నాణ్యతా మండలి తదితర విభాగాల అధికారులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నామని, మూడు నెలల కాలపరిమితిలో అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. డ్రోన్ పరిశ్రమ ద్వారా రానున్న కాలంలో ఓర్వకల్లులో రూ.5 వేల కోట్ల వరకు పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ఇప్పటికే సుమారు రూ.130 కోట్ల పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. డ్రోన్ సిటీ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందితే 5 వేల మందికి ప్రత్యక్షంగా, 25 వేల మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రానున్న రెండు నుంచి మూడు సంవత్సరాల్లో అన్ని ప్లాట్ల కేటాయింపులు పూర్తి చేసి డ్రోన్ తయారీ కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వ్యవసాయం, పారిశుద్ధం, శాంతిభద్రతలు, భూసర్వే, విపత్తుల నిర్వహణ, మౌలిక వసతుల పరిశీలన, వైద్య సేవలు తదితర రంగాల్లో డ్రోన్ల వినియోగం వేగంగా పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 6 లక్షలకు పైగా డ్రోన్ల అవసరం ఉండగా ప్రస్తుతం 40 వేలకుపైగా డ్రోన్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ భారీ మార్కెట్‌ను దేశీయ తయారీ ద్వారా సద్వినియోగం చేసుకోవడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. స్థానిక యువతకు డ్రోన్ తయారీ, నిర్వహణ, ఆపరేషన్, సాంకేతిక సేవలు, పైలట్ శిక్షణలో నైపుణ్యాభివృద్ధి కల్పించి ఉపాధి అవకాశాలను పెంచుతామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం డ్రోన్ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు రూ.120 కోట్ల ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకాన్ని అమలు చేస్తోందన్నారు. కర్నూలు విమానాశ్రయం నుంచి భవిష్యత్‌లో బెంగళూరుకు విమాన సేవలు ప్రారంభించే అంశంపై కృషి చేస్తానని రామ్మోహన్ నాయుడు తెలిపారు. విమానాశ్రయంలో విమాన శిక్షణ సంస్థలను ఏర్పాటు చేయడం ద్వారా పైలట్ శిక్షణకు అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. మెల్‌స్టార్ విమాన శిక్షణ సంస్థ ప్రారంభానికి సిద్ధంగా ఉందని, మరో సంస్థ కూడా ఏర్పాటు కానుందని తెలిపారు. ఓర్వకల్లు డ్రోన్ సిటీని కేవలం తయారీ కేంద్రంగా కాకుండా పరిశోధన, పరీక్షలు, శిక్షణ, ధ్రువీకరణ, సేవలు వంటి అన్ని విభాగాలతో కూడిన సమగ్ర డ్రోన్ పర్యావరణ వ్యవస్థగా అభివృద్ధి చేస్తామని కేంద్ర మంత్రి తెలిపారు. రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి లోకేష్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి పెట్టుబడుల ను ఆకర్షించేందుకు చేస్తున్న కృషికి అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని చెప్పారు.

# 17మందికి 'అర్జున' అవార్డులు

>> తొలి భారతీయ అథ్లెట్‌గా తేజస్విన్ శంకర్ చరిత్ర సృష్టించగా, ఫిడే మహిళల ప్రపంచ కప్ గెలుచుకుని దివ్య దేశ్‌ముఖ్ సంచలనం రేపారు. హాకీ క్రీడాకారుడు హార్దిక్ సింగ్ పేరు ఖేల్ రత్న కోసం పరిశీలనకు వచ్చినప్పటికీ, అతను పోటీ నుంచి తప్పుకోవడంతో ఈసారి ఎవరికీ ఈ పురస్కారం దక్కలేదని తెలిసింది. సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారుడు అరుమై నాయగంను అర్జున అవార్డు (జీవన సాఫల్యం) వరించింది. 1962 జకార్తా ఆసియా క్రీడల్లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో ఆయన సభ్యుడు. కోచ్‌లకు ఇచ్చే ద్రోణాచార్య అవార్డులు ముగ్గురిని వరించాయి.

**అవార్డు గ్రహీతల పూర్తి జాబితా:** అర్జున అవార్డు గ్రహీతలు (17 మంది) తేజస్విన్ శంకర్, మహమ్మద్ అజ్మల్, ప్రియాంక గోస్వామి (అథ్లెటిక్స్), ట్రీసా జాలీ, పుల్లెల గాయత్రి (బ్యాడ్మింటన్), నరేందర్ బెర్వాల్ (బాక్సింగ్), విదిత్ సంతోష్ గుజరాతీ, దివ్య దేశ్‌ముఖ్ (చెస్), లాల్రెమ్సియామి, రాజ్‌కుమార్ పాల్ (హాకీ),సుర్జీత్, పూజ (కబడ్డీ), ధనుష్ శ్రీకాంత్, రుద్రాంశ్ ఖండేల్వాల్ (పారా షూటింగ్), ఏక్తా భయాన్ (పారా అథ్లెటిక్స్), అరవింద్ సింగ్ (రోయింగ్), అఖిల్ షెయోరాన్ (షూటింగ్) అర్జున అవార్డు (జీవన సాఫల్యం), అరుమై నాయగం (ఫుట్‌బాల్), ద్రోణాచార్య అవార్డు (కోచ్‌లు)ఛోటే లాల్ యాదవ్ (బాక్సింగ్)పర్వీర్ సింగ్ (అథ్లెటిక్స్)నేహా నందకుమార్ చవాన్ (షూటింగ్)జీవితకాల సాఫల్య పురస్కారం (ధ్యాన్‌చంద్ అవార్డు)ధర్మేంద్ర సింగ్ యాదవ్ (బాక్సింగ్)వీరేందర్ కుమార్ (రెజ్లింగ్) రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ ఆర్మీ పారాలింపిక్ నోడ్, పుణే ఈ పురస్కారాలు వరించాయి.

# మెగా డిఎస్సీ నిర్వహణ అభినందనీయం

>>అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# సిబిఐ వలలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్

## రూ.2 లక్షలు లంచంతో పట్టుబడిన శివశంకర్

## మరో నలుగురిని విచారిస్తున్న సిబిఐ అధికారులు

### క్వారీల భద్రతా తనిఖీలు, ప్రమాదాలపై ఆరా

**ఒంగోలు(క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఒంగోలులో మైనింగ్ శాఖ అధికారిపై సిబిఐ అధికారులు పక్కా ప్రణాళికతో నిర్వహించిన ట్రాప్ తీవ్ర కలకలం రేపింది. మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ యు.శివశంకర్ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షల లంచం తీసుకుంటుండగా మంగళవారం తెల్లవారుజామున సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ప్రకాశం జిల్లాలోని గ్రానైట్ క్వారీల్లో భద్రతా ప్రమాణాల తనిఖీల కోసం శివశంకర్ సోమవారం బల్లికురవ ప్రాంతానికి వెళ్లినట్లు తెలుస్తోంది. అక్కడి క్వారీలను పరిశీలించిన అనంతరం చీమకుర్తి ప్రాంతంలోని పలు క్వారీలను తనిఖీ చేయాల్సి ఉన్నట్లు సమాచారం. చీమకుర్తిలోని వాసవి గోల్డెన్ గ్రానైట్ క్వారీతో పాటు మరికొన్ని క్వారీల్లో భద్రతా ప్రమాణాలు, గతంలో చోటుచేసుకున్న ప్రమాదాలు, క్వారీల నిర్వహణ తీరుపై పరిశీలన చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అయితే తనిఖీలకు ముందే క్వారీ నిర్వాహకులతో శివశంకర్ సంప్రదింపులు జరిపినట్లు సిబిఐ అధికారులు గుర్తించినట్లు సమాచారం. భద్రతా తనిఖీల్లో కొన్ని అంశాలను అనుకూలంగా మార్చడం, క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాలకు సంబంధించిన వ్యవహారాలను సెటిల్ చేయడం వంటి అంశాల కోసం లంచం డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో రూ.2 లక్షలు చెల్లించేందుకు క్వారీ నిర్వాహకులు అంగీకరించినట్లు సమాచారం. లంచం డిమాండ్ వ్యవహారంపై ముందస్తు సమాచారం అందుకున్న సిబిఐ అధికారులు పూర్తి స్థాయిలో నిఘా పెట్టి ట్రాప్ నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలుస్తోంది. డబ్బులు అందజేసే ప్రదేశాన్ని కూడా అధికారులు పర్యవేక్షిస్తూ, లంచం స్వీకరించే సమయంలోనే అధికారిని పట్టుకునేలా ఏర్పాట్లు చేసినట్లు సమాచారం. ఇందులో భాగంగా ఒంగోలులోని ఓ రెస్టారెంట్‌లో నగదు అందజేసేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం తెల్లవారుజామున అక్కడ గ్రానైట్ వ్యాపారుల నుంచి రూ.2 లక్షలు స్వీకరిస్తున్న సమయంలో మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ శివశంకర్‌ను సిబిఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు తెలిసింది. ట్రాప్ అనంతరం అధికారులు సంఘటనా స్థలంలో ఆధారాలను సేకరించి, నగదు లావాదేవీకి సంబంధించిన వివరాలను నమోదు చేసినట్లు సమాచారం. లంచం స్వీకరణకు సంబంధించి అవసరమైన ఆధారాలను కూడా సిబిఐ అధికారులు సేకరించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనకు సంబంధించి గ్రానైట్ వ్యాపారులు సిద్ధా సురేష్, భాస్కర్‌రెడ్డి, ప్రవీణ్‌తో పాటు సర్వేయర్ శుభాష్కర్‌ను కూడా సీబీఐ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. లంచం ఇచ్చే వ్యవహారంలో వీరి పాత్ర ఏమిటి, నగదు ఎవరి సూచనల మేరకు సమకూర్చారు, క్వారీ యాజమాన్యాలకు సంబంధించిన ఇతర వ్యక్తుల ప్రమేయం ఏమైనా ఉందా అనే అంశాలపై అధికారులు విచారణ చేపట్టినట్లు సమాచారం. క్వారీ యాజమాన్యాలు, మైనింగ్ అధికారుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, సమావేశాలు, నగదు లావాదేవీలకు సంబంధించిన వివరాలను కూడా సిబిఐ అధికారులు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. చీమకుర్తి ప్రాంతంలోని రెండు గ్రానైట్ క్వారీల్లో గతంలో జరిగిన ప్రమాదాల నేపథ్యంలోనే శివశంకర్ తనిఖీలకు వచ్చినట్లు సమాచారం. ఒంగోలులోనే శివశంకర్‌ను సిబిఐ అధికారులు అధికారికంగా అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం అరెస్టయిన మైనింగ్ అధికారితో పాటు అదుపులోకి తీసుకున్న క్వారీ నిర్వాహకులు, సర్వేయర్‌ను తదుపరి న్యాయ ప్రక్రియ కోసం విజయవాడకు తరలించినట్లు తెలుస్తోంది. అక్కడ కేసుకు సంబంధించిన తదుపరి ప్రక్రియ కొనసాగనున్నట్లు సమాచారం.

# హైకోర్టులో మీడియేషన్ సెంటర్: మంత్రి ఎన్ఎండి ఫరూక్

**విజయవాడ ఆగస్టు18,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్ర సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టులో మీడియేషన్ సెంటర్ మరియు ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకు మంత్రివర్గ సమావేశం లో ఆమోద ముద్ర వేయడం జరిగిందని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. మంగళవారం వెలగపూడి సచివాలయంలో ముఖ్య మంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో న్యాయ శాఖకు సంబంధించిన రెండు కీలకమైన అంశాలకు ఆమోద ముద్ర వేసిన విషయాలను మంత్రి ఒక ప్రకటనలో వెల్లడించారు. 14 మంది సిబ్బందితో మీడియేషన్ సెంటర్ తో పాటుగా 15 మంది సిబ్బందితో ఆర్బిట్రేషన్ సెంటర్ ఏర్పాటుకుఆమోదముద్ర వేయడం జరిగిందన్నారు.హైకోర్టులో పరిపాలన సౌలభ్యం కోసం ఒక అడ్మి నిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఓ )పోస్టును డైరెక్టరేట్ ఆఫ్ ప్రిజన్స్ క్రింద పనిచేస్తున్న పీపీ లేదా ఏపీపీ ద్వారా డిప్యుటేషన్ పై భర్తీ చేయడానికి కూడా మంత్రివర్గ సమావేశం ఆమోదం తెలిపిందని మంత్రి తెలిపారు.

>>అందించాలని కూటమి నేతలను కోరారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలను గాంధీజీ స్ఫూర్తితో అభివృద్ధి చేయడానికి కూటమి అంతా కలిసి కట్టుగా పనిచేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.

**ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు బిసిలే వెన్నెముక:** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థను, గ్రామీణ వ్యవస్థను, వ్యవసాయాన్ని, చేతివృత్తులను నిలబెట్టింది బిసి సమాజమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. రాష్ట్రంలో 50.42 శాతం ఉన్న బిసిల శ్రమకు, చీరను నేసి అగ్గిపెట్టెలో పెట్టే అద్భుత నైపుణ్యానికి సాంకేతికతను జోడించి వారి శక్తిని ప్రపంచానికి అందిస్తామన్నారు. బిసి రెసిడెన్షియల్ స్కూళ్లను అత్యుత్తమంగా మార్చి విద్యకు మెరుగైన బాటలు వేస్తామన్నారు. విద్య, నైపుణ్యం, ఉపాధి, ఎంటర్‌ప్రెన్యూర్లు, రాజకీయ ప్రాతినిధ్యం ద్వారా వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కేవలం రోడ్లు, భవనాలు, మౌలిక సదుపాయాలు మాత్రమే అభివృద్ధి కాదని,ఆర్థిక అసమానతలు లేకుండా జీవన ప్రమాణాలు పెంచుతూ చివరి వ్యక్తిని ముందుకు తేవడమే అసలైన అభివృద్ధి అని చెప్పారు. బిసి రిజర్వేషన్లు ఎవరికీ వ్యతిరేకం కాదని, రాజ్యాంగ పరిధిలో చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా సామాజిక న్యాయం సాధించడమే ఎన్‌డియే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు. బిసి అంటే వెనుకబడిన వారు కాదు, అవకాశం రాక వెనుకబడిన వారు మాత్రమే అని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**ఎంపిటిసి నుంచి ఎంపిగా అవకాశం:** 1984లో ఎన్టీఆర్ స్థానిక సంస్థలు, మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్‌లలో బిసిలకు

# జయహో బిసి

20శాతం రిజర్వేషన్లు కల్పించగా, 73, 74వ రాజ్యాంగ సవరణల స్ఫూర్తితో తన హయాంలో 'యాక్ట్ ఆఫ్ 5 కింద బిసిలకు 34శాతం మేర రిజర్వేషన్లు పెంచామని ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అదే కోటా ప్రకారం 1995, 2001, 2006, 2013 స్థానిక ఎన్నికల్లో 34శాతం రిజర్వేషన్లు అమలు చేశారన్నారు. పార్టీ ప్రోత్సహించి స్థానిక సంస్థల్లో భాగస్వామ్యం కల్పిస్తే క్షేత్రస్థాయి నుంచి నేతలుగా ఎదుగుతారని, కర్నూలు జిల్లాకు చెందిన ఎంపిటిసి బస్తిపాటి నాగరాజును ఎంపిగా చేసి సముచిత న్యాయం చేశామని ఉదహరించారు. పంచాయతీల నుంచి కేంద్ర మంత్రివర్గం వరకు బిసిలకు ప్రాధాన్యం ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.

**కోర్టుల్లో కేసులు వేస్తే చరిత్ర హీనులే:** శాసనసభలో ఈ ప్రకటన చేయగానే వైసిపి కోర్టుల్లో కేసులు వేసేందుకు సిద్ధంగా ఉంటుందని సిఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు. మెగా డిఎస్సీ విషయంలోనూ ఇదే తరహాలో వందలాది కేసులు వేశారని తెలిపారు. ఈ రిజర్వేషన్ల విషయంలో కోర్టులకు వెళ్లి కేసులు వేస్తే వారు చరిత్ర హీనులుగా మిగిలిపోతారని హెచ్చరించారు. ఇంతటి చారిత్రక సమావేశానికైనా వైసిపి నేతలు హాజరవుతారని భావించానని, కానీ రాకపోవడం దారుణమని సిఎం అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున కూడా జాతీయ జెండా ఎగురవేయకుండా నిర్లక్ష్యం చేస్తూ అవమానించిన వ్యక్తులను ఏమనాలని ప్రశ్నించారు. గత పాలకుల పై కేసులు 20యేళ్లుగా కింది కోర్టుకు, హైకోర్టుకూ ఊగిసలాడుతూనే ఉన్నాయని ఎద్దేవా చేశారు. 2019లో గత పాలకులు బిసి రిజర్వేషన్ల విషయంలో 176 జిఒ తెచ్చి నాటకాలు ఆడారని, సుప్రీం కోర్టుకు కూడా అప్పీలు చేయకుండా వదిలేశారని సిఎం విమర్శించారు. 559, 560 జిఒల ద్వారా రిజర్వేషన్‌లను 34శాతం నుంచి 24.15శాతానికి తగ్గించి, 16,800 మంది బిసి నాయకత్వానికి తీవ్ర అన్యాయం చేశారని మండిపడ్డారు. బిసిలకు ద్రోహం చేయడంలో వైసీపీ నెంబర్ వన్ అని ధ్వజమెత్తారు. గత పాలకులు బిసిలపై కక్షగట్టి, తమ వెనుక లేరన్న భావనతో ఇబ్బందులు పెట్టారని సిఎం తెలిపారు. అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అయ్యన్నపాత్రుడు, పల్లా శ్రీనివాస్, కూన రవికుమార్ వంటి బిసి నేతలపై కేసులు పెట్టి వేధించారని ఆరోపించారు. రేపల్లెలో అమర్నాథ్ గౌడ్ అనే కుర్రాడిని పెట్రోలు పోసి తగులబెట్టారని, టిడిపికి మద్దతిస్తున్నారన్న కారణంతో తోట చంద్రయ్య గొంతుపై కత్తిపెట్టారని, కంచర్ల జాలయ్య, నందం సుబ్బయ్య ప్రాణాలు కోల్పోయినా సిద్ధాంతాలను వదులుకోలేదని గుర్తుచేశారు. చివరికి బిసి కార్పొరేషన్లు ఏర్పాటు చేసినా కనీసం కుర్చీలు కూడా వేయకుండా అవమానించారని సిఎం చంద్రబాబు అన్నారు. ప్రసంగం ముగించగానే ముఖ్యమంత్రి వద్దకు బిసి మంత్రులు, ఎమ్మెల్యేలు వెళ్లి అసెంబ్లీ సమావేశ మందిరంలో కృతజ్ఞతలు తెలిపారు.

# అక్టోబర్‌లోగా లోకల్ పోల్స్

>> సుమారు రూ.16,500 కోట్ల నిధులు మురిగిపోకుండా అక్టోబర్‌లోగా స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయించింది. ఎపి పంచాయతీరాజ్ చట్టం1994 నిబంధనల ప్రకారం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. న్యాయపరమైన అంశాల్లో ఉన్న 23 మునిసిపాలిటీల విలీనాన్ని తర్వాత పరిశీలిద్దామని, ముందుగా అన్ని స్థానిక సంస్థల్లో ఎన్నికలు నిర్వహిద్దామని స్పష్టం చేశారు.మేయర్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో నిర్వహించాలని, పాత విధానంలో ఒక్క డిప్యూటీ మేయర్ పదవికే పరిమితం కావాలని నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో ఎలాంటి మార్పు ఉండదని, ప్రస్తుతం అమల్లో ఉన్న రిజర్వేషన్లే కొనసాగుతాయని స్పష్టం చేసింది. బిసి రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు కేబినెట్‌కు వివరించారు. ప్రస్తుతం ఉన్న 13 జెడ్పీలను జిల్లాల పునర్విభజనకు అనుగుణంగా 28 జిల్లా పరిషత్‌లుగా ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. మొత్తం 57 అజెండా అంశాలకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలే ప్రధాన అజెండాగా సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశమైంది. అసెంబ్లీలోని సీఎం ఛాంబర్‌లో సభా విరామ సమయంలో జరిగిన ఈ భేటీలో దాదాపు అన్ని అజెండా అంశాలపై చర్చ కొనసాగింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే అంశంపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకుంది.

ఇటీవల 20వ ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం పొందిన 25 ప్రాజెక్టులకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఉద్యోగాల కల్పన, పరిశ్రమలు, ఐటీ, ఇంధనం, పర్యాటక రంగాలకు సంబంధించిన కీలక ప్రతిపాదనలపై నిర్ణయాలు తీసుకున్నారు. 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్‌పై కీలక నిర్ణ యం తీసుకున్నారు. బిసి విద్యార్థులకు ఐఐటి-జెఇఇ, నీట్ కోచింగ్ సెంటర్ల ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. ప్రైవేట్ యూనివర్సిటీల ఏర్పాటు బిల్లు, ఉన్నత విద్యలో ఫీజుల నిర్ణయానికి కొత్త కమిషన్ బిల్లుపై చర్చించింది.

**ప్రత్యర్థుల కువిమర్శలు తిప్పికొట్టండి**

మంత్రివర్గ అజెండా అంశాలపై చర్చ పూర్తయిన తర్వాత ముఖ్యమంత్రి చంద్రబాబు వివిధ పరిణా మాలపై మంత్రులు, అధికారులతో చర్చించారు. డిఎస్సీ2025తో సహా, శాంతి భద్రతలపై ప్రత్యర్థి పక్షం చేస్తున్న చర్చలను బలీయంగా తిప్పికొట్టాలని సిఎం ఆదేశించారు. సామాజిక మాధ్యమంలో వస్తున తప్పుడు కథనాలపై చర్యలు తీసుకోవాల న్నారు. ద్రవ్యోల్బణం పెరుగుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సోషల్ మీడియాలో వస్తున్న నెగిటివ్ కామెంట్లపై ధీటుగా స్పందించాలని సూచించారు. మద్యం బ్రాండ్లకు పిచ్చిపిచ్చి పేర్లు పెట్టకుండా కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అక్రమంగా కంటైనర్లలో ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# గ్రామగ్రామానికి పార్టీ జెండా అదే బిజెపి అజెండా

>> అసెంబ్లీ సీట్లు లభించాయని నితిన్ నబిన్ గుర్తుచేశారు. ఈ విజయం గర్వించడానికి మాత్రమే కాదని, ప్రజలు పెట్టిన నమ్మకాన్ని నిలబెట్టుకోవడానికి మరింత బాధ్యతను పెంచిందని అన్నారు. బిజెపి- టిడిపి - జనసేన కూటమి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. బిజెపి కేవలం అధికారం కోసం ఏర్పడిన పార్టీ కాదని నితిన్ నబిన్ అన్నారు. శ్యాంప్రసాద్ ముఖర్జీ జాతీయవాదం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయం, అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన బాటలో పార్టీ ఎదిగిందన్నారు. త్యాగం, తపస్సు, సిద్ధాంతం, దేశ ప్రథమ భావన బిజెపికి పునాదులని చెప్పారు. "నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్స్ట్.. సెల్ఫ్ లాస్ట్" అనే సిద్ధాంతంతో పనిచేసే పార్టీ బిజెపి అని పేర్కొన్నారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని కార్యకర్తలకు నబిన్ పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తోందని నితిన్ నబిన్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి అభివృద్ధి, రాయ్‌పూర్- విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఎఎంసిఎ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. భారత్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని నితిన్ నబిన్ అన్నారు. యువతను ఉద్యోగాల కోసం ఎదురుచూసేవారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే వాతావరణాన్ని కేంద్రం కల్పిస్తోందన్నారు. స్టార్టప్‌లు, మేక్ ఇన్ ఇండియా, పరిశోధన, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో అవకాశాలను యువతకు వివరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా కొత్త తరంతో నిరంతరం సంభాషించాలని కార్యకర్తలకు పిలుపు నిచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి:** బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్ ప్రారంభోపన్యాసం చేస్తూ పార్టీని ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. "మన ఊరు-మన జెండా' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో బిజెపి జెండా ఎగరాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న నిధులు, రహదారులు, కాలువలు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్య కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 13,219 గ్రామ పంచాయతీల్లో బిజెపి ప్రజాప్రతినిధులు గెలిచేలా కార్యాచరణ రూపొందించాలని పివిఎన్ మాధవ్ అన్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపిటిసి, జడ్‌పిటిసి, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చైర్మన్, మేయర్ వరకు బిజెపి ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, ప్రతి జిల్లాలో పర్యటించి పార్టీ బలాన్ని పెంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు. 'ప్రజల సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని మండల స్థాయికి తీసుకెళ్లాలని మాధవ్ అన్నారు. ప్రజలు బిజెపిని ఆశ్రయిస్తే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకం కల్పించాలన్నారు. ప్రతి బూత్‌లో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించాలని, పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యువతకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విజయాలను పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక పరిణామమని పివిఎన్ మాధవ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,414 కోట్ల రివైవల్ ప్యాకేజీ



మంగళవారం విశాఖలో జరిగిన సభలో నితిన్ నబీన్‌తో రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు మాధవ్

అందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు గూగుల్ సెంటర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్ వంటి పెట్టుబడులు రావడం అభివృద్ధికి సంకేతమన్నారు. పోలవరం.. ఉత్తరాంధ్రకు నీళ్లపోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి సాగునీటి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని మాధవ్ అన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా-గోదావరి జలాల సమన్వయంతో రాయలసీమకు దక్కాల్సిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై రాష్ట్ర కార్యవర్గంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 17న 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకోనున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహించాలని పివిఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. బిజెపి కార్యక్రమాలు రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని సాగాలని మాధవ్ అన్నారు. సంత్ రవిదాస్ జయంతి, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలతో పాటు నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత, గీత కార్మికులు, యాదవులు, కుమ్మరి, కమ్మరి తదితర వర్గాలతో విస్తృతంగా అనుసంధాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'వికసిత్ భారత్ - యువ సంవాద్' వంటి కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయిలో విస్తృతంగా నిర్వహించి యువతను బిజెపికి మరింత చేరువ చేయాలని మాధవ్ అన్నారు. సమావేశంలో బిజెపి జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్, జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై.సత్యకుమార్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపిలు సిఎం రమేష్, పాకా వెంకటసత్యనారాయణ, ఆర్.కృష్ణయ్య, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, నడికుడి ఈశ్వర రావు, శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, పోతుల సునీత, జాతీయ సెల్స్ కోకన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణతో దళితులపై మోడీ రాజకీయ కుట్ర

## నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్

**బొబ్బిలి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణతో దళితులపై బిజెపి మోడీ రాజకీయ కుట్ర చేస్తున్నారని నేషనల్ ఫ్రంట్ ప్రెసిడెంట్ మాల మహానాడు అండ్ రాక్స్ డాక్టర్, ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. బొబ్బిలి సూర్య రెసిడెన్సిలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేస్తున్న వర్గీకరణ ఆయన వ్యతిరేకిస్తున్నారు. ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై బీజేపీ మోడీ రాజకీయ కుట్ర దేశవ్యాప్తంగా ఎస్సీ వర్గీకరణతో పూర్తిగా ఉనికి కోల్పోయిన మాల సామాజిక వర్గం.

ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై దేశవ్యాప్తంగా రాజకీయ కుట్ర!! ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుంది. మిత్రు లారా అసలు ఈ ఎస్సీ వర్గీకరణను శాంపుల్‌గా పంజాబ్ హర్యానాలో మొట్టమొదటిగా ఈ దేశంలో చేసింది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వమే, వర్గీకరణకు బీజం కాంగ్రెస్ పార్టీ వేస్తే దీన్ని దేశం మొత్తం చేశాడు మన మోడీ సాబ్, నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వల్ల వందలో 12కి బెనిఫిట్ జరుగుతోంది, ఇది కూడా అధికారిక లెక్క కాదు, ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను, సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారు? మోడీ అలాగే ఈ రెండు సీట్లను తెలుగు రాష్ట్రాల్లో 59 ఎస్సీ కులాలకు చంద్రబాబు, రేవంత్ రెడ్డి ఎలా పంచుతారు? ఇది దళితుల ఐక్యతపై కుట్ర కాదా అని ప్రశ్నిస్తున్నాను, సామాజిక న్యాయం దళితులకు ఇచ్చే రిజర్వేషన్లలో మాత్రమేనా ఈ దేశ సంపదలో అక్కర్లేదా మోడీ చంద్రబాబు రేవంత్ రెడ్డి క్యాబినెట్లో మంత్రి పదవుల విషయంలో సామాజిక న్యాయం అక్కర్లేదా మాల వర్గంపై కుట్ర చేస్తుంటే, ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవి కదా, ఇక చేసేదేముందని అనుకోకండి మిత్రులారా, ప్రజల తలుచుకుంటే ఏ చట్టాలైన ప్రభుత్వాలు ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందే, తెలుగు రాష్ట్రాల్లో అన్ని రాజకీయ పార్టీలు మాల సామాజిక వర్గాన్ని టార్గెట్ చేసి తొక్కేస్తూ ఉంటే మాల ప్రజా ప్రతినిధులు నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు.

# నైపుణ్యాల సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు: మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

**విజయనగరం (భోగాపురం), ఆగస్టు 18 ప్రభాతవార్త :** యువత తమకిష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, నిరంతరం శ్రమిస్తే జీవితంలో తిరుగులేని విజయాలు సాధించవచ్చని భారతదేశ గౌరవ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు భోగాపురంలో ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి సౌకర్యాలను అభినందించారు. ఓ వైపు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో దేశానికే తలమానికంగా విమానాశ్రయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తనకు మిత్రుడైన జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఎన్. రావుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ వంటి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో స్వయం ఉపాధి శిక్షణ అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, మొబైల్ మెకానిజం, ఐటీ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ద్వారా యువత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు.

**ప్రసంగంలోని ముఖ్య ముఖ్యాంశాలు:**

'ఇష్టపడిన పనిని కష్టపడి చేస్తే నష్టపడేది లేదు' అనే సూత్రాన్ని ప్రతి ఒక్కరూ నిత్యం గుర్తుంచుకోవాలని, చేసే పని పట్ల అంకితభావం, నైపుణ్యం కలగలిస్తేనే నిజమైన శక్తిమంతులుగా ఎదుగుతారని పేర్కొన్నారు. మాతృభాష కంటిచూపు లాంటిదని, ఇతర భాషలు కళ్లద్దాల వంటివని స్పష్టం చేశారు. పరభాషలను నేర్చుకోవడంలో తప్పులేదు కానీ సొంత భాషను, సంస్కృతి సంప్రదాయాలను ఎప్పటికీ విస్మరించకూడదని హితవు పలికారు. ప్రపంచం భారతదేశాన్ని గౌరవించడానికి ఇక్కడి పటిష్టమైన కుటుంబ వ్యవస్థే మూలకారణమని గుర్తుచేశారు. యువత ఖాళీ సమయాల్లో సెల్‌ఫోన్లు, టీవీలకు పరిమితం కాకుండా తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులతో గడపాలని సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అయితే పూర్తిగా యంత్రాలపై ఆధారపడకుండా మానవ సృజనాత్మక ఆలోచనలకు పదును పెట్టాలని కోరారు. ప్రతి ఒక్కరూ నిర్మాణాత్మకంగా, సానుకూల దృక్పథంతో ఆలోచించాలని, సమాజంలో ఒకరికొకరు సహాయపడుతూ టీమ్ స్పిరిట్‌తో పని చేయాలని పిలుపునిచ్చారు.

## వారం - వర్జ్యం

19-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
శ్రావణం మాసం, దక్షిణాయణం,
వర్ష ఋతువు, శుక్లపక్షం, మఖకార్తె
తి.సప్తమి రా.7.23
న.స్వాతి ఉ.6.47
వ. మ.12.56-మ.2.42
దు.ఉ.11.45-మ.12.36
రాహు.మ.12.00-మ.1.30
శుభ ఉ.7.00-ఉ.8.00

## వార్తాఫలం

**మేషం :** ఇంటియందు శుభకార్యాలు దిగ్విజయంగా పూర్తి చేస్తారు. పుస్తక పఠనం యందు ఆసక్తిగా ఉంటారు. వస్త్ర లాభం.

**వృషభం :** పాలసీ రెన్యువల్ పట్ల అప్రమత్తత వహించండి. చేపట్టిన కార్యక్రమాలు నిదానంగా పూర్తి చేస్తారు. సభలలో పాల్గొంటారు.

**మిథునం :** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కాంట్రాక్టులు దక్కుతాయి.

**కర్కాటకం :** ఇంటా బయటా ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆప్తుల నుండి సహాయ సహకారాలు అందుకుంటారు.

**సింహం :** సంబంధాలు మెరుగుపడతాయి. మిత్రులతో ఏర్పడిన విభేదాలు తొలుగుతాయి. వాహన యోగం కలదు.

**కన్య :** అనుకోని అవకాశాలు దగ్గరకు వస్తాయి. దూరపు ప్రాంతాల నుండి శుభ వార్తలు అందుకుంటారు. సోదరుల కలయిక.

**తుల :** కాలానుగుణంగా పరిస్థితులను మార్చుకోగలుగుతారు. వృత్తి, ఉద్యోగాలు, వ్యాపారాలు సానుకూలంగా ఉంటాయి. వస్త్ర లాభం

**వృశ్చికం :** కుటుంబ పురోభివృద్ధి. సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. స్పెక్యు లేషన్ లాభించదు.

**ధనుస్సు :** కార్యాలయంలో సెలవు కోసం మీరుచేసే యత్నాలు ఫలవంతం కాకపోవచ్చు ప్రయాణాలు. శుభకార్యాలలో పాల్గొంటారు.

**మకరం :** మధ్యవర్తిత్వాలు చేయడం, మానుకోవడం చెప్పదగిన సూచన. శుభ ఆహ్వానాలు అందుకుంటారు. వాహన యోగం.

**కుంభం :** ప్రయాణాలలో వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. నూతన పదవీ ప్రాప్తి కలుగుతుంది. ఇంటా బయటా ప్రోత్సాహం.

**మీనం :** పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడుతాయి. ఆ పరిచయాలు మీకు అనుకూలంగా మారుతాయి.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

19-8Pg3fVRS.qxd:19-8Pg3fVRS.qxd 1/1/02 6:47 AM Page 1



### ఎఐ నూకరాజు ఫ్యామిలీ సూసైడ్ కేసు

# అల్లుడిని చంపిందీ సాధిక్కేనా?

- పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి చంపాడంటూ ఫిర్యాదు
- కోచ్ సాధిక్‌ఖాన్‌పై మరో కేసు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కాకినాడ జిల్లా పిఠాపురం పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ) నూకరాజు కుటుంబం గోదావరి నదిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడినన ఘటనలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. షూటింగ్ కోచ్ షేక్ సాధిక్‌ఖాన్ వేధింపులు, బెదిరింపులు, ఆర్థిక దోపిడీ కారణంగానే కుటుంబం తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో సాధిక్‌ఖాన్‌పై మరో హత్య కేసు నమోదు కావడం కేసులో కొత్త మలుపుగా మారింది. కాకినాడ అశోక్‌నగర్‌కు చెందిన తిల్లపూడి నూకరాజు(61) పిఠాపురంలో పంచాయతీరాజ్ శాఖ ఏఈగా పనిచేస్తున్నారు. వచ్చే జనవరిలో ఉద్యోగ విరమణ చేయాల్సి ఉంది. కొన్నేళ్ల క్రితం ఆయన కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఏడాది జూలై 2న ఆయన కుమార్తె సౌజన్య(38) భర్త జగదీశ్‌రెడ్డి మృతి చెందారు. దీంతో భర్తను కోల్పోయిన సౌజన్య తన పదేళ్ల కుమారుడు రియాన్స్ కార్తికేయరెడ్డితో కలిసి తల్లిదండ్రుల వద్ద ఉంటోంది. ఈ సమయంలో కాకినాడలో ప్రో రైఫిల్ షూటింగ్ అకాడమీ నిర్వహిస్తున్న షేక్ సాధిక్‌ఖాన్‌తో కుటుంబానికి పరిచయం ఏర్పడినట్లు సమాచారం. సౌజన్యకు అండగా ఉంటానని నమ్మించినా నూకరాజు కుటుంబం అంగీకరించకపోవడంతో సాదిక్‌ఖాన్ తరువాత వేధింపులకు పాల్పడ్డాడని కుటుంబ సభ్యుల ఆరోపణలు. కుటుంబాన్ని చంపేస్తానని బెదిరిస్తూ బంగారం, ఆస్తులు, బ్యాంకు ఖాతాలు, లాకర్ వివరాలు తన ఆధీనంలోకి తీసుకున్నాడని ఆరోపిస్తున్నారు. సాధిక్‌ఖాన్ వేధింపులను తట్టుకోలేక నూకరాజు కుటుంబం తీవ్రనిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు:** సౌజన్య భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై కూడా అనుమానాలు వ్యక్తమవు తున్నాయి. జులై 2న తన కుమారుడికి సాధిక్‌ఖాన్ పాయిజన్ ఇంజెక్షన్ ఇచ్చి హత్య చేశాడని నూకరాజు వియ్యంకుడు భాస్కర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఈ ఘటనలో మరో వ్యక్తి పాత్ర కూడా ఉందని ఆరోపించినట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు సాధిక్‌ఖాన్‌పై మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌజన్యకు చెందిన ద్విచక్ర వాహనంలో లభించినట్లు చెబుతున్న లేఖలు కూడా కేసులో కీలక ఆధారాలుగా మారే అవకాశం ఉంది. తన భర్త జగదీశ్‌రెడ్డి మృతిపై అనుమానాలు ఉన్నాయని, సాధిక్‌ఖాన్ తనను బెదిరించి ఆస్తులు, బ్యాంకు లాకర్ తదితర వివరాలు తీసుకున్నాడని ఆమె లేఖలో పేర్కొన్నట్లు సమాచారం. తనపై మతం మారాలని ఒత్తిడి తెచ్చాడని కూడా అందులో పేర్కొన్నట్లు తెలుస్తోంది.

**ప్రత్యేక బృందాలతో గాలింపు:** ఘటనపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి, కాకినాడ జిల్లాల ఎస్పీలతో మాట్లాడి సమగ్ర విచారణ జరపాలని, ఆరోపణలు ఎదుర్కొంటున్న సాధిక్‌ఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పరారీలో ఉన్న సాధిక్‌ఖాన్ కోసం పోలీసులు పది ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలిస్తున్నట్లు సమాచారం. కుటుంబ సమస్యలు, బెదిరింపులు, వేధింపులు ఎదురైనప్పుడు ఆత్మహత్యకు పాల్పడకుండా పోలీసులను, న్యాయవ్యవస్థను ఆశ్రయించాలని అధికారులు ప్రజలకు సూచిస్తున్నారు. మరోవైపు, తల్లిదండ్రులను కోల్పోయిన బాలుడి పరిస్థితి హృదయవిదారకంగా మారింది. పూర్తి స్థాయి దర్యాప్తుతో ఈ ఘటన వెనుక ఉన్న వాస్తవాలు వెలుగులోకి రావాల్సి ఉంది.

# ఎపి పారిశ్రామికాభివృద్ధి విధానం భేష్



- డేటా లేక్, స్మార్ట్ గవర్నెన్స్ పాఠాలు మాకు నేర్పండి
- 'అమరావత్ని ప్రపంచంలోనే అద్భుత నగరం అవుతుంది
- మంత్రి లోకేష్‌తో ఢిల్లీ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి రాజధాని నిర్మాణ తీరును చూశాం. నిజంగా ఇదొక అద్భుతం అని ఢిల్లీ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మంజిందర్ సింగ్ శిర్సా ప్రశంసించారు. 'ప్రపంచంలోనే ఇదొక గొప్ప నగరంగా మారుతుంది. నారా చంద్రబాబు నాయుడు విజనరీ ముఖ్యమంత్రి. అభివృద్ధికి, దార్శనికతకు ఆయనొక విశ్వవిద్యాలయం. పబ్లిక్ ప్రైవేటు భాగస్వామ్యంలో ఎపి ప్రభుత్వం మార్గదర్శి. ఎపిని చూసి ఢిల్లీ ప్రభుత్వం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది. పెట్టుబడుల ఆకర్షణ, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అనేక రంగాల్లో మాకు మీ సహకారం కావాల్ని అని మంత్రులు లోకేష్, టిజి భరత్‌లతో ఢిల్లీ పరిశ్రమలు, ఆహారం, అటవీ పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా కోరారు. ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమలు, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా నేతృత్వంలో ఆ ప్రభుత్వానికి చెందిన ప్రత్యేక ప్రతినిధుల బృందం ఎపిలో పర్యటించి ఇక్కడి పారిశ్రామిక విధానాలు, పాలనా సంస్కరణలను అధ్యయనం చేస్తోంది. సచివాలయంలోని రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్‌టిజిఎస్)లో రాష్ట్ర పరిశ్రమల శాఖ అధికారులతో ఈ బృందం మంగళవారం సమావేశమైంది. ఈ బృందానికి రాష్ట్ర ఐటి, విద్య శాఖ మంత్రి నారా లోకేష్, పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్‌లు సాదర స్వాగతం పలికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పారిశ్రామిక విధానం గురించి వివరించారు. పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టడానికి ఎపి అన్నివిధాలా అనుకూలమైన రాష్ట్రంగా నిలుస్తోందన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే వారికి ఎలాంటి అవరోధాలు లేకుండా అనుమతులన్నీ సులభంగా వచ్చేలా సింగిల్ డెస్క్ పోర్టల్ అమలు చేస్తున్నామన్నారు. డేటా సెంటర్లు, షిప్ బిల్డింగ్, సెమీకండక్టర్స్, మెడికల్ డివైజులు, ఫార్మా, ఏరోస్పేస్, డిఫెన్స్, డ్రోన్స్‌ల మొదలు రాష్ట్రంలో 22 ప్రత్యేక క్లస్టర్లు అభివృద్ధి చేస్తున్నామన్నారు. గత రెండేళ్లుగా నూతన పారిశ్రామికాభివృద్ధి విధానం 4.0 ద్వారా సత్ఫలితాలు సాధిస్తున్నామన్నారు.

**ఎపి నుంచి మేమెంతో నేర్చుకోవాలి.. ఎపి సహకారం కావాలి**

పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామికాభివృద్ధి విధానాల అమలు తదితర అనేక అంశాల్లో ఆంధ్రప్రదేశ్‌ను చూసి మేము చాలా నేర్చుకోవాల్సి ఉందని ఢిల్లీ ప్రభుత్వ పరిశ్రమల శాఖ మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ శిర్సా అన్నారు. తాను చాలా ప్రభుత్వాలను చూస్తున్నానని కానీ డేటాను ఇంత సమర్థవంతంగా వినియోగించుకుని సత్ఫలితాలు సాధిస్తున్న రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ మాత్రమే అన్నారు. పబ్లిక్ ప్రైవేటు పార్ట్‌నర్‌షిప్‌కు ఆంధ్రప్రదేశ్ దేశానికే మార్గదర్శిగా నిలిచిందన్నారు. అమరావతిలో ఇంత పెద్ద నిర్మాణ పనులు జరుగుతుండటం చూసి ఆశ్చర్యపోయానన్నారు. ఢిల్లీలో ఇంత పెద్ద నిర్మాణాలు జరగడానికి ఆస్కారం లేదన్నారు. భవిష్యత్తులో అమరావతి ప్రపంచంలోనే ఒక గొప్ప నగరంగా అభివృద్ధి చెందుతుందనడంలో ఎంత మాత్రం అనుమానం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విశ్వవిద్యాలయం లాంటి వారని, ఆయన పుత్రులు మంత్రి నారా లోకేష్ అని కొనియాడారు. మీ విశ్వ విద్యాలయంలో ఇప్పుడు మాకు కూడా అడ్మిషన్ ఇవ్వండి అని మంత్రి సర్దార్ మన్‌జిందర్ సింగ్ చమత్కరించారు. పెట్టుబడుల ఆకర్షణ, పారిశ్రామిక విధానాల రూపకల్పన, డేటా డ్రివన్ గవర్నెన్స్ అమలు, స్మార్ట్ గవర్నెన్స్ తదితర అంశాల్లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికున్న అపార అనుభవంతో ఢిల్లీ ప్రభుత్వానికి ఎపి సహకారం అందించాలని కోరారు.

ఎపి బృందాన్ని ఢిల్లీకి పంపాలని, అక్కడ తమ అధికారులకు ఇక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, విధానాల గురించి వివరించాలని కోరారు. దీనికి మంత్రి నారా లోకేష్ స్పందిస్తూ ఢిల్లీ ప్రభుత్వానికి తాము పూర్తి సహకారం అందించడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. అనంతరం ప్రతినిధుల బృందాన్ని మంత్రి నారా లోకేష్ సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సమావేశంలో ఢిల్లీ ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి సజ్జన్ సింగ్ యాదవ్, రాష్ట్ర పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యకారుల ఆచూకీ లభించే వరకు

# గాలింపు చర్యలు



- కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ సమన్వయంతో గాలింపు ముమ్మరం
- కోనసీమ మత్స్యకారుల గల్లంతు ఘటనపై సిఎం చంద్రబాబు సమీక్ష

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కోనసీమ జిల్లా మత్స్యకారులు వున్న బోటు సముద్రంలో గల్లంతయిన ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రంగా స్పందించారు. మంగళవారం పొద్దుటే సీఎంఓ అధికారులతో ఆయన ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. మత్స్యకారుల కోసం జరుగుతున్న గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. గల్లంతైన ఎనిమిది మంది మత్స్యకారుల ఆచూకీ లభించేంత వరకు గాలింపు చర్యలను ముమ్మరం చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. బీ.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలోని ఒడలరేవు, దుమ్ములపేట, వాసలతిప్ప గ్రామాలకు చెందిన 8 మంది మత్స్యకారులు ఆగస్టు 3వ తేదీ ఉదయం 10 గంటలకు ఒడలరేవు జెట్టి నుంచి చేపల వేటకు సముద్రంలోకి వెళ్లినట్లు అధికారులు సీఎంకు వివరించారు. బయలుదేరిన గంట తర్వాత, అంటే ఉదయం 11 గంటల వరకు వారు తమ కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడారని, ఆ తర్వాత నుంచి వారి నుంచి ఎలాంటి సమాచారం అందలేదని తెలిపారు. వారి బోటులో వీహెచ్‌ఎఫ్ సెట్‌తో పాటు వ్యక్తిగత మొబైల్ ఫోన్లు కూడా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. అదే రోజు సాయంత్రం 6 గంటల ప్రాంతంలో బోటు చేపలు పట్టే ప్రదేశానికి చేరుకొని ఉండవచ్చునని అంచనా వేస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. షెడ్యూల్ ప్రకారం ఆగస్టు 12 నాటికి బోటు తిరిగి రావాల్సి ఉన్నా రాకపోవడంతో, కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. దీంతో వెంటనే గాలింపు చర్యలు ప్రారంభించామని అధికారులు సీఎంకు తెలిపారు. కోస్ట్ గార్డ్ నౌకలను అప్రమత్తం చేసి గాలింపు చేపడుతున్నామని, అలాగే కాకినాడ, భైరవపాలెం, విశాఖపట్నం, పారాదీప్ ప్రాంతాలకు చెందిన మత్స్యకార బోట్లకు కూడా సమాచారం అందించి గల్లంతైన బోటు ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నామని అధికారులు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ కోస్ట్ గార్డ్, మత్స్యశాఖ, జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేసి గాలింపు చర్యలను మరింత ఉధృతం చేయాలని ఆదేశించారు. గల్లంతైన మత్స్యకారుల కుటుంబాలతో అధికారులు నిరంతరం టచ్‌లో ఉండాలని, గాలింపు వివరాలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేస్తూ ధైర్యం చెప్పాలని సూచించారు. బాధిత కుటుంబాలు ఆందోళన చెందవద్దని, ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. మత్స్యకారులను సురక్షితంగా వెనక్కి తీసుకురావడానికి అందుబాటులో ఉన్న అన్ని మార్గాలను వినియోగించాలని స్పష్టం చేశారు.

# చంద్రబాబు బిసిల పక్షపాతి, ఆ నిర్ణయం చరిత్రాత్మకం

- శాసనసభలో బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు హర్షం



మంగళవారం అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలుపుతున్న బిసి వర్గాలకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

**విజయవాడ,ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల అమలుకు కేబినెట్ ఆమోదం తెలపటం పట్ల అసెంబ్లీ వేదికగా తెలుగుదేశం పార్టీకి చెందిన మంత్రులు, ఎంఎల్ఏలు హర్షం వ్యక్తం చేసారు.సీఎం చంద్రబాబును ఆయనను సభలో కలిసి వారంతా ధన్యవాదాలు తెలిపారు. అనంతరం బీసీలకు స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్లు కల్పించడంపై శాసనసభలో గళమెత్తారు.తమ మనోభావాలను వ్యక్తం చేసారుజగత ప్రభుత్వం రిజర్వేషన్ తగ్గించడం వల్ల బీసీలు పదవులు కోల్పోయారన్నారు. ఎన్టీఆర్ బాటలోనే నడిచి బీసీలకు మరింత అండగా నిలిచిన వ్యక్తి చంద్రబాబు అని ఎమ్మెల్యేలు గుర్తు చేసుకున్నారు. బీసీ రిజర్వేషన్లపై అసెంబ్లీలో జరిగిన చర్చలో పాల్గొన్న కూటమి పార్టీల ఎమ్మెల్యేలు స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల విధానం తెచ్చినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు.టీడీపీ వచ్చిన తర్వాతే బీసీలకు సామాజిక న్యాయం జరిగిందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు. బీసీలను చట్టసభలకు పంపిన పార్టీ టీడీపీ అని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల పెంపు అంశంపై శాసనసభలో నిర్వహించిన చర్చలో మంత్రులు అచ్చెన్నాయుడు, సవిత, కొల్లు రవీంద్ర, పలువురు ఎమ్మెల్యేలు మాట్లాడారు. బలహీనవర్గాలు ఎప్పుడూ టీడీపీకు అండగా ఉంటున్నాయని అచ్చెన్నాయుడు అన్నారు. 1987లో మొదటిసారి ఎన్టీఆర్ హయాంలో స్థానిక సంస్థల్లో బీసీలకు 20 శాతం రిజర్వేషన్లు కల్పించారు. 1995లో చంద్రబాబు వాటిని 34 శాతానికి తీసుకొచ్చారు. 2020 వరకు స్థానిక సంస్థల్లో ఏ ఎన్నికలు జరిగినా ఎలాంటి ఇబ్బందీ లేకుండా 34 శాతం రిజర్వేషన్లు అమలయ్యాయి. 2019లో జగన్ సీఎం అయ్యాక రాష్ట్రానికి శని పట్టింది. బీసీలపై దమనకాండ జరిగింది. ఆ వర్గాల నేతలపై దాడుల చేసి హింసించారు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా టీడీపీకి బీసీలు అండగా నిలిచారు. అందుకే జగన్ కక్షగట్టారు. చట్టసవరణ చేయకుండా రిజర్వేషన్లు పెంచారు. బీసీలకు మాయమాటలు చెప్పారు. పెంచిన రిజర్వేషన్లపై కోర్టులో కేసు వేయించి వాటిని అమలు చేయకుండా అడ్డంకులు సృష్టించారు. హైకోర్టు ఆ జీవోను కొట్టివేసింది. బాధ్యత గల ప్రభుత్వం అయితే అప్పుడే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. కానీ అలా జరగలేదు. ఆదరాబాదరాగా 24 శాతంతో స్థానిక ఎన్నికలు నిర్వహించారు. దీంతో బీసీలకు చాలా అన్యాయం జరిగింది. సర్పంచ్‌లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, మేయర్ పదవులు చాలా వరకు బీసీలకు దక్కలేదన్నారు, ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్, బండారు సత్యానంద్, షాజహాన్ బాషా మాట్లాడుతూ బీసీలు అంటేనే టీడీపీ, టీడీపీ అంటేనే బీసీలు అన్నారు. టీడీపీ వచ్చాకే బీసీలకు రాజకీయ ప్రాధాన్యం దక్కిందన్నారు. 2016లో బీసీలకు సబ్‌ప్లాన్ తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని కొనియాడారు. బీసీలకు సబ్‌ప్లాన్‌ను ఎందుకు రద్దు చేశారో జగన్ చెప్పాలని, బీసీ పథకాలకు ఎందుకు రద్దు చేశారని, బీసీల రిజర్వేషన్లపై జగన్ సుప్రీంకోర్టుకు ఎందుకు వెళ్లలేదు నిలదీశారు. రిజర్వేషన్ల పెంపు వల్ల బీసీల జీవితాల్లో అనేక మార్పులు వస్తాయన్నారు. ఈ నిర్ణయంతో చంద్రబాబు దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. తల్లికి వందనం పేరుతో బీసీ విద్యార్థులు చదువుకునేలా అండగా ఉన్నారని, గ్రామస్థాయి నుంచి బీసీలకు రాజకీయ అవకాశాలు ఇచ్చే నిర్ణయమన్నారు. బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పించిన ఘనత టీడీపీదేనని తెలిపారు. గ్రామం నుంచి వచ్చిన సామాన్య కార్యకర్తను కూడా టీడీపీ మంత్రిగా చేసిందన్నారు. ఎందరో బీసీలను చట్టసభ సభ్యులు చేసిన ఘనత ఎన్టీఆర్‌దని, టీడీపీ చొరవ వల్లే అనేకమంది బీసీ వ్యక్తులు సభలో ఉన్నారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. అన్ని రంగాల్లో సామాజిక న్యాయం ఉండాలని టీడీపీ కోరుకుంటోందన్నారు. జగన్ హయాంలో అనేక బీసీ పథకాలను నిర్వీర్యం చేశారని, బీసీ నాయకులను అణగదొక్కారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వంలో అనేకమంది బీసీలు మంత్రులు అయ్యారన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. టీడీపీకి, బీసీలకు విడదీయరాని అనుబంధం ఉందని గుర్తు చేశారు. వైఎస్సార్సీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 నుంచి 24 శాతానికి తగ్గించడంతో 16,800 పదవులను బీసీలు కోల్పోయారని మంత్రి సవిత ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీల కోసం బడ్జెట్ కేటాయింపులు పెంచడంతో పాటు గీత కార్మికులు, వడ్డెరలు, నాయీ బ్రాహ్మణులు, చేనేతలు, మత్స్యకారులకు పలు ప్రత్యేక ప్రయోజనాలు కల్పించిందన్నారు. బీసీలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ల కోసం అసెంబ్లీలో తీర్మానం చేశామని, నామినేటెడ్ పోస్టుల్లోనూ 34 శాతం రిజర్వేషన్లకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 34 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకోవడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత కృతజ్ఞతలు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లడం శుభవార్త అని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. వైఎస్సార్సీపీ హయాంలో బీసీలను అణచివేయాలని ప్రయత్నించారని చెప్పారు. టీడీపీ బీసీ నేతలపై కేసులు పెట్టారని ఎంతోమందిని పొట్టన పెట్టుకున్నారన్నారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన తోట చంద్రయ్యను నడిరోడ్డుపై హత్య చేశారని నందం సుబ్బయ్య, అమర్నాథ్ గౌడ్‌ను చంపేశారన్నారు.

## వెయిట్‌లిఫ్టర్ గురునాయుడిని సత్కరించిన శాప్ చైర్మన్ రవినాయుడు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వెయిట్‌లిఫ్టర్ గురునాయుడిని శాప్ ఛైర్మన్ రవినాయుడు సత్కరించారు. ఉజ్బెకిస్తాన్‌లో వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో గురునాయుడు 3 రజతాలు సాధించారు. గురునాయుడు స్వస్థలం విజయనగరం జిల్లా నెల్లిమర్ల మండలం చందకపేట. గురునాయుడు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని శాప్ ఛైర్మన్ ఆకాంక్షించారు. గురునాయుడికి త్వరలో ప్రోత్సాహకాలు అందజేస్తామని శాప్ ఛైర్మన్ హామీ ఇచ్చారు.

## మంత్రి నారాయణను కలిసిన విఎంసి కాంట్రాక్టర్లు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడలో పెండింగ్ బకాయిల చెల్లింపుపై మంత్రి నారాయణను వీఎంసీ కాంట్రాక్టర్లు కలిశారు. తక్షణం రూ.50 కోట్లు చెల్లించేందుకు మంత్రి నారాయణ సుముఖత వ్యక్తం చేశారు. మిగిలిన బకాయిలు ఎలా చెల్లిస్తారని కాంట్రాక్టర్లు స్పష్టమైన హామీ కోరారు. మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులతో చర్చించి చెబుతానని మంత్రి చెప్పారు. బకాయిలు చెల్లించే వరకూ సమ్మె విరమించేది లేదని కాంట్రాక్టర్లు తెలిపారు.

## ఎపి గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా నాగబాబు నియామకం పట్ల మంత్రి దుర్గేష్ హర్షం

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం, పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తూ ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఫర్ ఎకలాజికల్ ఎన్‌రిచ్‌మెంట్ (ఏపీ గ్రీన్) ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్‌పర్సన్‌గా కేబినెట్ హోదా కల్పిస్తూ ఎమ్మెల్సీ కొణిదెల నాగేంద్రరావు (నాగబాబు) నియామకం పట్ల మంత్రి కందుల దుర్గేష్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ నాగబాబు నేతృత్వంలో "పచ్చని ఆంధ్రప్రదేశ్ – ఆరోగ్యకరమైన ఆంధ్రప్రదేశ్" ఆశయ సాధన దిశగా రాష్ట్రం వేగంగా అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఏపీ గ్రీన్ లక్ష్యాలు, కార్యక్రమాల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, జిల్లా స్థాయి సంస్థల మధ్య సమన్వయం సాధించడంతో వాటి పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వంటి కీలక బాధ్యతలను ఎమ్మెల్సీ నాగబాబు సమర్థ వంతంగా నిర్వహిస్తారని మంత్రి దుర్గేష్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఎఫ్‌సివి పొగాకు కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- నోబిడ్స్ మరింత తగ్గాలి.. రైతులకు మెరుగైన ధర దక్కేలా చర్యలు చేపట్టాలి
- పొగాకు బోర్డు ఉన్నతాధికారులతో మంత్రి అచ్చెన్నాయుడు సమీక్ష



**విజయవాడ ఆగస్టు 18 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఎఫ్‌సీవీ పొగాకు వేలాలు, కొనుగోళ్ల తాజా పరిస్థితిపై మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పొగాకు బోర్డు సంబంధిత ఉన్నతాధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కొనుగోళ్ల వేగం పెరగడం, నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతుండటం సానుకూల పరిణామమని పేర్కొన్న మంత్రి, ఇదే వేగాన్ని కొనసాగిస్తూ రైతులకు మరింత మెరుగైన ధర లభించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇప్పటివరకు 117 వేలాలు పూర్తయ్యాయని, సుమారు 60 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు జరిగిందని, ప్రస్తుతం సగటు ధర కిలోకు సుమారు రూ.210 వద్ద కొనసాగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. ఇటీవల రోజుల్లో కొనుగోళ్ల వేగం పుంజుకుని రోజుకు సగటున 1.5 నుంచి 2 మిలియన్ కిలోల వరకు అమ్మకాలు జరుగుతున్నాయని తెలిపారు. అదే సమయంలో నోబిడ్ శాతం క్రమంగా తగ్గుతూ రావడం రైతులకు ఊరటనిచ్చే పరిణామమని మంత్రి పేర్కొన్నారు. పొగాకు రైతుల ప్రయోజనాలే ప్రాధాన్యంగా కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. పొగాకు కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో మరోసారి చర్చించి కొనుగోళ్ల పరిమాణాన్ని పెంచాలని, "నోబిడ్స్"ను మరింత తగ్గించాలని పొగాకు బోర్డు అధికారులకు సూచించారు. ముఖ్యంగా రైతులకు లభిస్తున్న సగటు ధర మరింత పెరిగేలా కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పొగాకు రైతులు ఇబ్బందులు పడకుండా వేలాలు, కొనుగోళ్ల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. రైతులకు మెరుగైన ధర దక్కేలా పొగాకు బోర్డు, కొనుగోలు కంపెనీలు, ట్రేడర్లతో సమన్వయం చేసుకుంటూ అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## నేడు చెన్నైకి సిఎం చంద్రబాబు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆగస్టు 19, 20 తేదీల్లో చెన్నైలో పర్యటించనున్నారు. ఈ మేరకు సీఎం పర్యటన షెడ్యూల్ ఖరారైంది. రేపు సాయంత్రం 5:30 గంటలకు విజయవాడ ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో చెన్నై వెళ్లనున్నారు. ఆగస్టు 19వ తేదీ రాత్రి చెన్నైలోని తాజ్ ఫిషర్‌మ్యాన్స్ కోవ్ రిసార్ట్‌లో ముఖ్యమంత్రి బస చేయనున్నారు. ఆగస్టు 20వ తేదీన ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు జరిగే 31వ సదరన్ జోనల్ కౌన్సిల్ సమావేశంలో సీఎం పాల్గొననున్నారు. అనంతరం ఆగస్టు 20వ తేదీ సాయంత్రం 5:15 గంటలకు ఉండవల్లి నివాసానికి సీఎం చంద్రబాబు చేరుకోనున్నారు.

## కేంద్ర మంత్రి నిర్మలకు జన్మదిన శుభాకాంక్షల వెల్లువ



**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ జన్మదినం సందర్భంగా "ఎక్స్"లో వేర్వేరు పోస్టుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్మలా సీతారామన్‌కు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని దేవుడిని ప్రార్థించారు. ఆపారమైన శక్తితో దేశ ప్రగతిని ఆమె ముందుకు నడిపించాలని ఆకాంక్షించారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా చంద్రబాబు, లోకేశ్ పోస్టు పెట్టారు. ర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ గారికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆయురారోగ్యాలతో సంతోషంగా నిండు నూరేళ్ల జీవించాలని కోరుకుంటున్నాను. దేశ ప్రగతికి మీరు అదే అంకితభావం, అవిశ్రాంత శక్తితో మార్గనిర్దేశం చేస్తూ మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాను అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.,నిర్మలా సీతారామన్‌కు మంత్రి నారా లోకేశ్ కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు కొనసాగాలని ఆకాంక్షించారు. కేంద్ర మంత్రికి మంచి ఆరోగ్యం, సంతోషం, మరింత శక్తి లభించాలని దేవుడిని కోరారు. రాబోయే ఏడాది మరిన్ని విజయాలు సాధించాలని లోకేశ్ ప్రార్థించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. నిరంతరంగా అత్యధిక కాలం కేంద్ర ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ సేవలందిస్తున్నారని వ్యాఖ్యానించారు. నిర్మలా సీతారామన్ నాయకత్వంలో భారత ఆర్థిక ప్రస్థానం మరింత బలోపేతమైందని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. నిర్మలా సీతారామన్ నాయకత్వంలో భారత్ ప్రపంచంలో నాల్గో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని పవన్ కల్యాణ్ ప్రశంసించారు.

## బిజెపి నూతన బాధ్యులకు పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** బీజేపీ జాతీయ స్థాయిలో పదవులు పొందిన నేతలకు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ ఉపాధ్యక్షులుగా ఎన్నికైన దగ్గుబాటి పురందేశ్వరి, రామ్ మాధవ్‌లను ఆయన అభినందించారు. అన్ని విభాగాల సంయుక్త సమన్వయకర్తగా నియమితులైన విష్ణువర్ధన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. జాతీయ కార్యవర్గంలో చోటు దక్కించుకున్న మిగతా నాయకులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

# పోలీసుల దెబ్బలు తట్టుకోలేక ఒకరి మృతి?

**సాలూరు, ఆగస్టు 18, ప్రభాతవార్త:** సాలూరు మున్సిపల్ పరిధి గుమడం గ్రామంలో ఏప్రిల్ నెలలో జరిగిన బంగారం దొంగతనం కేసులో రెండవ ముద్దాయి (ఏ2) బండారు. మణికంఠ (22) పట్టణ పోలీసులు దెబ్బలు తాళలేక మరణించినట్లు ఆ యువకుడు తల్లి అనురాధ, సోదరుడు సతీష్ ఆరోపిస్తున్నారు. వారు చెప్పిన వివరాలు ప్రకారం బంగారం చోరీ కేసులో మొదటి ముద్దాయి(ఏ1) గోల్డ్ దొంగతనం చేయగా అమ్మేందుకు సహకరించాడనే నెపంతో మణికంఠపై కేసు నమోదు చేసి ఎఫ్ఐఆర్‌లో చేర్చారన్నారు. ఈ మధ్యన ఆ దొంగతనం కేసు ఛేదించిన టౌన్ పోలీసులు మణికంఠను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. అంతేకాకుండా విచారణలో భాగంగా తీవ్రంగా కొట్టడంతో గాయాలు పాలై సోమవారం మరణించాడని చెప్పారు. ఇది ఇలా ఉంచితే కొంతకాలం క్రితం గుమడకు చెందిన యువకుడితో మణికంఠకు పరిచయం కాగ అతను దొంగతనం చేసిన బంగారం అమ్మేందుకు అలాగే ఆ డబ్బులు తన బ్యాంక్ ఎకౌంట్‌లో పడడంతో మణికంఠను పోలీసులు అదుపులోకి తీసుకున్నారని సమాచారం. విచారణలో ఈ విషయం తెలుసుకున్న పోలీసులు ఆ యువకుడ్ని ఆగస్టు 7 అదుపులోకి తీసుకొని రెండు రోజులు చిత్రహింసలకు గురి చేసినట్టు తెలుస్తుంది. అలాగే 9 తేదీన అరెస్టు చూపెట్టారని తల్లి సోదరుడు స్టేషనుకు వెళ్లి మణికంఠను చూపెట్టమన్నా చూపెట్టలేదని అరోపలు వినిపిస్తున్నాయి. ఆ తరువాత మణికంఠ తీవ్ర అస్వస్థకు గురికావడంతో ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లిన తర్వాత పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చినట్టుగా తెలుస్తుంది. వెంటనే ఆసుపత్రికి కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి తీవ్ర గాయాలతో ఆ యువకుడు ఉన్నాడని తల్లి సోదరుడు ఆరోపణ. వైద్యులు విజయనగరం రిఫర్ చేయగా మెడికవర్ హాస్పిటల్లో చేర్పించి చికిత్స అందించినప్పటికీ మణికంఠ మరణించాడని తెలిపారు. దీనికి పోలీసుల కారణమని, వారిపై చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి ఆందోళన చేస్తూ నిరసన చేపట్టారు.

**సవరణ**

ది.17.08.2026 వ తేదీన జిల్లా కలెక్టరు, తూర్పు గోదావరి, రాజమహేంద్రవరం వారి కార్యాలయం నుండి వెలువడిన ప్రాథమిక ప్రకటన నందు క్రమ సంఖ్య 78 లో సర్వే నెంబరు మరియు సంబంధిత ఆసామి పేరు పడియుండలేదు. కావున వాటిని సవరణ చేయడమైనది గమనించగలరు.

| | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 78 | 1839 (Old LPM No.1181) | 0.52 | 0.502 | నంజ | నంగూరి హేమ భర్త ముస్నీ | 1178 | 1268, 1180 | 1219 | 1838 | తాటి చెట్టు-2 |

జిల్లా కలెక్టరు, తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం.

# తిరుమల సమాచారం



## సెప్టెంబర్ 15నుండి సాలకట్ల బ్రహ్మోత్సవాలు

**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు సప్తగిరులు సిద్ధమవుతున్నాయి. తొమ్మిదిరోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు సెప్టెంబర్ 15నుండి 23వ తేదీ వరకు అంగరంగవైభవంగా చేపట్టనున్నారు. బ్రహ్మోత్సవాల కార్యాచరణను టిటిడి ఖరారుచేసింది. భగవంతుని వాహనసేవలను ఆలయ మాఢవీధుల్లో నిర్వహించేందుకు అన్ని రకాల ఏర్పాట్లు చేయడంపై, భక్తులకు ఇబ్బంది లేకుండా వాహనసేవల వీక్షణకు సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందించారు. బ్రహ్మోత్సవాల నిర్వహణ విషయంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగంతో సమన్వయం చేసుకుని విజయవంతంగా భక్తుల నడుమ బ్రహ్మోత్సవాలను వైభవంగా జరిపించేలా టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రణాళికలు రూపొందించి అమలు చేయిస్తున్నారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేశారు. సామాన్య భక్తులకు ఎక్కువగా దర్శన సమయం కల్పించేందుకు ఆ తొమ్మిది రోజులు బ్రేక్ దర్శనాలు కూడా రద్దయ్యాయి.

## జోరుగా పుష్కరిణి మరమ్మతు పనులు



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శేషాచలంకొండల్లో తిరుమల క్షేత్రంలో వేలపుణ్యతీర్థాలు కలిసే స్వామివారి పుష్కరిణి మరమ్మతులు, శుద్ధిచేసే పనులు వేగంగా సాగుతున్నాయి. గత రెండు వారాలుగా పుష్కరిణిని పూర్తిగా మూసివేసిన టిటిడి ఇంజనీరింగ్ అధికారులు ఈ నెలరోజుల పాటు వివిధ రకాల మరమ్మతు పనులు చేస్తారు. ఈ నెలరోజులు భక్తులు స్నానాలాచరించేందుకు వరాహస్వామి ఆలయం సమీపంలో స్నానకుళాయిలు ఏర్పాటుచేశారు. అలాగే సెప్టెంబర్ 10వరకు కూడా భక్తులను అనుమతించరు. ఇప్పటికే పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి పైపులైన్ల మరమ్మతులు, సివిల్ పనులు చేపడుతున్నారు. ఈ పనులను అదనపు ఇఒ వెంకయ్యచౌదరి తనిఖీ చేసి సూచనలు చేశారు.

## కూరగాయల దాతల సేవలు కీలకం

- టిటిడి అదనపు ఇఒ వెంకయ్య చౌదరి



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీవారి అన్న ప్రసాద వితరణలో కూరగాయల దాతల సేవలు అత్యంత కీలకమైనవని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి తెలిపారు. మంగళవారం తిరుమల పద్మావతి అతిథిగృహంలోని సుధర్మ సమావేశ మందిరంలో కూరగాయల దాతలతో సమావేశం నిర్వహించారు. అన్న ప్రసాద విభాగం ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో కూరగాయల సరఫరా, రవాణా, నిల్వ, వినియోగం, నాణ్యత, భవిష్యత్ అవసరాలు తదితర అంశాలపై దాతలతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నాలుగైదు నెలలుగా తిరుమలలో రోజుకు సుమారు 4 లక్షల మందికి అన్నప్రసాదం అందిస్తున్నామని, ఇందుకోసం రోజుకు సుమారు 13-14 టన్నుల బియ్యం, 8 టన్నులకు పైగా కూరగాయలు వినియోగిస్తున్నామని చెప్పారు. ఇంత భారీ స్థాయిలో కూరగాయలను నిరంతరం దాతల ద్వారా సమకూర్చడం విశేషమన్నారు. అన్నప్రసాదం అవసరాలకు అనుగుణంగా ఏ సమయంలో ఏ కూరగాయ ఎంత అవసరమో ముందుగానే ప్రణాళిక రూపొందించి, దాతలతో సమన్వయం చేసుకుని కూరగాయలను స్వీకరిస్తున్నామని వివరించారు. దీంతో కూరగాయల రిజెక్షన్, నష్టాలను గణనీయంగా నియంత్రించగలిగామని చెప్పారు. నాణ్యత, ప్యాకింగ్, రవాణా తదితర అంశాల్లో దాతలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని అభినందించారు. రాబోయే రెండు బ్రహ్మోత్సవాల్లోనూ కూరగాయల దాతలు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించేందుకు ముందుకు వచ్చారని అదనపు ఈవో తెలిపారు. అన్న ప్రసాదాలకు కూరగాయలను అందిస్తున్న దాతల సేవలను అభినందిస్తూ, వారిని మరింత ప్రోత్సహించేలా టిటిడి చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా కూరగాయల దాతలను లడ్డూ ప్రసాదాలతో సత్కరించి, శ్రీవారి దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఈ సమావేశంలో అన్న ప్రసాదం డిప్యూటీ ఇఒ రాజేంద్ర, క్యాటరింగ్ ప్రత్యేక అధికారి శాస్త్రి పాల్గొన్నారు.

## 20, 21న వెంగమాంబ వర్ధంతి ఉత్సవాలు



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** వేంకటేశ్వరస్వామిని తన సర్వస్వంగా భావించి భక్తి సాహిత్యంతో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించిన భక్త కవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 209వ వర్ధంతి ఉత్సవాలు ఈనెల 20, 21 తేదీల్లో తిరుమల, తిరుపతి, తరిగొండలో టిటిడి ఘనంగా నిర్వహించనుంది. వెంగమాంబ జన్మస్థలమైన తరిగొండలోని లక్ష్మీనృసింహా స్వామి ఆలయంలో ఆగస్టు 21న లక్ష్మీ మ్నృసింహ స్వామి కల్యాణోత్సవం నిర్వహిస్తారు.

# తినేదంతా నెయ్యేనా?



## హైదరాబాద్‌లో విస్తరిస్తున్నకల్తీనెయ్యి మాఫియా

- 130 చోట్ల దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్, హెచ్. ఫాస్ట్
- 36 టన్నుల కల్తీనెయ్యి, రసాయనాలు స్వాధీనం

**హైదరాబాద్, ఆగస్టు 18 ప్రభాతవార్త:** హైదరాబాద్ లో మరోసారి భారీగా కల్తీ ఆహార ఉత్పత్తులు పట్టుబడ్డాయి. నగర టాస్క్‌ఫోర్స్ పోలీసుల తో పాటు హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్ ఫాస్ట్), బల్దియాలోని ఫుడ్ సేఫ్టీ విభాగం నగర వ్యాప్తంగా జరిపిన దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యితో పాటు దీని తయారీకి వాడే పాం ఆయిల్, డాల్డా సహా రసాయనాలను జప్తు చేశారు. ఈ సందర్భంగా కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వ్యాపారులు, వీటిని విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాయని పోలీసు కమి షనర్ వి.సి సజ్జన్నర్ తెలిపారు. మంగళవారం కమాండ్ కంట్రోల్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కొందరు వ్యక్తులు మాఫియాగా మారి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. కల్తీ ఆహార వస్తువుల తయారీ కేంద్రాలతో పాటు వీటి వి క్రయ సంస్థల గురించి సమాచారం అందగానే దాడులు చేబట్టినట్లు తెలిపారు. మొత్తం 130 ప్రాంగణాల్లో 39 తయారీ కేంద్రాలతో పాటు 91 విక్రయ కేంద్రాలలో దాడులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. దాడుల్లో 36 టన్నుల కల్తీ నెయ్యి పట్టుబడిందని ఆయన తెలిపా రు. పట్టుబడ్డ కల్తీ నెయ్యి శాంపుల్స్‌ను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపామని ఆయన వెల్లడించారు. దీనిపై ఫుడ్ సేఫ్టీ అథారిటీ అధికారులు విచారిస్తున్నారని కమిషనర్ తెలిపారు. స్వాధీనం చేసుకున్న కల్తీ నెయ్యిలో 25,5 టన్నుల వివిద రకాల నూనెతో పాటు 8.7 టన్నుల క్రీం వు ందని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీ లో వాడేందుకు 1200 లీటర్ల పాం ఆయిల్, 600 లీటర్ల వనస్పతి, కృత్రిమ సువాసన కోసం ఆరు బాటిళ్ల రసాయనాలు, 30 కిలోల పిండి పదార్థం వుందని ఆయన వెల్లడించారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో నేరగాళ్లు పక్కాగా వ్యవహరిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. నెయ్యి తయారీకి పాల నుంచి వచ్చిన వెన్న ముఖ్యం కాగా కల్తీ నెయ్యిలో దీనికి భిన్నంగా పాం ఆయిల్‌తో పాటు రసాయనాలు, కొద్దిపాటి పాలపౌడర్‌ను వాడుతున్నారని ఆయన తెలిపారు. ఇలా తయారు చేసిన కల్తీ నెయ్యి చూసేందుకు అసలైన నెయ్యిలాగే వుండేలా చక్కగా ప్యాకింగ్ చేసి 100 గ్రాముల నుంచి ఒక్క కిలో వరకు డబ్బాలలో వుంచి అమ్ముతున్నారని ఆయన తెలిపారు. వీటికి ప్రీమియం నెయ్యి, ప్యూర్ నెయ్యి, ఫార్మ్ ఫ్రెష్ నెయ్యి, నేచురల్ నెయ్యి అనే పేర్లను వాడుతున్నారని కమిషనర్ తెలిపారు. అయితే వీటిపై ఎ లాంటి లైసెన్స్ నంబర్, బ్యాచ్ నంబర్‌లు వుండడం లేదని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యిని ఎక్కువగా పూజ గదుల్లో వాడే దీపాలకు, రెస్టారె ంట్లకు, టిఫిన్ సెంటర్లకు, స్వీట్ షాపులకు, ఆయుర్వేద మందుల దుకాణాలకు, డెయిరీ షాపులు, స్టార్ హోటళ్లకు విక్రయిస్తున్నట్లు తేలిందని ఆయన తెలిపారు. కాగా కల్తీ నెయ్యి తయారీలో వాడుతున్న మిల్క్ క్రీంను మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి తయారీదారులు తెప్పిస్తున్నారని కమిషనర్ తెలిపారు. కల్తీ నెయ్యిని తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాలకు కూడా అ మ్ముతున్నారని ఆయన వెల్లడించారు. కల్తీ నెయ్యి వాడడం వల్ల తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం వుందని కమిషనర్ వెల్లడించారు. కల్తీ నెయ్యిని తయారు చేస్తున్న వారు ఎప్పటి నుంచి వీటిని తయారు చేస్తున్నారు? ఎంతమేరకు విక్రయించారు? ఎక్కడెక్కడ అమ్మారు? వీటిని వాడిన వారు ఎవరు? అనే విషయాలపై సమాచారం సేకరిస్తున్నామని ఆయన తెలిపారు. కల్తీ నెయ్యి తయారీదారులపై కఠినంగా వ్యవహరిస్తామని, వీటిని అమ్మేవారిని కూడా వదలబోమని ఆయన హెచ్చరించారు. ప్రజలు కూడా కల్తీ ఉత్పత్తుల విషయంలో జాగ్రత్తగా వుండాలని, తక్కువ ధరకు లభించే వస్తువులను కొనవద్దని, నాణ్యమైన వాటినే కొనాలని సజ్జన్నర్ సూచించారు, కల్తీ ఆహార వస్తువులకు సంబంధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెంటనే 8712661212కు తెలపాలని ఆయన కోరారు. కల్తీ నెయ్యిని పట్టుకున్న పోలీసులను ఆ యన అభినందించారు. ఈ సమావేశంలో శాంతి భద్రతల అదనపు పోలీసు కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్, టాస్క్‌ఫోర్స్ డిసిపి వైభవ్ గైక్వాడ్ సహా ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన నర్సులకు జర్మనీలో ఉద్యోగాలు

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏపీలోని ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన మహిళా నర్సులకు జర్మనీలో ప్రతిష్ఠాత్మక ఉద్యోగాలు కల్పించేందుకు ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎంపికైన వారికి నెలకు రూ. 2.75 లక్షల నుంచి రూ. 3.30 లక్షల వరకు ఆకర్షణీయమైన వేతనం లభించనుంది. ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో జర్మనీ జాబ్ ఆపర్చునిటీ ప్రోగ్రామ్‌ఖ పేరుతో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. దీని కింద అర్హులైన అభ్యర్థులకు విశాఖపట్నం, తిరుపతి, గుంటూరుల్లోని నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో శిక్షణ ఇస్తారు. 8 నుంచి 10 నెలల పాటు సాగే ఈ శిక్షణలో జర్మన్ భాషలో బీ2 స్థాయి వరకు నైపుణ్యం కల్పిస్తారు.
సాంఘిక, గిరిజన సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో శిక్షణ కాలంలో ఉచిత వసతి సౌకర్యం కూడా అందిస్తారు. శిక్షణకు సంబంధించిన పరీక్ష ఫీజును అభ్యర్థులు ముందుగా చెల్లించాల్సి ఉన్నా, ఆ మొత్తాన్ని తర్వాత తిరిగి చెల్లిస్తామని అధికారులు తెలిపారు. ఈ అవకాశానికి 18 నుంచి 35 ఏళ్లలోపు వయసున్న ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు చెందిన మహిళలు అర్హులు. జీఎన్ఎం లేదా బీఎస్సీ (నర్సింగ్) పూర్తి చేసి ఉండాలి. దీంతో పాటు ఆసుపత్రిలోని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్ (ఓటీ) లేదా కార్డియాలజీ విభాగాల్లో కనీసం మూడేళ్ల పని అనుభవం తప్పనిసరి. ఎంపికైన అభ్యర్థులకు వీసా, విమాన టికెట్లతో పాటు ఇతర ప్రయాణ ఖర్చులను జర్మనీలోని నియామక సంస్థలే భరిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా సంబంధిత వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. దరఖాస్తు సమయంలో జనన ధ్రువపత్రం, విద్యార్హత, అనుభవం, కులం, ఆధార్, పాస్‌పోర్ట్ వంటి పత్రాలను జతచేయాలి. పాస్‌పోర్ట్ ప్రస్తుతం అందుబాటులో లేనివారు శిక్షణ పూర్తయ్యేలోగా సమర్పించేందుకు వెసులుబాటు కల్పించారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలి

### 30నుండి కారీరి ఇష్టి, పర్జన్య శాంతి యాగం



**తిరుమల, ఆగస్టు 18 ప్రభాత వార్త ప్రతినిధి:** రాష్ట్రంలో పంటలు పండి, సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రజలందరూ క్షేమంగా ఉండాలని కోరుతూ ఈ నెల 30వ తేదీ నుండి అయిదు రోజుల పాటు ధర్మగిరి వేదపాఠశాలలో వరుణ యాగాన్ని నిర్వహించేలా టిటిడి కీలక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా వర్షాలు పడి నీటి సమస్య లేకుండా ఉండాలని ఆకాంక్షి స్తూ ధర్మగిరి వేదవిజ్ఞానపీఠం ఆధ్వర్యంలో వరుణయాగాన్ని నిర్వహించాలని ముహుర్తాన్ని నిర్ణయించారు. ఇందులో భాగంగా వేదవిజ్ఞానపీఠంలో యాగకర్త, రుత్వికుల సమక్షంలో ఆగస్టు 30, 31, సెప్టెంబరు 1, 2, 3 తేదీల్లో వరుణ యాగాన్ని నిర్వహించనున్నారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిని ప్రార్థిస్తూ తిరుమలలో ఆగస్టు 30 నుండి వరుణయాగం (కారీరి ఇష్టి, పర్జన్య శాంతి) నిర్వహించ నున్నారు. తిరుమల ధర్మగిరి వేదవిజ్ఞాన పీఠంలో నిర్వహించనున్న యాగంతో వర్షాలు సమృద్ధిగా కురిసి, ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించనున్నారు.



## నషా ముక్త్ భారత్ అభియాన్‌లో జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞ

**తిరుపతి, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** తిరుపతి పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నషా ముక్త్ భారత్ అభియాన్ ఆరో సంవత్సరం సందర్భంగా విశ్వవిద్యాలయంలోని వివిధ విభాగాల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా జాతీయ ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. భారత ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలతో నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు, బోధనా బోధనేతర సిబ్బందిలో మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరినీ భాగస్వాములను చేయడం ప్రధాన లక్ష్యంగా చేపట్టారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, అధ్యాపకులు బోధనేతర సిబ్బంది చురుకుగా పాల్గొన్నారు. ఎన్ఎంబీపీ పోర్టల్ ద్వారా ఈప్రతిజ్ఞ నిర్వహించగా, ప్రతిజ్ఞను విజయవంతంగా పూర్తి చేసిన పాల్గొనేవారికి అందుబాటులో ఉన్న పాల్గొని ధృవపత్రాలను డౌన్‌లోడ్ చేసుకునేలా ప్రోత్సహించారు.

## తిరుపతిని దేశానికి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతాం



**తిరుపతి, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** ఢిల్లీ చర్చల నుండి క్షేత్రస్థాయి పరిశీలనల వరకు తిరుపతిని దేశానికి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని తుడ ఛైర్మన్ డాక్టర్ సి.దివాకర్‌రెడ్డి తెలిపారు. తిరుపతిని సుస్థిర, పర్యావరణహిత, వరదలను తట్టుకునే ఆధునిక నగరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో తుడా రూపొందించిన 750 కోట్ల "క్లైమేట్ రెసిలియంట్ ఇంటిగ్రేటెడ్ వాటర్ మేనేజ్‌మెంట్ - సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్ ప్రాజెక్టు అమలు దిశగా మరో కీలక ముందడుగు పడిందని అన్నారు.
జర్మనీకి చెందిన కెఎఫ్‌డబుల్యు ప్రతినిధుల బృందం తుడ, ఐసిఇఐఎల్, ఎపియుఐఎఎంఎల్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ జలవనరుల శాఖ ప్రతినిధులతో కలిసి ప్రాజెక్టులో భాగంగా ప్రతిపాదించిన చెరువులు, జలవనరుల ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయి పరిస్థితులు, ప్రాజెక్టు లక్ష్యాలు, హైడ్రాలజికల్ స్టడీస్ అవసరమైన సాంకేతిక అంశాలపై చర్చించారు. అనంతరం తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో క్షేత్రస్థాయి పరిశీలనలో గుర్తించిన అంశాలతో పాటు ప్రాజెక్టు డిపిఆర్ హైడ్రాలజికల్ స్టడీస్, సాంకేతిక అంశాలు, నిధుల సమీకరణ, విభాగాల సమన్వయం తదుపరి కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. వివిధ సంస్థల ప్రతినిధులు అందించిన ప్రశ్నలు, సూచనలపై కూడా చర్చించి తదుపరి కార్యాచరణకు అవసరమైన అంశాలను పరిశీలించారు.
తిరుపతిని దేశానికి రోల్ మోడల్‌గా నిలిపే లక్ష్యంతో "సిటీ ఆఫ్ లేక్స్ ట్యాంక్స్ ప్రాజెక్టును పూర్తి స్థాయిలో అమలు చేస్తామని, డిపిఆర్ ప్రక్రియను వేగవంతం చేసి ప్రథమ దశ పనులను త్వరలో ప్రారంభించేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని దివాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తుడా సెక్రటరీ డాక్టర్ యన్ వి శ్రీకాంత్ బాబు, ఎస్ఇ రవీంద్రయ్య, సిపిఒ దేవికుమారి, ఇరిగేషన్ ఎస్ ఇ,తుడా, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

## కలసి ఉండటం లేదనే కోపంతో భార్యను హత్య చేసిన భర్త

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలు, భార్య తనతో కలిసి ఉండటం లేదనే కోపంతో ఓ భర్త దారుణానికి పాల్పడ్డాడు. తూర్పుగోదావరి జిల్లా చక్రద్వారబంధం లో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారి (23), నాగరాజు భార్యాభర్తలు. కొంతకాలంగా కుటుంబ కలహాల కారణంగా ఇద్దరూ విడిగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పుట్టింట్లో ఉంటున్న కుమారిని నాగరాజు తన వెంట తీసుకెళ్లాడు. అనంతరం ఆమెతో గొడవకు దిగినట్లు తెలుస్తోంది. తీవ్ర ఆగ్రహానికి గురైన నాగరాజు కుమారి గొంతు నులిమి హత్య చేసినట్లు సమాచారం. ఘటన అనంతరం నాగరాజు తన గొంతును కూడా కోసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించి, తీవ్రంగా గాయపడిన నాగరాజును చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతడికి వైద్యులు చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు దారితీసిన కుటుంబ వివాదాలు, ఘటనకు ముందు జరిగిన పరిణామాలపై వివరాలు సేకరిస్తున్నారు. కుమారి మృతితో ఆమె కుటుంబంలో విషాదం నెలకొంది.

## మెడికో ప్రియాంక హత్య కేసు: పోలీస్ కస్టడీకి నిందితులు

**ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 18 ప్రభాతవార్త:** తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం లో మెడికో విద్యార్థిని ప్రియాంక హత్య కేసులో నిందితులను పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఘటనకు దారితీసిన పరిస్థితులు, నిందితుల పాత్ర, పరస్పర సంబంధాలు, ఉపయోగించిన వాహనం తదితర అంశాలపై పోలీసులు ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీలు, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తును కొనసాగిస్తున్నారు. కీలక సమాచారం రాబట్టేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కేసులో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలోనూ విచారణ సాగుతోంది. దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని పోలీసులు వెల్లడించినట్లు సమాచారం. ప్రియాంక కుటుంబ సభ్యులు మాత్రం ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

## బావిలోకి దిగి ఉపిరాడక ఇద్దరు మృతి



**సంతకవిటి (విజయనగరం జిల్లా), ఆగస్టు 18 ప్రభాతవార్త:** విజయనగరం జిల్లా సంతకవిటి మండలం పనసపేటలో తీవ్ర విషాదం చోటు చేసుకుంది. అమ్మమ్మ ఇంటి వద్ద ఉన్న నేల బావిలో మోటార్ పైపుకి ఉన్న ఫుట్బాల్ కీ పోయిందని మరమ్మత్తులు చేసేందుకు బావిలో దిగిన ముజ్జాడ రామకృష్ణ(25) ఆక్సిజన్ అందగా చనిపోవడం జరిగింది. ఎప్పటికీ రాలేదని తమ్ముడు విష్ణుమూర్తి (23) బావిలోకి దిగడం జరిగింది. ఆయన కూడా ఊపిరాడక చనిపోవడం జరిగింది. వీళ్లిద్దరిని కాపాడేందుకు మూడో వ్యక్తి బావిలో దిగడంతో ఊపిరి ఆడక పోవడంతో కేకలు వేయడంతో మరో వ్యక్తి వచ్చి బయటికి తీశారు. రామకృష్ణ బీటెక్ చదువుతున్నాడు. విష్ణుమూర్తి అగ్ని వీర్‌కు సెలెక్ట్ అయ్యి 23న విధుల్లో చేరాల్సి ఉంది. అసిరినాయుడు వరలక్ష్మి కుటుంబానికి ఇద్దరు కుమారులు చనిపోవడంతో మూర్ఛపోయారు. విషయం తెలిసిన సంతకవిటి ఎస్సై ఆర్.గోపాలరావు ఘటన స్థలానికి చేరుకుని పొందూరు, రణస్థలం అగ్నిమాపక కేంద్రం ఎస్సై హేమ సుందర్ సిబ్బందితో కలిసి ఇద్దరు వ్యక్తులను బావిలో నుంచి బయటికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం హాస్పిటల్‌కి తరలించారు.

## యూట్యూబర్ రావణ్ కేసు ఎన్ఐఏ కోర్టుకు బదిలీ

**విజయవాడ, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** సోషల్ మీడియా ద్వారా విద్వేష పూరిత ప్రసంగాలు చేసినట్లు ఆరోపణలు ఎదర్కొంటున్న యూట్యూబర్ రావణ్ అలియాస్ బచ్చలకూరి జోసెఫ్ పై చట్టవిరుద్ధ కార్యకలాపాల నివారణ చట్టం (ఉపా) కింద కేసు నమోదయ్యాయి. ప్రస్తుతం అతడు జైల్లో రిమాండ్‌లో ఉన్నాడు. తాజాగా అతడి కేసును గన్నవరం కోర్టు నుంచి విజయవాడ కోర్టుకు బదిలీ చేశారు. ఈ కేసుకు సంబంధించి నమోదైన ఉపా చట్టం తీవ్రత, ప్రత్యేక న్యాయ పరిమితులను పరిగణనలోకి తీసుకుని, కేసు రికార్డులను గన్నవరం కోర్టు నుంచి విజయవాడలోని 2వ అదనపు జిల్లా జడ్జి కోర్టుకు, అలాగే ప్రత్యేక ఎన్ఐఏ కోర్టుకు అధికారులు బదిలీ చేశారు. ఉపా చట్టం కిందికి వచ్చే కేసులకు ప్రత్యేక అధికార పరిధి కలిగిన న్యాయస్థానాల్లోనే విచారణ జరగాల్సి ఉండటంతో ఈ మార్పులు చేపట్టినట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. మరోవైపు, నిందితుడి డిజిటల్ కంటెంట్, నిషేధిత సిద్ధాంతాల ప్రచారం, నెట్‌వర్క్‌లపై సమగ్రంగా విచారించాల్సి ఉందంటూ పోలీసులు కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేయగా, విజయవాడ కోర్టులో న్యాయవాదులు వాదనలు వినిపించారు. ప్రాసిక్యూషన్, డిఫెన్స్ న్యాయవాదుల వాదనలను పరిశీలించిన న్యాయస్థానం, పోలీసు కస్టడీ పిటిషన్‌పై తదుపరి విచారణతో పాటు తీర్పు వెల్లడించేందుకు తేదీని ఖరారు చేసింది.

## ఎసిబికి పట్టుబడ్డ ఒంగోలు ఆర్ఐ



**ఒంగోలు (క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** ఒంగోలు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎసిబి అధికారులు మంగళవారం దాడులు నిర్వహించి ఇన్చార్జ్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నరేంద్రను లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఓ స్థలానికి సంబంధించి ల్యాండ్ టైటిల్ పేరు మార్పు చేసేందుకు రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఎసిబి అధికారులకు ఫిర్యాదు అందింది. దీంతో పక్కా ప్రణాళికతో రంగంలోకి దిగిన ఎసిబి అధికారులు నగరపాలక సంస్థ కార్యాలయంలో లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారులు పట్టుకోవడంతో కార్యాలయంలో ఒక్కసారిగా కలకలం నెలకొంది. అనంతరం సంబంధిత విభాగంలో పలు కీలక పత్రాలు, రికార్డులు, దస్త్రాలను ఎసిబి అధికారులు పరిశీలించారు. ల్యాండ్ టైటిల్ పేరు మార్పు ప్రక్రియకు సంబంధించిన ఫైళ్లను కూడా పరిశీలించి, లంచం డిమాండ్ చేసిన పరిస్థితులపై వివరాలు సేకరిస్తున్నారు. నరేంద్రకు సంబంధించిన విధులు, సంబంధిత దరఖాస్తు, అధికారిక ప్రక్రియపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. ఈ వ్యవహారంలో మరెవరైనా ప్రమేయం ఉందా అనే కోణంలోనూ దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది.

## ధాటీపంచకం భక్తి శరణాగతికి మార్గదర్శకం

**తిరుమల, ఆగస్టు 18 ప్రభాతవార్త ప్రతినిధి:** శ్రీమన్నారాయణుని పాదపద్మాలను ఆశ్రయించిన భక్తులు సంసార బంధాల నుండి విముక్తి పొంది, భగవంతుని అనుగ్రహాన్ని పొందుతారనే సందేశాన్ని ధాటీపంచకం అందిస్తుందని భద్రాచలానికి చెందిన స్థలశాయి స్వామి తెలిపారు. దాశరథి రచించిన ధాటీపంచకం భక్తి, శరణాగతి, ఆచార్య భక్తి ప్రాధాన్యతను తెలియజేస్తుందని చెప్పారు. భగవంతుని పాదపద్మాలను ఆశ్రయించి, ఆచార్యుల మార్గదర్శకత్వంలో భక్తి మార్గంలో ముందుకు సాగాలని ఈ స్తోత్రం ప్రేరణనిస్తుందని తెలిపారు. తిరుపతి అన్నమాచార్య కళామందిరంలో టిటిడి ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "శ్రీవైష్ణవ ఆచార్యుల ఆధ్యాత్మిక సేవలు" జాతీయ సదస్సు మంగళవారం రెండో రోజూ కొనసాగింది. మేల్కోటకు చెందిన జగ్గు వెంకటేశం స్వామి రామానుజాచార్యులు దాశరథికి అందించిన పది ఉపదేశాలు భక్తి, శరణాగతి, ఆచార్య నిష్ఠ వంటి ఉన్నత విలువలను తెలియజేస్తాయని అన్నారు. భగవంతునిపై విశ్వాసంతోపాటు భగవద్భక్తుల సేవను కూడా పవిత్రమైన కైంకర్యంగా భావించాలని రామానుజులు బోధించారని చెప్పారు. ఈ ఉపదేశాలు నేటి తరానికి కూడా ఎంతో స్ఫూర్తినిచ్చే ఆధ్యాత్మిక సందేశాలని వివరించారు. ఆచార్య సంపత్‌కుమార్ స్వామి మాట్లాడుతూ కప్యాసం శ్రుతి"పై రామానుజాచార్యులు చేసిన వ్యాఖ్యానం ఎంతో విశిష్టమైనదని తెలిపారు. వేదవాక్యాల్లోని అంతర్లీన ఆధ్యాత్మిక తాత్పర్యాన్ని రామానుజులు భక్తులకు సులభంగా అర్థమయ్యేలా వివరించారని చెప్పారు. ఈ వ్యాఖ్యానంలో భగవంతుని దివ్యత్వం, సౌందర్యం, కళ్యాణగుణాలు ప్రతిఫలిస్తాయని వివరించారు. ఆయి నరసింహన్ స్వామి మాట్లాడుతూ శ్రీభాష్యంలో జడభరత చరిత్రకు సంబంధించిన శ్లోకాలు, వాటి తాత్త్విక ప్రాధాన్యతను వివరించారు. జడభరతుని చరిత్ర ద్వారా ఆత్మతత్తం, దేహ-ఆత్మ భేదం, భక్తి, వైరాగ్యం వంటి విషయాలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఉదాహరణల ద్వారా రామానుజులు వేదాంత సిద్ధాంతాలను సామాన్యులకు సైతం సులభంగా అర్థమయ్యేలా వివరించారని చెప్పారు.



# అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

- రూ. ఒక కోటి 36 లక్షల విలువైన బంగారం, నగదు, స్వాధీనం చేసుకున్న పోలీసులు

**ఒంగోలు (క్రైమ్), ఆగస్టు 18 ప్రభాతవార్త:** పగటి వేళ తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని రెక్కీ నిర్వహించి బంగారు ఆభరణాలు, నగదు దోచుకుంటున్న అంతర్రాష్ట్ర ప్రొఫెషనల్ దొంగను ప్రకాశం జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు .ఎస్పీ హర్షవర్ధన రాజు వెల్లడించిన వివరాల ప్రకారం సీసీ కెమెరాల ఫుటేజీ విశ్లేషణ, సాంకేతిక పరిజ్ఞానం, వాహనాల కదలికలు, క్షేత్రస్థాయి దర్యాప్తు ఆధారంగా నిందితుడి ఆచూకీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సోహైల్ ఖాన్ అలియాస్ మహమ్మద్ సమీర్ ఖాన్ అలియాస్ సమీర్ ఖాన్ అలియాస్ పఠాన్ సమీర్ ఖాన్ అలియాస్ షోహెబ్ ఖాన్, వయస్సు 38 సంవత్సరాలు, కర్ణాటక రాష్ట్రానికి చెందినవాడిగా, ప్రస్తుతం హైదరాబాద్‌లోని షాహీద్‌నగర్‌లో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. 2026 జూన్ నుంచి ఆగస్టు వరకు నరసరావుపేట, మైలవరం, నూజివీడు, వినుకొండ, ఒంగోలు ప్రాంతాల్లో పగటి సమయంలో తాళం వేసి ఉన్న ఇళ్లలో దొంగతనాలకు పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. నరసరావుపేటలో జూన్ 2న జరిగిన దొంగతనంలో వచ్చిన నగదులో రూ.18 లక్షలతో ఎక్స్‌యూవీ 700 కారును కొనుగోలు చేసి, మరో రూ.10 లక్షలు తన వద్ద ఉంచుకున్నట్లు నిందితుడు వెల్లడించాడు.
జూలై 1న మైలవరం, నూజివీడు ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడగా, నూజివీడు గాంధీనగర్ కేసులో సుమారు 220 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ అయ్యాయి. జూలై 16న వినుకొండ కొత్తపేటలో దొంగతనానికి ప్రయత్నించినప్పటికీ ఏ వస్తువులు లభించలేదని, అదే రోజు రెడ్డినగర్‌లోని మరో ఇంటిలో దొంగతనం చేసి బంగారు ఆభరణాలు అపహరించినట్లు విచారణలో తేలింది. ఆ కేసులో సుమారు 67.800 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆగస్టు 5న హైదరాబాద్ నుంచి ఓఎల్ఎక్స్ ద్వారా కొనుగోలు చేసిన పల్సర్ బైక్‌పై ఒంగోలుకు వచ్చిన నిందితుడు ఉదయం ఆంధ్రకేసరి నగర్‌లోని ఓ ఇంటిలో, సాయంత్రం సమతా నగర్‌లోని మరో ఇంటిలో దొంగతనాలకు పాల్పడ్డాడు. ఈ రెండు ఘటనలపై ఒంగోలు తాలూకా పోలీస్ స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి.
ఆంధ్రకేసరి నగర్ కేసులో 146.200 గ్రాముల బంగారు ఆభరణాలు, రూ.5 లక్షల నగదు, సమతా నగర్ కేసులో 248 గ్రాముల బంగారు ఆభరణాలు రికవరీ చేశారు. అనంతరం మరోసారి ఒంగోలులో దొంగతనాలకు పాల్పడేందుకు ఎక్స్‌యూవీ 700 కారులో వస్తున్న నిందితుడు ఆగస్టు 18న దక్షిణ బైపాస్‌లోని అలాస్ హోటల్ సమీపంలో పోలీసుల వాహన తనిఖీలను గమనించి కారును వెనక్కి తిప్పి పారిపోవడానికి ప్రయత్నించాడు. పోలీసులు వెంబడించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి సుమారు రూ.1.03 కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, రూ.15 లక్షల నగదు, రూ.18 లక్షల విలువైన ఎక్స్‌యూవీ 700 కారును స్వాధీనం చేసుకున్నారు. మొత్తం స్వాధీనం చేసుకున్న సొత్తు విలువ సుమారు రూ.1.36 కోట్లుగా పోలీసులు తెలిపారు.

## సిజెపి నిరసనలో పోలీసు చర్యలపై

# విచారణ కమిటీ

### రిటైర్డ్ జడ్జి నాయకత్వంలో ఏర్పాటు: సుప్రీంకోర్టు

### ఆందోళనల్లో 2,873 మంది పాత నేరస్తులు: ఢిల్లీ పోలీసులు



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) నేతృత్వంలో జులై 20న జరిగిన విద్యార్థుల నిరసన సందర్భంగా పోలీసులు అతిక్రమించారన్న ఆరోపణలను పరిశీలించేందుకు విశ్రాంత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, మాజీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, సిబిఐ మాజీ డైరెక్టర్, మాజీ డిజిపి తదితరులతో కూడిన ఒక ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు వెల్లడించింది. ప్రతిపాదిత ఉన్నత స్థాయి కమిటీలో చేర్చాల్సిన ఇతర సభ్యులపై వివిధ పార్టీల నుంచి సూచనలు కోరుతూ, ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. నిరసన సందర్భంగా తాము అధిక బలప్రయోగం చేయలేదని ఢిల్లీ పోలీసులు ఖండించినప్పటికీ, జాతీయ రాజధానిలో జులై 20న జరిగిన పార్లమెంట్ మార్చ్ సందర్భంగా చోటుచేసుకున్న హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను పరిశీలన కోసం కమిటీకి అప్పగించాలని ఆదేశిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఈ కమిటీ, మార్చ్ సందర్భంగా జరిగిన హింసకు సంబంధించిన వీడియో ఫుటేజ్, సిసిటివి రికార్డింగ్‌లను, పోలీసుల ప్రతిస్పందనను పరిశీలించి, సుప్రీంకోర్టుకు తగిన చర్యలను సిఫార్సు చేస్తుంది. లైంగిక వేధింపులకు గురయ్యామని ఆరోపణలు ఎదుర్కొంటున్న మహిళా నిరసనకారుల ఫిర్యాదులను కూడా ఈ ప్యానెల్ పరిశీలిస్తుంది.

జులై 20న జరిగిన నిరసనలో 240 మంది పోలీసులు గాయపడ్డారని, ఆ నిరసనలోకి 'చరిత్ర నేరగాళ్లు' చొరబడ్డారని ఆరోపిస్తూ, హత్య, అత్యాచారం, అపహరణలు వంటి తీవ్రమైన నేరాలకు పాల్పడిన 2,873 మంది వ్యక్తులు మినహా, మిగిలిన వారిపై ఉన్న కేసులను కొట్టివేయవచ్చని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. 'చలో సంసద్' నిరసన సందర్భంగా బలప్రయోగం చేయడాన్ని ఢిల్లీ పోలీసులు గట్టిగా సమర్థించుకున్నారు. ఈ ఆందోళనను 'అసాంఘిక శక్తులు', 'చరిత్ర నేరస్తులు' హైజాక్ చేశారని, దీని ఫలితంగా శాంతిభద్రతల విఘాతం ఏర్పడి 240 మందికి పైగా పోలీసు సిబ్బంది గాయపడ్డారని వారు ఆరోపించారు. సంఘటనా స్థలంలో ఉన్న 92 మందిపై 10కి పైగా క్రిమినల్ కేసులు ఉన్నాయని, వారిలో 47 మంది 'చరిత్ర నేరస్తులు' అని వారు తెలిపారు.

నిరసనకారులపై మితి మీరిన బలప్రయోగం జరిగిందంటూ దాఖలైన పిటిషన్లకు ప్రతిస్పందనగా న్యూఢిల్లీ జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సచిన్ శర్మ దాఖలు చేసిన అఫిడవిట్‌లో, తమ చర్యలను కోర్టు నియమించిన కమిటీ ద్వారా పరిశీలించు కోవడానికి ఢిల్లీ పోలీసులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. పార్లమెంటు వైపు నిరసనకారులు ముందుకు సాగకుండా నిరోధించడానికి పదేపదే చేసిన హెచ్చరికలు, ప్రయత్నాలను పోలీసులు పట్టించుకోక పోవడంతోనే బలప్రయోగానికి పాల్పడ్డారని ఢిల్లీ పోలీసులు సమర్పించారు. "పోలీసులు బలప్రయోగం చేసిన విషయాన్ని న్యాయస్థానం నియమించిన కమిటీ పరిశీలించవచ్చు. ఢిల్లీ పోలీసులు అటువంటి కమిటీకి పూర్తి సహకారం అందించి, అవసరమైన అన్ని వివరాలను అందిస్తారు" అని శర్మ అన్నారు.

## పిఎంకేర్స్ ఫండ్ నిధులు రూ.8452.07 కోట్లు

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పీఎం కేర్స్ ఫండ్ నిధులు సరికొత్త గరిష్ఠ స్థాయికి చేరుకున్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి ఈ నిధి మొత్తం విలువ రూ. 8,452.07 కోట్లకు వృద్ధి చెందింది. పెట్టుబడి వ్యూహాల్లో తీసుకొచ్చిన మార్పుల కారణంగానే ఈ స్థాయిలో వృద్ధి నమోదైందని తాజా ఆడిట్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో రూ. 7,173.03 కోట్లుగా ఉన్న నిధులు, ఏడాది ముగిసే సమయానికి గణనీయంగా పెరిగాయి. గతంలో నిధులన్నీ అధికంగా సేవింగ్స్ ఖాతాల్లోనే ఉండగా, ఇప్పుడు మెరుగైన రాబడి కోసం వాటిని ఫిక్స్‌డ్ డిపాజిట్లకు మళ్లించారు. ప్రస్తుతం మొత్తం నిధుల్లో రూ. 6,641 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉండగా, కేవలం రూ. 605.41 కోట్లు మాత్రమే సేవింగ్స్ ఖాతాల్లో ఉన్నాయి. అంటే పీఎం కేర్స్ మొత్తం నిధుల్లో దాదాపు 92.8 శాతం ఎఫ్‌డీలలోనే ఉన్నాయి. గడిచిన ఏడాదిలో ఫిక్స్‌డ్ డిపాజిట్ల ద్వారా రూ. 469.38 కోట్ల వడ్డీ లభించగా, సేవింగ్స్ ఖాతాల ద్వారా కేవలం రూ.5.77 కోట్లు మాత్రమే సమకూరింది. వీటితో పాటు స్వదేశీ విరాళాల రూపంలో రూ.479.04 కోట్లు, విదేశీ విరాళాల రూపంలో రూ.92.83లక్షలు అందాయి. వివిధ ఏజెన్సీల నుంచి మరో రూ.324.66కోట్ల రిఫండ్‌లు కూడా ఈ ఖాతాలోచేరాయి. కొవిడ్19 మహమ్మారి విజృంభించిన తరుణంలో, 2020 మార్చి 27న పీఎం కేర్స్ ఫండ్‌ను ఒక పబ్లిక్ ఛారిటబుల్ ట్రస్ట్‌గా కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. విపత్కర పరిస్థితుల్లో తక్షణ ఆర్థిక భరోసా కల్పించడమే ఈ నిధి ప్రధాన ఉద్దేశం.

## వందేమాతరం వివాదం: బిజెపిపై ఖర్గే ధ్వజం

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే వందేమాతరం వివాదంపై తీవ్రంగా స్పందించారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఫిర్యాదు చేయడాన్ని ప్రశ్నించారు. తాము పాడిన వందేమాతరం కొత్తది కాదని చెప్పారు. మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ పాడినదే తామూ పాడామని స్పష్టం చేశారు. అది నేరమైతే వారిపైనా కేసులు పెట్టాలని వ్యాఖ్యానించారు. ఆగస్టు 15న కాంగ్రెస్ ప్రధాన కార్యాలయంలో వందేమాతరం ఆలాపనపై వివాదం మొదలైంది. ఖర్గే జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత వందేమాతరం ఆలపించారు. అయితే పార్టీ నిర్ణయం ప్రకారం తొలి రెండు చరణాలతో ముగించాల్సిన గేయాన్ని పూర్తిగా ఆలపించారు. గాయకులు కొనసాగించడాన్ని సోనియా గాంధీ గమనించి వారిని ఆపేందుకు ప్రయత్నించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఘటనపై సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు అందింది. వందేమాతరం ఆలాపనను అడ్డుకునేందుకు ప్రయత్నించారంటూ ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఫిర్యాదుదారు కోరారు. దీనిపై ఖర్గే స్పందిస్తూ గత 18 ఏళ్లుగా కాంగ్రెస్ పాడుతున్న వందేమాతరం గీతాన్నే తాజాగా కూడా ఆలపించామని చెప్పారు. అటల్ బిహారీ వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం కూడా ఇదే గేయాన్ని ఆలపించిందని గుర్తుచేశారు. వందేమాతరం విషయంలో కాంగ్రెస్ ఎప్పుడో తీర్మానం చేసిందని ఖర్గే తెలిపారు. భవిష్యత్తులో మరో ప్రభుత్వం వస్తే, వారు ఏ నిర్ణయం తీసుకుంటే అది అందరూ పాటించాలా అని ప్రశ్నించారు.

## జార్ఖండ్‌లో కొత్తగా ఉద్యోగాలు పొందిన అభ్యర్థుల ఆందోళన

**రాంచి,ఆగస్టు 18:** జార్ఖండ్‌లోని రాంచీలో కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు మంగళవారం రాష్ట్ర సచివాలయంఎదుట ఆందోళనకు దిగారు. ఒపక్క జెపిఎస్‌సిని రద్దు చేయాలంటూ ఉద్యోగార్థుల నిరసనతో పరీక్షలను మొత్తం రద్దుచేసిన జార్ఖండ్‌ప్రభుత్వం నిర్ణయంతో ఇపుడు జెపిఎస్‌సిలో ఉద్యోగాలు పొందిన అభ్యర్థులు ఆందోళనకు దిగారు. దీనితో జార్ఖండ్ ఉద్యమంలో రివర్స్‌గేర్‌ప్రారంభం అయినట్లు తెలుస్తోంది. జార్ఖండ్ స్టాఫ్ సెలెక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్ పరీక్షతో పాటు 2014 నుంచి నిర్వహించిన అన్ని ఔట్‌సోర్సింగ్ పరీక్షలను రద్దు చేస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ఈ నిరసనలు ప్రారంభమయ్యాయి.

## విద్యార్థులపై ఎకె47తో కాల్పులు నిజమే!

### సుప్రీంకోర్టులో బీహార్ ప్రభుత్వం అఫిడవిట్

### శివాన్ జిల్లా ఎస్పీని బదలీ చేసిన సర్కార్



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** నీట్ యుజి పేపర్ లీక్‌పై దేశవ్యాప్తంగా నిరసనల్లో భాగంగా బీహార్‌లో విద్యార్థులపై పోలీసులు కాల్పులు జరపడం నిజమేనని మంగళవారం సుప్రీంకోర్టుకు బిహార్ ప్రభుత్వం తెలిపింది. జులై 25న సివాన్‌లో జరిగిన ఈ కాల్పుల్లో ఎవరూ తీవ్రంగా గాయపడలేదని స్పష్టం చేసింది. ఆందోళనకారుల మధ్య కానిస్టేబుల్ చిక్కుకుపోవడంతో ఎకె47తో కాల్పులు జరపాల్సి వచ్చిందని కోర్టు దృష్టికి తెచ్చింది. ఈ మేరకు అఫిడవిట్ ద్వారా సుప్రీంకోర్టుకు కీలక విషయాలను వెల్లడించింది. ఈ సందర్భంగా జులై 25న నిరసనల్లో సివాన్‌లోని జెపి చౌక్ వద్ద నిరసనకారుల మధ్య కానిస్టేబుల్ అభిషేక్ కుమార్ చిక్కుకున్నాడని బిహార్ ప్రభుత్వం పేర్కొంది. వారి నుంచి తప్పించు కునేందుకు కానిస్టేబుల్ ఎకె47తో గాలిలోకి నాలుగు రౌండ్లు కాల్పులు జరిపాడని తెలిపింది. మరోవైపు, నిరసనకారులను చెదరగొట్టేందుకు హతి చౌక్ సమీపంలో అసిస్టెంట్ సబ్ఇన్‌స్పెక్టర్ నిలేశ్ కుమార్ సింగ్ కూడా 9ఎంఎం పిస్టల్‌తో రెండురౌండ్లు కాల్పులు జరిపారని చెప్పుకొచ్చింది. పోలీసుల చర్యల్లో ముగ్గురు ఆందోళనకారులకు చిన్నపాటి తుపాకీ గాయాలయ్యాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. అయితే, వారు ఎకె47 బుల్లెట్లతో గాయపడలేదని తేల్చిచెప్పింది. అలాగే, కానిస్టేబుల్ కాల్పులు జరిపిన ప్రదేశంలో ఎవరూ గాయపడలేదని పేర్కొంది. మరోవైపు, కానిస్టేబుల్ అభిషేక్ కుమార్‌ను సస్పెండ్ చేశామని, అతను శాఖా పరమైన విచారణను ఎదుర్కొంటున్నాడని అఫిడవిట్‌లో బిహార్ ప్రభుత్వం తెలిపింది. ఆరోజు భద్రతా దళాలు సంయమనం పాటించాయని, నిరసనకారులకు ఎలాంటి హాని కలిగించేందుకు ప్రయత్నించలేదని స్పష్టం చేసింది. ఈ సందర్భంగా విద్యార్థులపై విపరీతమైన బలప్రయోగం చేయలేదనీ వివరించింది. ప్రభుత్వ ఆస్తుల నష్టం, అధికారులపై దాడులకు నిరసనల్లో చేరిన అసాంఘిక శక్తులే కారణమని ప్రభుత్వం ఆరోపించింది. అలాగే నిరసనలకు సంబంధించిన జిల్లాల వారీ వివరాలనూ సుప్రీంకోర్టుకు సమర్పించింది.

**జిల్లా ఎస్పీ బదలీ:**

విద్యార్థులపై ఎకె47తో గాల్లో కాల్పుల జరిపిన ఉదంతం కలకలం రేపుతున్న నేపథ్యంలో బీహార్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. శివాన్ జిల్లాలో ఈ ఘటన జరిగిన నేపథ్యంలో ఎస్పీ పురన్ కుమార్‌ను జిల్లా బాధ్యతల నుంచి తప్పించింది. ఎకె47తో కాల్పులు జరిపిన కానిస్టేబుల్‌పై ఇప్పటికే సస్పెన్షన్ వేటు పడింది. పురన్ కుమార్ ఝూ స్థానంలో భరత్ సోనీ శివాన్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. భోజ్‌పూర్‌లో మరో కార్యకర్త ఎన్‌కౌంటర్‌తో కలకలం రేగడంతో జిల్లా ఎస్పీపై కూడా వేటు పడింది. భోజ్‌పూర్ బాధ్యతలను మరో అధికారి అవధేశ్ దీక్షిత్‌కు ప్రభుత్వం అప్పగించింది.

## 'హర్మూజ్' కొత్త అమెరికా ప్రాంతం!

### ట్రూత్‌లో ట్రంప్ సంచలన వ్యాఖ్యలు



**వాషింగ్టన్, ఆగస్టు 18:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హర్మూజ్ జలసంధిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో హోర్ముజ్ జలసంధిని న్యూ యూఎస్ టెరిటరీగా పేర్కొంటూ ఓ మ్యాప్‌ను పోస్ట్ చేశారు. వాషింగ్టన్-టెహ్రాన్ మధ్య శాంతి ఒప్పందం కుదుర్చుకునేందుకు నిర్ణయించిన 60 రోజుల చర్చల గడువు ముగిసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేయడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. ట్రంప్ షేర్ చేసిన మ్యాప్‌లో పర్షియన్ గల్ఫ్ ప్రవేశద్వారం వద్ద ఇరాన్, ఒమన్ మధ్య ఉన్న హోర్ముజ్ జలసంధి చుట్టూ ఓ వృత్తాన్ని గీసి, దానిపై కొత్త యుఎస్‌ప్రాంతం అని పేర్కొన్నారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి కాజెమ్ ఘరీబాబాదీ మాట్లాడుతూ హర్మూజ్ జలసంధిపై ట్రంప్‌కు ఉన్న భ్రమ త్వరలో తొలగిపోతుందని హెచ్చరించారు. త్వరలో హర్మూజ్ జలసంధిపై ట్రంప్ భ్రమ తొలగిపోతుంది లేదంటే ఆ భ్రమలో ఉన్న వ్యక్తి భ్రమలను మేమే సరిదిద్దుతామని ఘాటుగా వ్యాఖ్యానించారు. హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని ట్రంప్ గతంలోనూ ప్రకటించారు. పోలీస్ అకాడమీ సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ ఇంటెలిజెన్స్‌లో మాట్లాడుతూ త్వరలోనే హర్మూజ్ జలసంధిని అమెరికా భూభాగంగా ప్రకటిస్తానని అన్నారు. అంతకు ముందు కూడా హర్మూజ్‌పై అమెరికాకు పూర్తి నియంత్రణ ఉందని ట్రంప్ పేర్కొన్నారు. వారికి నియంత్రణ లేదు. పూర్తి నియంత్రణ మనదే. అది మనదే అని విలేకరులతో అన్నారు. అమెరికా నౌకాదళం జలసంధిలోని మైన్లను తొలగించేందుకు చర్యలు చేపట్టిందని కూడా వెల్లడించారు. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. హర్మూజ్ జలసంధి ఇరాన్‌కు చెందినదే, ప్రస్తుతం కూడా ఇరాన్‌దే, భవిష్యత్తులోనూ ఇరాన్‌దేనని ఘరీబాబాదీ స్పష్టం చేశారు. జలసంధిని ఎప్పుడు మూసివేయాలి, ఎప్పుడు తెరవాలన్నది ఇరాన్ ఆదేశాల ప్రకారమే జరుగుతుందన్నారు. ప్రపంచ చమురు సరఫరాకు కీలక మార్గంహోర్ముజ్ జలసంధి ప్రపంచంలోని అత్యంత కీలకమైన సముద్ర రవాణా మార్గాల్లో ఒకటి. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్-ఇరాన్ యుద్ధం ప్రారంభమయ్యే ముందు ప్రపంచ చమురు, గ్యాస్ సరఫరాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి గుండా రవాణా అయ్యేది. యుద్ధం ప్రారంభమైన తర్వాత ఇక్కడ నౌకల రాకపోకలు గణనీయంగా తగ్గిపోయాయి. ఇరాన్ ఈ జల మార్గంలో రవాణాను పరిమితం చేస్తూ యుద్ధంలో ఒత్తిడి పెంచేందుకు దీనిని వ్యూహాత్మక సాధనంగా ఉపయోగిస్తోంది. ట్రాన్సిట్ మార్గంపై ఇరాన్-ఒమన్ ఒప్పందంఇదిలా ఉండగా హర్మూజ్ జలసంధి మీదుగా నౌకల రాకపోకలకు సంబంధించిన ట్రాన్సిట్ మార్గం మ్యాప్‌పై ఇరాన్, ఒమన్ మధ్య అవగాహన కుదిరింది. దీనిపై సంయుక్త ప్రకటనతో కూడిన తుది ఒప్పందాన్ని రూపొందించే ప్రక్రియ కొనసాగుతోంది.

## మూడు రాష్ట్రాలకు పార్టీ కొత్త ఇన్‌ఛార్జిలు: బిజెపి ఎన్నికల గేమ్ ప్లాన్ షురూ..

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** రాబోయే అసెంబ్లీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది భారతీయ జనతా పార్టీ. గెలుపే లక్ష్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంలో భారీ మార్పులు చేసింది. ఇప్పటికే జాతీయ కార్యవర్గాన్ని పూర్తిగా ప్రక్షాళన చేసింది. పలు కొత్త ముఖాలకు ఇందులో చోటు కల్పించింది. సీనియర్లకు కీలక బాధ్యతలను అప్పగించింది. రాష్ట్రాల వారీగా సమీకరణాలను బేరీజు వేసుకుని పాత, కొత్త నేతల కలయికతో ఈ నూతన కార్యవర్గాన్ని పునర్నిర్మించుకుంది. దీనికి కొనసాగింపుగా మరిన్ని నిర్ణయాలను తీసుకుంటోంది బీజేపీ హైకమాండ్. ఇందులో భాగంగా మూడు రాష్ట్రాలకు నూతన ఇన్‌ఛార్జీలను నియమించింది. ఉత్తరప్రదేశ్, పంజాబ్, గుజరాత్‌కు ఎన్నికల ఇన్‌ఛార్జ్‌లను నియమిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ప్రకటన విడుదల చేశారు. ఉత్తర్ ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ప్రధాన ఇన్‌ఛార్జ్ పదవి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాజ్యసభ సభ్యుడు వినోద్ తావ్డేకు లభించింది. తోడుగా జగదీష్ ఈశ్వర్‌భాయ్ పటేల్‌కో ఇన్‌ఛార్జ్‌లుగా నియమితులు అయ్యారు. యూపీలో క్షేత్రస్థాయి సమీకరణాలను సమన్వయం చేయడంలో వినోద్ తావ్డే అనుభవం పార్టీకి ఉపయోగపడుతుందని భావిస్తోన్నారు. వ్యవస్థాగతంగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరం ఉన్న పంజాబ్ లో రాష్ట్ర ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు సతీష్ పూనియా అపాయింట్ అయ్యారు. అదే సమయంలో.. బీజేపీకి తిరుగులేని కోటగా ఉంటూ వస్తోన్న గుజరాత్ ఎన్నికల ఇన్‌ఛార్జ్‌గా రాజ్యసభ సభ్యుడు తరుణ్ చుగ్‌ను రంగంలోకి దింపారు. గుజరాత్‌లో సుదీర్ఘకాలంగా ఉన్న పట్టును మరింత పటిష్టం చేయడానికి ఆయన నాయకత్వాన్ని ఎంచుకుంది పార్టీ హైకమాండ్. ఇక నుంచైనా పార్టీ జాతీయ నూతన కమిటీలో కూడా పలు మార్పులు చోటుచేసుకున్న విషయం తెలిసిందే. కేంద్ర మాజీ



మంత్రి స్మృతి ఇరానీకి జాతీయ ప్రధాన కార్యదర్శిగా కీలక బాధ్యతలు ఇవ్వగా, ఆర్ఎస్ఎస్ మాజీ నేత రామ్ మాధవ్‌ను జాతీయ ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ నిర్ణయం తీసుకున్నారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి వసుంధర రాజే సింధియా మరోసారి జాతీయ ఉపాధ్యక్షురాలిగా తన స్థానాన్ని నిలుపుకొన్నారు. కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ జాతీయ కోశాధికారిగా నియమితులయ్యారు.

## సిఎం విజయ్ వందరోజులపాలనపై అసెంబ్లీకి నివేదిక

**చెన్నై,ఆగస్టు 18:** తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టిస్తూ ముఖ్యమంత్రి పీఠాన్ని అధిరోహించిన విజయ్ విజయవంతంగా 100 రోజుల పాలనను పూర్తి చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన పరిపాలనా శైలి, పనితీరుపై మంత్రి ఆధవ్ అర్జున పలు విషయాలను వెల్లడించారు. అసెంబ్లీలో పబ్లిక్ వర్క్స్ బిల్లును ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. విజయ్ పనితీరు, క్రమశిక్షణ తమను ఆశ్చర్యపరుస్తోందని కొనియాడారు. సాధారణంగా నటుల నుంచి రాజకీయ నాయకులుగా మారినవారు నెమ్మదిగా పరిపాలనను అలవాటు చేసుకుంటారని, విజయ్ మాత్రం దీనికి భిన్నమని చెప్పారు. బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజు నుంచే పూర్తి స్థాయి పాలకుడిగా మారిపోయారని అన్నారు. అసెంబ్లీ



సాక్షిగా ఊహించని పరిణామం విజయ్ ప్రస్తుతం రోజుకు సుమారు 18 నుంచి 20 గంటల పాటు అవిశ్రాంతిగా పని చేస్తోన్నారని, ప్రజా సేవలో తీరిక లేకుండా గడుపుతున్నారని ఆధవ్ అర్జున వెల్లడించారు. విజయ్ దినచర్య ప్రతిరోజూ తెల్లవారుజామున 4 గంటలకే ప్రారంభమవుతుందని చెప్పారు. ఆ సమయంలోనే వివిధ శాఖల మంత్రులకు స్వయంగా ఫోన్లు చేస్తూ, ఆయా విభాగాల్లో జరుగుతున్న అభివృద్ధి పథకాల పురోగతిని, తాజా పరిస్థితులను క్షుణ్ణంగా అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు.



## కొందరు ఔట్.. కొందరికి ప్లేస్‌మెంట్

# కేబినెట్ ప్రక్షాళన!

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలకు ముందే కేబినెట్ ప్రక్షాళనకు సిద్ధమైన ప్రధాని మోడీకి ఆ అవకాశం లభించలేదు. దీనికి బిజీ షెడ్యూల్ తో పాటు మరికొన్ని ఇతర కారణాలు కూడా ఉన్నాయి. దీంతో పార్లమెంట్ సమావేశాల తర్వాత కేబినెట్ ప్రక్షాళన వాయిదా పడింది. అయితే ఊహించిన విధంగానే ఇప్పుడు కేబినెట్ మార్పులకు పావులు కదులుతున్నాయి. కానీ పార్లమెంట్ సమావేశాలకు ముందు అనుకున్న మార్పులే కాదు, అనుకోని మార్పులు కూడా ఇందులో ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. కాక్రోచ్ ఉద్యమం, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా, మూడు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, పీయూష్ గోయల్‌కు బీజేపీలో కోశాధికారి పదవి, అంతకు ముందే మరో ఇద్దరు కేంద్రమంత్రులు రవ్‌నీత్ బిట్టూ, జార్జికురియన్‌ల రాజీనామాలు ఇలా ఈ మధ్య కాలంలో చాలా మార్పులు జరిగాయి. ఇప్పుడు బీజేపీ జాతీయ కార్యవర్గం ఏర్పాటు సందర్భంగా పలువురు కేంద్రమంత్రులకు రాష్ట్రాల ఇన్ చార్జ్ బాధ్యతలు కూడా దక్కాయి. దీంతో ఇప్పుడు కేబినెట్ ప్రక్షాళన మరింత ఉత్కంఠ భరితంగా మారింది. ఇందులో మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న దేవేంద్ర ఫడ్నవీస్‌కు కూడా అవకాశం దక్కబోతోందన్న ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన నిన్న ప్రధాని మోడీతో భేటీ అయ్యారు. దీంతో ఉద్ధవ్ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ ఈ ప్రచారాన్ని మరోమారు ముమ్మరం చేశారు. దీంతో ఫడ్నవీస్ స్పందించక తప్పలేదు. తాను ఢిల్లీకి వచ్చినప్పుడల్లా ఇలాంటి ఊహాగానాలు మొదలవుతాయని, కానీ వాటిలో ఏమాత్రం వాస్తవం లేదని ఆయన తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యత మేరకు మహారాష్ట్రలోనే ఉన్నానని, ఇకపైనా ఇక్కడే ఉంటానని ఫడ్నవీస్ తేల్చేశారు. మరోవైపు కేంద్రమంత్రి వర్గంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు స్థాన చలనం తప్పదని తెలుస్తోంది. ఆమె స్థానంలో ఆర్బీఐ మాజీ గవర్నర్ శక్తికాంత దాస్‌ను నియమించేందుకు ప్రధాని మోడీ సిద్ధమవుతున్నారు. దీంతో పాటు యూపీ, పంజాబ్ వంటి ఎన్నికలు జరిగే రాష్ట్రాల నుంచి ఎక్కువ మంది ఎంపీల్ని కేబినెట్లోకి తీసుకునే ఛాన్స్ ఉంది. వీరిలోనూ సామాజిక సమీకరణాల వారీగా అవకాశాలు దక్కుతాయని భావిస్తున్నారు. ఇక ఈసారి కేబినెట్ విస్తరణలో తెలుగు రాష్ట్రాలకు అవకాశం ఉండబోదని తెలుస్తోంది.

## ఇమ్రాన్‌ను తక్షణమే ఆస్పత్రికి తరలించండి

### పాకిస్థాన్ సుప్రీంకోర్టు ఆదేశం



**ఇస్లామాబాద్, ఆగస్టు 18:** పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్‌కు భారీ ఊరట లభించింది. ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తుండడంతో వెంటనే ఆస్పత్రికి తరలించాలని అక్కడి అత్యున్నత న్యాయస్థానం ప్రభుత్వ అధికారులను ఆదేశించింది. ఇమ్రాన్ వైద్య నివేదికలను ఉటంకిస్తూ కుటుంబసభ్యులు, పాకిస్థాన్ తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ పార్టీ (పిటిఐ) నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో ఈ ఆదేశాలు జారీ చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాన్ని ఐటిఐ అధికార ప్రతినిధి జుల్ఫికర్ బుఖారీ స్వాగతించారు. ఈ చర్యలు ముందే తీసుకుని ఉంటే ఆయన ఆరోగ్యం ఇంతగా క్షీణించి ఉండేది కాదని పేర్కొన్నారు. ఇమ్రాన్ పూర్తిగా కోలుకునే వరకు ఆయనను ప్రైవేట్ వైద్యుల సంరక్షణలోనే ఉంచాలని కోర్టుకు విజ్ఞప్తి చేశారు. ఇమ్రాన్ ఆరోగ్య పరిస్థితిపై ఆ దేశ మాజీ అధ్యక్షుడు ఆరిఫ్ అల్వీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇమ్రాన్ వైద్య నివేదికలను తాను నిపుణులతో కలిసి పరిశీలించానని, ఆయన ఆరోగ్యం రోజురోజుకు క్షీణిస్తోందని వారు చెప్పారని పేర్కొన్నారు. మూడేళ్ల జైలు జీవితం, ఒంటరితనం వల్ల ఆయన తీవ్రమైన ఒత్తిడి, మానసిక, శారీరక సంబంధమైన సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. గత ఏడు నెలలుగా తన కుటుంబం, పార్టీనేతలు ఎలా ఉన్నారనే విషయాలతో పాటు.. బయట కూడా అసలేం జరుగుతుందో ఆయనకు తెలియదు. అందుకే ఇమ్రాన్ రోజురోజుకు మరింత కుంగిపోతున్నారు' అని పేర్కొన్నారు.

# సంక్షిప్త వార్తలు

## హర్మూజ్ జలసంధిలో వాణిజ్య నౌకపై దాడి: ఒకరు మృతి



**టెహ్రాన్, ఆగస్టు 18:** హర్మూజ్ జలసంధిలో ఓ వాణిజ్య నౌకపై మంగళవారం దాడి జరిగింది. గుర్తు తెలియని క్షిపణి లేదా డ్రోన్ నౌకను ఢీకొట్టడంతో ఇంజిన్ రూమ్ పూర్తిగా ధ్వంసమైనట్లు తెలుస్తోంది. ఈ ఘటనలో ఒక మృతి చెందినట్లు బ్రిటన్ మారిటైమ్ ట్రేడ్ ఆపరేషన్స్ సంస్థ వెల్లడించింది. నౌకలోని మిగతా సిబ్బందిని కాపాడేందుకు ఒమర్ కోస్ట్‌గార్డ్ సిబ్బంది రంగంలోకి దిగినట్లు తెలిపింది. దాడి ఎవరు చేశారనే దానిపై ఇంకా స్పష్టత రాలేదని పేర్కొంది. ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు మరింత పెరుగు తున్న వేళ ఈ దాడి చోటుచేసుకోవడం గమనార్హం.



## ప్రధాని కార్యాలయంపై డ్రోన్ల దాడి

**బాగ్దాద్, ఆగస్టు 18:** ఇరాక్‌లోని కుర్దిస్థాన్ ప్రాంతీయ ప్రభుత్వ ప్రధాని మస్రూర్ బర్జానీ కార్యాలయంపై సోమవారంరాత్రి డ్రోన్ల దాడి జరిగింది. ఈ దాడులకు ఇరానే కారణమని కుర్దిస్థాన్ భద్రతా సంస్థ ఆరోపించింది. ప్రధాని కార్యాలయంతోపాటు కుర్దిస్థాన్ భద్రత, నిఘా సంస్థ 'పరా స్తిన్' అధిపతి నివాసాన్ని కూడా డ్రోన్లు లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది. ఈ దాడుల్లో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని పేర్కొంది. కీలక ప్రభుత్వ, భద్రతా వ్యవస్థలను లక్ష్యంగా చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించే పరిణామమని తెలిపింది. కుర్దిస్థాన్ ప్రధాని మస్రూర్ బర్జానీ ఈ దాడిని తీవ్రంగా ఖండించారు.

## కేంద్రమంత్రి జెపినడ్డాకు యాంజియోప్లాస్టీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి జేపీ నడ్డా స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. ఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)లో చేరిన ఆయనకు వైద్యులు యాంజియోప్లాస్టీ నిర్వహించారు. ముందురోజు ఈ చికిత్స జరగ్గా, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని ఎయిమ్స్ వర్గాలు నేడు ఒక అధికారిక ప్రకటనలో తెలిపాయి. ఆయనను కార్డియాలజీ విభాగంలో వైద్యుల పర్యవేక్షణలో ఉంచినట్లు పేర్కొన్నాయి. ఈనెల 13వ తేదీ సాయంత్రం జేపీ నడ్డాకు కాస్త నలతగా అనిపించడంతో కుటుంబ సభ్యులు ఆయనను ఎయిమ్స్‌కు తరలించారు.

## బీహార్‌లో భారీగా ఐపిఎస్‌ల బదలీలు..

**పాట్నా,ఆగస్టు 18:** బీహార్‌ప్రభుత్వం మంగళవారం భారీస్థాయిలో పోలీసు అధికారుల బదిలీలు చేపట్టింది. మొత్తం 17మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. పోలీసుల చర్యలపై తీవ్ర వివాదాలు చెలరేగిన భోజ్‌పూర్, సివాన్ జిల్లాల ఎస్పీలను కూడా బదిలీ చేయడం గమనార్హం. రాష్ట్ర హోంశాఖ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం సివాన్ ఎస్పీ పూరణ్‌కుమార్ ఝూను బదిలీ చేశారు. గతనెల 25న సివాన్‌లో విద్యార్థుల ఆందోళన సందర్భంగా పోలీసు బలగాల ఆధ్వర్యంలో ఏకే47 రైఫిల్‌ను వినియోగించిన ఘటన తీవ్ర దుమారం రేపింది.

## డంపర్‌ను ఢీకొన్న వాహనం: 8 మంది కూలీలు మృతి, 32 మందికి గాయాలు



**గ్వాలియర్,ఆగస్టు 18:** మధ్యప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. రోడ్డుపై ఉన్న ఆవులను తప్పించే క్రమంలో వాహనం అదుపుతప్పి ఎదురుగా వస్తున్న డంపర్ ట్రక్కును ఢీకొట్ట డంతో ఎనిమిదిమంది కూలీలు మృతి చెందారు. మరో 32 మంది గాయపడ్డారు. ఈ విషాదకర సంఘటన భిండ్‌గ్వాలియర్ జాతీయ రహదారిపై చిమ్కా గ్రామం సమీపంలో రాత్రి సుమారు 1 గంటకు ఈ ప్రమాదం జరిగింది.

## చంపత్‌రాయ్, మిశ్రాలకు క్లీన్‌చిట్



**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** అయోధ్యరామాలయంలో విరాళాలను చోరీ చేసిన కేసులో సిట్ తన నివేది కను రిలీజ్ చేసింది. రామ జన్మభూమి ట్రస్టు మాజీ చీఫ్ చంపత్ రాయ్‌తో పాటు మాజీ సభ్యుడు అనిల్ మిశ్రాకు ఆ కేసులో సిట్ క్లీన్ చిట్ ఇచ్చింది. ఈ కేసులో 8 మందిని యూపీ సర్కారు అరెస్టు చేసింది. వాస్తవానికి విరాళాలు చోరీ అయినట్లు తెలిసిన కొన్ని రోజులకే చంపత్ రాయ్ తన రాజీనామాను సమర్పించారు. రామాలయ ట్రస్టు మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కు స్పెషల్ ఇన్‌వెస్టిగేటింగ్ టీమ్ క్లీన్ చిట్ ఇచ్చింది. ట్రస్టులో సభ్యుడిగా ఉన్న అనిల్ మిశ్రాకు కూడా సిట్ క్లియరెన్స్ ఇచ్చింది.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
బుధవారం 19, ఆగస్టు 2026




శ్రీవారిని దర్శించుకున్న ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్, చింతకాయల విజయ్

8లో



సింహాచలేశుని దర్శించుకున్న

# బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

**ప్రత్యేక పూజలు.. వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనాలు**



విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాత వార్త :

ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా విశాఖపట్నం విచ్చేసిన భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహ స్వామివారిని మంగళవారం దర్శించుకున్నారు. సింహాచలం ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు సాదర స్వాగతం పలికి స్వామివారి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామివారిని దర్శించుకున్న నితిన్‌నబిన్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం స్వామివారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆయనకు ఆశీర్వచనాలు (తరువాయి 8వ పేజీలో)

నైపుణ్యాల సాధనతోనే

# ఉజ్వల భవిష్యత్తు

**భోగాపురం విమానాశ్రయంలో సౌకర్యాలు అభినందనీయం**

**అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం దేశానికే తలమానికం కాగలదని ఆకాంక్ష**

**పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు**



విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త :

యువత తమకిష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, నిరంతరం శ్రమిస్తే జీవితంలో తిరుగులేని విజయాలు సాధించవచ్చని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పిలుపు నిచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు భోగాపురంలో (తరువాయి 8వ పేజీలో)

ఢిల్లీని మించిపోతున్న

# విశాఖ కాలుష్యం

**అసెంబ్లీలో గంటా**



విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

విశాఖ కాలుష్యం ఒక్కోసారి దేశ రాజధాని ఢిల్లీని మించిపోతోందని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం అసెంబ్లీలో మాట్లాడుతూ ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లో గాలి నాణ్యత సూచిక 116, ఢిల్లీలో 195 ఉండగా.. విశాఖలో 205 గా ఉందని రీడింగ్‌లు చూపించారు. విశాఖలో ఒక్క పోర్టు కాలుష్యం మాత్రమే కాకుండా ఫార్మా, రిఫైనరీలు, ఫెర్టిలైజర్స్ వంటి అనేక పరిశ్రమలున్నాయని, వాహన కాలుష్యం కూడా ఉందన్నారు. బొగ్గు, ఇనుప ఖనిజాల ఎక్కువ కాలుష్యం వెదజల్లడాన్ని దృష్టిలో ఉంచుకుని చెన్నై పోర్టుకు సమీపంలో ఎన్నూర్ పోర్టు అభివృద్ధి చేసిన మాదిరిగా శ్రీకాకుళం జిల్లా మూలపేటకు అలాంటి వాటి (తరువాయి 8వ పేజీలో)

విశాఖలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి

# జన్మదిన వేడుకలు

**కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జీవీ రామచంద్రరావు**

**డాక్టర్ చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో కళాభారతి ఆడిటోరియంలో ఘనంగా నిర్వహణ**




విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

డాక్టర్ చిరంజీవి కళాపరిషత్ ఆధ్వర్యంలో నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి జీవీ రామచంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

**కృషితో ఎదిగిన మహోన్నత వ్యక్తి చిరంజీవి**

ఈ సందర్భంగా జీవీ రామచంద్రరావు మాట్లాడుతూ, ఎలాంటి సినీ నేపథ్యం లేకుండా స్వయంకృషితో, అంకితభావంతో (తరువాయి 8వ పేజీలో)

పల్లె పల్లెకి పార్టీ జెండా..

# అదే ఏపీ బీజేపీ ఎజెండా..




- పార్టీని గ్రామస్థాయి వరకు బలోపేతం చేయాలి
- ప్రజలతో నిరంతరం మమేకం కావాలి
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి పంచాయతీలో కమలం వికసించాలి
- 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యం
- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ దిశానిర్దేశం



విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

పార్టీ సమావేశాలకే పరిమితం కాకుండా నేరుగా ప్రజల్లోకి వెళ్లి వారితో నిరంతరం మమేకం కావాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. విశాఖపట్నంలోని వైజాగ్ కన్వెన్షన్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పార్టీ భవిష్యత్ కార్యాచరణపై శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

బీజేపీని ప్రతి గ్రామానికి, ప్రతి బూత్‌కు తీసుకెళ్లాలని నితిన్ నబిన్ సూచించారు. ప్రజలతో నిరంతరం సంపర్కం, సంభాషణ, సంబంధం కొనసాగిస్తూ సేవా కార్యక్రమాల ద్వారా వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు.

సాధారణ కార్యకర్తగా రాజకీయ జీవితం ప్రారంభించి జాతీయ స్థాయికి ఎదిగిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వంటి నాయకుల ప్రస్థానం బీజేపీ ప్రత్యేకతకు నిదర్శనమన్నారు. పదవుల కోసం కాకుండా



ప్రజల మధ్య పనిచేసే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని స్పష్టం చేశారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పిలుపునిచ్చారు.

**ఎన్డీయే విజయాన్ని ప్రజాసేవకు వేదికగా మార్చాలి**

ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమికి ప్రజలు ఇచ్చిన అపూర్వ విజయాన్ని అభివృద్ధి, ప్రజాసేవకు వేదికగా మార్చాలని నితిన్ నబిన్ అన్నారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి 21 లోక్‌సభ స్థానాలు, 164 అసెంబ్లీ స్థానాలు లభించాయని గుర్తుచేశారు. ఈ విజయం గర్వించడానికి మాత్రమే కాదని, ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యతను మరింత పెంచిందని అన్నారు.

బీజేపీ–టీడీపీ–జనసేన కూటమి రాష్ట్ర అభివృద్ధికి కొత్త అధ్యాయానికి నాంది పలికిందన్నారు. బీజేపీ కేవలం అధికారం కోసం ఏర్పడిన పార్టీ కాదని, శ్యామాప్రసాద్ ముఖర్జీ జాతీయవాదం, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ అంత్యోదయం, అటల్ బిహారీ వాజ్‌పేయి సుపరిపాలన సిద్ధాంతాల బాటలో పార్టీ ఎదిగిందన్నారు. త్యాగం, తపస్సు, సిద్ధాంతం, దేశ ప్రథమ భావన బీజేపీకి పునాదులని పేర్కొన్నారు. 'నేషన్ ఫస్ట్.. పార్టీ నెక్ట్.. సెల్ఫ్ లాస్ట్' అనే సిద్ధాంతంతో పార్టీ పనిచేస్తుందని తెలిపారు. కూటమి ధర్మాన్ని పాటిస్తూనే రాష్ట్రంలో పార్టీని బలోపేతం చేయాలని, ప్రజా సమస్యలపై నిరంతరం స్పందించాలని కార్యకర్తలకు సూచించారు.

**అభివృద్ధి ప్రాజెక్టులను ప్రజల్లోకి తీసుకెళ్లాలి**

ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రారంభిస్తోందని నితిన్ నబిన్ అన్నారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, అమరావతి అభివృద్ధి, రాయ్‌పూర్–విశాఖపట్నం గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, ఏఎంసీఏ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. భారత్ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత ఉద్యోగాల కోసం ఎదురుచూసే వారిగా కాకుండా ఉద్యోగాలు సృష్టించే పారిశ్రామిక వేత్తలుగా ఎదిగే వాతావరణాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. స్టార్టప్‌లు, మేక్ ఇన్ ఇండియా, పరిశోధన, ఇంజినీరింగ్, వైద్య రంగాల్లో యువతకు ఉన్న అవకాశాలను వివరించాలని సూచించారు. సోషల్ మీడియా ద్వారా కొత్త తరంతో నిరంతరం సంభాషించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.

**స్థానిక సంస్థల ఎన్నికల్లో కమలం వికసించాలి: మాధవ్**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ప్రారంభోపన్యాసం చేస్తూ ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి గ్రామానికి పార్టీని విస్తరించడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. 'మన ఊరు––మన జెండా' కార్యక్రమం ద్వారా ప్రతి గ్రామంలో బీజేపీ జెండా ఎగరాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి అందిస్తున్న నిధులు, రహదారులు, కాలువలు, వీధిదీపాలు, మరుగుదొడ్లు, ఆరోగ్యం, విద్య, పారిశుధ్య కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో 13,219 గ్రామ పంచాయతీల్లో బీజేపీ ప్రజాప్రతినిధులు గెలిచేలా కార్యాచరణ రూపొందించాలని మాధవ్ అన్నారు. అవకాశం ఉన్న ప్రతి చోట సర్పంచ్, వార్డు సభ్యుడు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, మున్సిపల్ కౌన్సిలర్, కార్పొరేటర్ నుంచి చైర్మన్, మేయర్ వరకు బీజేపీ ప్రజాప్రతినిధులను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికలకు (తరువాయి 8వ పేజీలో)

మట్టి కుప్పలో మృతదేహాలు, పుర్రెలు..

# షీలానగర్‌లో తీవ్ర కలకలం!



గాజువాక, ఆగస్టు18, ప్రభాతవార్త :

గాజువాక షీలానగర్ ప్రాంతంలో తీవ్ర కలకలం! చోటు చేసుకుంది. నిర్మాణంలో ఉన్న షీలానగర్–సబ్బ వరం పోర్టు కనెక్టివిటీ రోడ్డు పనుల కోసం వేసిన మట్టికుప్పలో కుళ్లిపోయిన మృతదేహాలు, మానవ పుర్రెలు, అస్థిపంజరాలు బయటపడటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు.



- భయాందోళనలో స్థానికులు
- విచారణ చేస్తున్న గాజువాక పోలీసులు

**అర్ధరాత్రి డంపింగ్....తెల్లవారేసరికి తీవ్ర దిగ్భ్రాంతి..**

షీలానగర్ జంక్షన్‌కు దాదాపు 50 మీటర్ల దూరంలో రోడ్డు పక్కన కనెక్టివిటీ రోడ్డు పనులు జరుగుతున్నాయి. మంగళవారం అర్ధరాత్రి సుమారు (తరువాయి 8వ పేజీలో)

# పోర్టు కాలుష్యంతో విశాఖ ఉక్కిరిబిక్కిరి!

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

విశాఖపట్నం పోర్టు కార్యకలాపాల కారణంగా నగరంలో పెరుగుతున్న దుమ్ము, ధూళి కాలుష్యంపై విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ మంగళవారం శాసనసభలో గళమెత్తారు. పోర్టు అభివృద్ధి అవసరమే అయినప్పటికీ.. దాని కోసం విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణకు తక్షణమే కఠినమైన, శాశ్వత చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరారు. పోర్టులోని బెర్తులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించిన నేపథ్యంలో పర్యావరణ నిబంధనల అమలుపై మరింత కఠినమైన పర్యవేక్షణ అవసరమని తెలిపారు. కొంతమంది ఆపరేటర్లు నిబంధనలు పూర్తిస్థాయిలో పాటించక



పోవడం వల్ల పోర్టు పరిసర ప్రాంతాల్లో దుమ్ము కాలుష్యం తీవ్రంగా పెరుగుతోందని పేర్కొన్నారు. బల్క్ కార్గో, ముఖ్యంగా ధూళి ఎక్కువగా వ్యాపించే సరుకుల లోడింగ్, అన్‌లోడింగ్

- ప్రజల ఆరోగ్యంతో చెలగాటం వద్దు..
- నిబంధనలు ఉల్లంఘించే వారిపై కొరడా ఝుళిపించాలి: ఎమ్మెల్యే వంశీకృష్ణ

సమయంలో తప్పనిసరిగా నీటిని పిచికారీ చేయడంతో పాటు స్టాక్ యార్డులను పూర్తిగా తార్పాలిన్లతో కప్పాలని సూచించారు. లారీల్లో కార్గోను పూర్తిగా కప్పి రవాణా చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పోర్టు రోడ్లపై పేరుకుపోయే దుమ్మును కేవలం నీటితో నియంత్రించకుండా ఆధునిక డస్ట్ క్లీనింగ్ యంత్రాలను మరింతగా వినియోగించాలని అన్నారు. బల్క్ కార్గో నుంచి ధూళి వ్యాప్తిని తగ్గించేందుకు పోర్టులో మరిన్ని (తరువాయి 8వ పేజీలో)

# కోర్టు ఆదేశాల్నీ లెక్కచేయరా?

**అర్జెంట్ ప్రొఫెసర్లకు అన్యాయం**

**విశాఖ కలెక్టర్‌ని ఆశ్రయించిన 24మంది ఆచార్యులు**




విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ఏయులో అరాచకం కొనసాగుతోంది. ఆచార్యులకూ ఇక్కడ గౌరవం దక్కడం లేదు. కోర్టు ఆదేశాల్నీ పట్టించుకోవడం లేదు. వీసీ ఒంటెద్దు పోకడను నియంత్రించలేని పరిస్థితి. ఇదే విషయమై బాధితులు నేరుగా విశాఖ కలెక్టర్ను కలుసుకుని తమ బాధను విన్నవించుకున్నారు. ఆంధ్రా యనివర్శిటీలో రెండేళ్ల క్రితం 24మంది ఆచార్యుల్ని అర్జెంట్ ప్రొఫెసర్లగా నియమించారు. ఫుల్ టైం ఆచార్యులొచ్చేంత వరకూ మీరే పని చేయాల్సి ఉంటుందంటూ అర్జెంట్ ప్రొఫెసర్లతో అప్పటి ఏయ అధికారులు ఒప్పందం కూడా కుదుర్చుకున్నారు. ఇప్పుడు ఏయలో శాశ్వత ప్రాతిపదికన ఆచార్యులు లేకపోయినా అర్జెంట్ ప్రొఫెసర్లను కొనసాగించడం లేదు. తమకు నచ్చినవారిని ఏయలోకి తెచ్చుకునేందుకు అధికారులు పావులు కదుపుతున్నారు. తామెదుర్కొంటున్న సమస్యలపై 24మంది అడ్జెంట్ ప్రొఫెసర్లు కోర్టును కూడా ఆశ్రయించారు. న్యాయస్థానం కూడా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. అయినప్పటికీ ఇంజినీరింగ్ కళాశాలకు ఫ్యాకల్టీ కావాలంటూ ఏయ తాజాగా ప్రకటన ఇవ్వడంపై బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమను ఏయలో కొనసాగించాలంటూ వీసీ, రిజిస్ట్రార్ను కూడా ఆశ్రయించినా ఫలితం లేకపోవడంతో బాధితులు నేరుగా విశాఖ కలెక్టర్ పీజీఆరఎస్ ఆశ్రయించారు. కోర్టు ఉత్తర్వులిచ్చినా ఏయ అధికారులు పూర్తిస్థాయిలో అర్జెంట్ ప్రొఫెసర్ల విషయాన్ని పట్టించుకోకపోవడంతో కలెక్టర్ కూడా ఆశ్చర్యపోయారు. ఈ విషయమై దృష్టి సారిస్తానని కలెక్టర్ అభిషిక్త కిషోర్ కూడా హామీ ఇచ్చినట్టు బాధితులు తెలియజేశారు.

బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన

# జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్

విశాఖపట్నం, ఆగస్టు18 ప్రభాత వార్త :

బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల సమావేశం–2026కు విచ్చేసే మంత్రులు, డెలిగేట్స్ నగరంలో పర్యటించబోయే ప్రదేశాలు, అక్కడ చేయవలసిన ఏర్పాట్లను జిల్లా కలెక్టరు అభిషిక్త కిషోర్ మంగళవారం ఉదయం పరిశీ లించి అధికారులకు సూచనలు, ఆదేశాలు జారీచేసారు. హై టీ ఏర్పాటు చేస్తున్న రుషికొండ బీచ్ పరిస రాలను పరిశీలించి అక్కడ కావలసిన ఏర్పాట్ల గూర్చి అధికారులతో చర్చించారు. పరిసరాలను శుభ్రం చేయాలని, అంతర్జాతీయ స్థాయి ప్రమా ణాలకు తగినట్లుగా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. విదేశీ అతిథులకు ఎటువంటి లోటుపాట్లు రాకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. బీచ్ పరిసరాలను బ్లూఫ్లాగ్ బీచ్ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దాలని, నిర్వహణ చేయాలని తెలిపారు. అనంతరం తొట్లకొండ బౌద్ధారామాన్ని (తరువాయి 8వ పేజీలో)





### శ్రీవారిని దర్శించుకున్న

## ఏపీ అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఈరోజు మంగళవారం ఉదయం కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం అందించగా, ఆలయ అధికారులు స్వామివారి పట్టువస్త్రాలు, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఈ సందర్భంగా ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో నడిపిస్తోందని అన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణానికి స్వామివారి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు. అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా శరవేగంగా పూర్తి కావాలని ఆకాంక్షించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రం మరింత సుభిక్షంగా ఉండాలని, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ప్రభుత్వానికి శ్రీవారి కృపాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు స్పష్టం చేశారు.

### సింహాచలేశుని దర్శించుకున్న

## బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్

(7వ పేజీ తరువాయి)

అందించి, స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకులు బీ.ఎల్. సంతోష్, రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస్‌వర్మ, రాష్ట్రపార్టీనాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. సింహాచలేశుని దర్శనం అనంతరం నితిన్ నబిన్ విశాఖపట్నంలో నిర్వహిస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్నారు.

## నైపుణ్యాల సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు

(7వ పేజీ తరువాయి)

ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి సౌకర్యాలను అభినందించారు. ఓ వైపు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో దేశానికే తలమానికంగా విమానాశ్రయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తనకు మిత్రుడైన జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఎన్. రావుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ వంటి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో స్వయం ఉపాధి శిక్షణ అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, మొబైల్ మెకానిజం, ఐటీ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ద్వారా యువత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.ఆర్. సంస్థ ప్రతినిధులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## ఢిల్లీని మించిపోతున్న విశాఖ కాలుష్యం

(7వ పేజీ తరువాయి)

కార్యకలాపాలను తరలించాలని సూచించారు. తెల్లచొక్కాతో విశాఖ వన్ టౌన్ ప్రాంతానికి వెళ్లి చొక్కా రంగు మారకుండా రాలేరని తన మిత్రులైన కొందరు వాకర్లు తనతో చెప్పిన విషయాన్ని గంటా ప్రస్తావించారు. యూరోపియన్ దేశాల మాదిరిగా కాలుష్య కారక పరిశ్రమలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని, పరిశ్రమ స్థాపనకయ్యే వ్యయంలో 10 శాతం గ్రీన్ కవర్ కోసం వెచ్చించాలనే కఠిన నిబంధన విధించాలని పేర్కొన్నారు. పాతికేళ్ల క్రితం అవసరాలకు తగ్గట్టు నియమించిన ఉద్యోగులే కాలుష్య నియంత్రణ మండలిలో ఉన్నారని.. సిబ్బందిని పెంచి ఆ శాఖను మరింత పటిష్టం చేయాలని చెప్పారు. పరిశ్రమలు ఎస్.టి.పి.లు, ఈ.టి.ఎఫ్.లు వంటి కాలుష్య నియంత్రణ చర్యలు తీసుకునేలా పర్యవేక్షించాలన్నారు. గూగుల్ సహా అనేక ఐటీ కంపెనీలు, టూరిజం ప్రాజెక్టులు, ఫైవ్ స్టార్ హోటల్స్, రిసార్ట్స్ విశాఖ వస్తున్నాయని, కాలుష్యం విషయంలో భయపడే స్థితి రాకుండా చూడాలని కోరారు. ఏపీ గ్రీన్ చైర్మన్ గా నియమితులైన కె.నాగబాబు కాలుష్య నియంత్రణ దిశగా చర్యలు చేపట్టాలని, కాలుష్య కట్టడిని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు.

విశాఖ ఎయిర్ పోర్టు ప్రైవేట్ సిబ్బందికి ప్రత్యామ్నాయం చూడాలి

ఎయిర్ పోర్టు భోగాపురం తరలిపోయిన నేపథ్యంలో విశాఖ ఎయిర్ పోర్టులో పని చేసిన ప్రైవేట్ సిబ్బందికి ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని గంటా శ్రీనివాసరావు అసెంబ్లీలో కోరారు. రెస్టారెంట్లు, కేటరింగ్, క్లీనింగ్ తదితర విభాగాల్లో 1,450 మంది పనిచేస్తున్నారని, ఎన్ని ఏళ్లుగా విశాఖ ఎయిర్ పోర్టుతో అనుబంధం ఉన్న వారిలో చాలామందికి ఉపాధి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. వీరు కాకుండా 65 టాక్సీలపై ఆధారపడిన 100 మంది జీవనోపాధి దెబ్బతిందన్నారు. ఎన్నో ఏళ్లుగా విశాఖ ప్రజలతో పెన వేసుకున్న ఎయిర్ పోర్టు బంధం ఈనెల 16 తో తెగిపోయిందని భావోద్వేగం చెందారు.

## బ్రిక్స్ దేశాల క్రీడా మంత్రుల పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టరు అభిషిక్త్ కిషోర్

(7వ పేజీ తరువాయి)

పరిశీలించి అక్కడ ఏర్పాట్ల గూర్చి తెలియజేస్తూ స్వాగత ద్వారం, బ్యానర్లు ఏర్పాటు చేయాలన్నారు. అతిథులకు స్థానిక గైడ్ ద్వారా ముందుగానే ఈ ప్రాంత విశిష్టతను తెలియజేయాలని, పర్యటన అనంతరం ఫోటోసెషను ఏర్పాటు చేయాలన్నారు. తరువాత తొట్లకొండ వ్యూపాయింటు వద్దకూడా ఫోటోసెషను ఏర్పాటుచేయాలని తెలిపారు. 22వ తేదిన తొట్లకొండ బౌద్ధారామం వద్దకు సందర్శకులను అనుమతించవద్దని, ముందుగానే తెలియజేస్తూ బోర్డు ఏర్పాటు చేయాలని, పత్రికా ప్రకటన జారీ చేయాలనిఅధికారులనుఆదేశించారు. కంబాలకొండ వన్యప్రాణుల అభయారణ్యం సందర్శించి అక్కడ గల సందర్శన స్థలాలు, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ విశాఖ మ్యూజియం, ఎయిర్ క్రాఫ్ట్ మ్యూజియం తదితర ప్రదేశాలను పర్యటనలో చేర్చే అవకాశాలను పరిశీలించి తుది పర్యటన రూపొందించి సమర్పించాలని జిల్లా కలెక్టరు అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో భీమునిపట్నం రెవిన్యూడివిజినల్ అధికారి సంగీత్ మాధుర్, సెట్విస్ సిఇఒ రమ్య, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి గాలియట్, జిల్లా టూరిజం అధికారి జె. మాధవి, విఎంఆర్డిఏ, జివిఎంసి, ఎపిటిడిసి అదికారుల పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్-2026 జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :



జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమరావతి ఛాంపి యన్‌షిప్-2026 జిల్లా స్థాయి పోటీలు, ఎంపికలు ఈ నెల 14న కొమ్మాడిలోని సాప్ సమగ్ర క్రీడా సముదాయంలో నిర్వహించారు.

అండర్--17, అండర్--23 బాలురు, బాలికలకు ఆర్చరీ, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, చెస్, హాకీ, కబడ్డీ, ఖోఖో, వెయిట్‌లిఫ్టింగ్, వాలీబాల్, యోగా తదితర 12 క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు ఆగస్టు 24 నుంచి 26 వరకు తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో విశాఖపట్నం జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో వివిధ కేటగిరీల్లో విజేతలకు మొత్తం రూ.91.90 లక్షల నగదు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి జూన్ గల్లియట్, జోనల్ కమిషనర్ ఐ. వెంకటేశ్వరరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత ఐ. వెంకటేశ్వరరావు, జిల్లా ఒలింపిక్ సంఘం కార్యదర్శి కె. సూర్యనారాయణ, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు, డీఎస్ఏ కోచ్‌లు, సిబ్బంది తదితరులు హాజరయ్యారు.

# పల్లె పల్లెకి పార్టీ జెండా.. అదే ఏపీ బీజేపీ ఎజెండా

(7వ పేజీ తరువాయి)

ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని, ప్రతి జిల్లాలో పర్యటించి పార్టీ బలాన్ని పెంచుకోవాలని కార్యకర్తలకు సూచించారు.

**'జనతా వారధి'ని మండల స్థాయికి విస్తరించాలి**

ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్రమాన్ని మండల స్థాయికి తీసుకెళ్లాలని మాధవ్ అన్నారు. ప్రజలు బీజేపీని ఆశ్రయిస్తే తమ సమస్యకు పరిష్కారం లభిస్తుందనే నమ్మకాన్ని కల్పించాలన్నారు. ప్రతి బూత్‌లో 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో యువతకు దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విజయాలను పరిచయం చేసే కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు.

**ఉత్తరాంధ్రకు పోలవరం జలాలు**

విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు కావడం చారిత్రాత్మక పరిణామమని మాధవ్ అన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,414 కోట్ల రివైవల్ ప్యాకేజీ అందించిన కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. విశాఖకు గూగుల్ సెంటర్, గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టులు, అనకాపల్లి బల్క్ డ్రగ్ పార్క్ వంటి పెట్టుబడులు రావడం అభివృద్ధికి సంకేతమన్నారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి రాష్ట్రానికి సాగునీటి భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. పోలవరం ఎడమ కాలువ ద్వారా గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తీసుకెళ్లే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కృష్ణా-గోదావరి జలాల సమన్వయంతో రాయలసీమకు దక్కాల్సిన నీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. రాష్ట్రంలోని జలవనరుల ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయడంపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేయనున్నట్లు తెలిపారు.

**'సేవా సంకల్ప ఉత్సవం'**

ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 17న 25 ఏళ్ల ప్రజా జీవితాన్ని పూర్తి చేసుకోనున్న సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు 'సేవా సంకల్ప ఉత్సవం' నిర్వహించాలని మాధవ్ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతో పాటు సేవా కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

బీజేపీ కార్యక్రమా లు రాజకీయాలకే పరిమితం కాకుండా అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని సాగాలని అన్నారు. సంత్ రవిదాస్ జయంతి, విశ్వకర్మ జయంతి కార్యక్రమాలతో పాటు నాయీ బ్రాహ్మణులు, రజకులు, చేనేత, గీత కార్మికులు, యాదవులు, కుమ్మరి, కమ్మరి తదితర వర్గాలతో విస్తృతంగా అనుసంధాన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. 'వికసిత్ భారత్ యువ సంవాద్' వంటి కార్యక్రమాలను మండల, జిల్లా స్థాయిలో విస్తృతంగా నిర్వహించి యువతను బీజేపీకి మరింత చేరువ చేయాలని మాధవ్ అన్నారు.

**పలువురు నేతల హాజరు**

సమావేశంలో బీజేపీ జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంస్థాగత ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రి వై. సత్యకుమార్ యాదవ్, జాతీయ ఉపాధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ఎంపీలు సీఎం రమేష్, పాకా వెంకట సత్యనారాయణ, ఆర్. కృష్ణయ్య, మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్‌రాజు, సుజనా చౌదరి, కామినేని శ్రీనివాస్, రామకృష్ణారెడ్డి, నడికుడి ఈశ్వరరావు, శాసనమండలి పక్ష నేత సోము వీర్రాజు, పోతుల సునీత, జాతీయ సెల్స్ కో-కన్వీనర్ విష్ణువర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మట్టికుప్పలో మృతదేహాలు..పుర్రెలు... షీలానగర్‌లో తీవ్ర కలకలం!

(7వ పేజీ తరువాయి)

3 గంటల సమయంలో డంపర్ లారీల ద్వారా వివిధ ప్రాంతాల నుంచి తెచ్చిన మట్టిని ఇక్కడ పోశారు. ఉదయం స్థానికులు, కార్మికులు గమనించేసరికి ఆ మట్టికుప్పలలో కుళ్లిపోయిన మృతదేహాలతో పాటు, మానవ పుర్రెలు, ఎముకలు బయటపడ్డాయి. తవ్వ కాలు జరిపే కొద్దీ మరిన్ని పుర్రెలు, మృత దేహ భాగాలు వెలుగుచూస్తుండటంతో ఆ ప్రాంతమంతా శ్మశానాన్ని తలపించింది.

**స్మశానవాటిక నుంచే మట్టి తరలింపు?..**

సమాచారం అందుకున్న గాజువాక సౌత్ సబ్ డివిజన్ ఏసీపీ శ్రీనివాసరావు గాజువాక సి ఐ వాసు నాయుడు పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బయటపడిన మృతదేహాల్లో ఒక పురుషుడు, ఒక మహిళవిగా అనుమానిస్తున్నారు. శవాలకు తెల్లటి బట్టలు చుట్టి ఉండటం, చెక్క శవపేటిక ఆనవాళ్ళు, తలగడలు, పాత బొంతలు, పూలమాలలు కనిపిస్తుండటంతో క్రిస్టియన్ లేదా సాంప్రదాయ అంత్యక్రియలు పూర్తయిన మృతదేహాలుగా గుర్తించారు. ఏదైనా పాత శ్మశానవాటిక లేదా ఖాళీ స్థలంలో మట్టిని జేసీబీలతో తవ్వి, ఆ మట్టిని నేరుగా లారీల్లో నింపి ఇక్కడకు తెచ్చి డంప్ చేసినట్లు పోలీసులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.

**లారీ యజమానులు, కాంట్రాక్టర్లపై పోలీసుల దృష్టి...**

ఈ ఘటనపై కేసు నమోదు చేసిన గాజువాక సిఐ వాసు నాయుడు ఆధ్వర్యంలో పోలీసులు విచారణను వేగవంతం చేశారు. అసలు ఈ మట్టిని ఏ ప్రాంతంలో ఉన్న స్మశానవాటిక లేదా స్థలం నుంచి తవ్వి తీసుకొచ్చారు? అర్ధరాత్రి వేళ మట్టిని తీసుకొచ్చిన డంపర్ లారీలు ఎవరివి? రోడ్డు కాంట్రాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా ఎక్కడి నుంచి మట్టిని కొనుగోలు చేశారు? అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. పరిసర ప్రాంతాల్లోని సీసీటీవీ కెమెరాల దృశ్యాలను సేకరించి, లారీల నంబర్లను గుర్తిస్తున్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించి స్మశానవాటికల నుంచి మట్టి తరలించిన బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఇప్పటివరకు 4 శవాలు, 9 పుర్రెలు బయటపడ్డాయని ఏసీపీ శ్రీనివాస రావు పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని స్థానికులు భయాందోళన పడనవసరం లేదని గాజువాక సి ఐ వాసు నాయుడు వెల్లడించారు.

## ఎస్.ఐ.ఆర్.లో నోటీసుల జారీ, హియరింగ్‌పై ప్రత్యేక దృష్టి

**నిర్ణీత గడువులోగా 100 శాతం నోటీసుల జారీ పూర్తి చేయాలి**

**ఈఆర్వోలు, ఏఈఆర్వోలకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశాలు**

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :



ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా ఓటర్లకు నోటీసుల జారీ, హియరింగ్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గంలో జారీ చేసిన నోటీసులపై సంబంధిత ఈఆర్వోలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ నుంచి జిల్లాలోని ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిపై సమీక్షించారు. డ్రాఫ్ట్ ఎస్.ఐ.ఆర్. ప్రచురితమైన రోజు నుంచి ఇప్పటి వరకు జారీ చేసిన నోటీసులు, వాటి డెలివరీ, హియరింగ్, తదనంతరం వివరాల అప్‌డేట్‌పై నియోజక వర్గాల వారీగా సమీక్షించారు. ఒక్కో ఈఆర్వో తమ నియోజకవర్గ పరిధిలో జారీ చేసిన నోటీసులకు సంబంధించిన వివరాలను కలెక్టర్‌కు వివరించారు. భీమిలి నియోజకవర్గంలో నోటీసుల జారీ పురోగతిపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. నోటీసుల జారీలో ఎటువంటి జాప్యాన్ని సహించబోమని, ఒక్క రోజులో 100 శాతం నోటీసుల జారీ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. తూర్పు నియోజకవర్గ పరిధిలో నోటీసుల డెలివరీని వేగవంతం చేయాలని, పెండింగ్ లేకుండా వెంటనే సంబంధిత ఓటర్లకు నోటీసులు అందజేయాలని సూచించారు. ఓటర్ల నుంచి నోటీసులు తిరిగి స్వీకరించిన వెంటనే సంబంధిత వివరాలను అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలో పూర్తయిన హియరింగుల వివరాలను తప్పనిసరిగా బీఎల్వో యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనూ ఎస్.ఐ.ఆర్. ప్రక్రియ పురోగతిని వేగవంతం చేయాలని ఆదేశించారు. గాజువాక నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న నోటీసులను తక్షణమే జారీ చేయాలని స్పష్టం చేశారు. నోటీసుల డెలివరీ, హియరింగ్, వివరాల అప్‌డేషన్ వంటి ప్రక్రియల్లో జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలు, అదనపు ఈఆర్వోలు, ఏఈఆర్వోలు, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై విద్యార్థినులకు అవగాహన

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఛైర్‌పర్సన్ వేటుకూరి ఏవీఎస్ ఎస్ఎన్ రాజు, విశాఖపట్నం పర్యటనలో భాగంగా మధురవాడలోని డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాల (బాలికలు), సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా కమిషన్ ఛైర్‌పర్సన్, సభ్యులు విద్యార్థినులతో సమావేశమై బాలల హక్కుల ప్రాముఖ్యత, బాలల రక్షణకు సంబంధించిన చట్టాలు, బాలల హక్కులను పరిరక్షించడంలో ప్రతి ఒక్కరి బాధ్యతపై అవగాహన కల్పించారు. అనంతరం పాఠశాల, కళాశాల ప్రాంగణాన్ని సందర్శించి విద్యార్థినులకు కల్పిస్తున్న వసతులు, మౌలిక సదుపాయాలు, పరిసరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం అధికారులు విద్యార్థినులకు బేటీ బచావో – బేటీ పడావో, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, బాల్య వివాహాల నిషేధ చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాలికల రక్షణ, విద్య, హక్కుల పరిరక్షణకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించడంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజం సమిష్టిగా బాధ్యత వహించాలని తెలిపారు. విద్యార్థినులు తమకు ఎదురయ్యే సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైనప్పుడు చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి ఛైర్మన్ హరి వెంకట రమణ, జిల్లా మహిళా మరియు శిషు సంక్షేమ శాఖ అధికారిణి సంతోషి కుమారి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె. హరి కృష్ణ, డా. బి.ఆర్. అంబేద్కర్ గురుకుల జిల్లా కోఆర్డినేటర్ నూక రామ కృష్ణ, ప్రిన్సిపాల్ వి. రత్నవల్లి, సభ్యులు డా. ఉదయ్ కుమార్ దిగుమర్తి, సామ్ కుమార్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

**ప్రతి వారం ఒక వార్డులో కాలనీలు, అంతర్గత వీధుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యాచరణ**

**వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేస్తే భారీ జరిమానాలు**

**జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్**

విశాఖపట్నం, ఆగస్టు 18



నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను గుర్తించి పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్, తూర్పు జోన్ జోనల్ కమిషనర్ శివప్రసాద్, ఇతర అధికారులతో కలిసి తూర్పు జోన్ 21వ వార్డు పరిధిలోని వెంకటాద్రి వంటిల్లు వెనుక ప్రాంతంలో పారిశుద్ధ్య పరిస్థితులను కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కమిషనర్ మాట్లాడుతూ, ఇంటింటి వ్యర్థాల సేకరణ, పారిశుద్ధ్య సేవలకు జీవీఎంసీ ప్రజల నుంచి ఎటువంటి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం లేదనే విషయాన్ని ప్రజలు గమనించాలని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులు, జీవీఎంసీ యంత్రాంగం నగర పరిశుభ్రత కోసం నిరం తరం పనిచేస్తూ నిత్యం ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నందున ప్రజలు కూడా బాధ్యతతో సహకరించాలని కోరారు. ప్రతి ఇంటి నుంచి వ్యర్థాలను సేకరించేందుకు జీవీఎంసీ వాహనాలు నిత్యం వస్తున్నందున తడి, పొడి వ్యర్థాలను వేర్వేరుగా అందించాలని, రోడ్లు, కాలువలు, ఖాళీ ప్రదేశాల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ చెత్త వేయరాదని స్థానికులకు అవగాహన కల్పించారు. జీవీఎంసీ వాహనాలకు వ్యర్థాలను అందించకుండా బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేసే వారిపై భారీ జరిమానాలు విధించాల్సి వస్తుం దని హెచ్చరించారు. పరిశీలన సందర్భంగా బహిరంగంగా వ్యర్థాలు వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించారు. కాలువలు, వీధులను పరిశుభ్రంగా ఉంచడం, ఇంటింటి చెత్త సేకరణను పటిష్టం చేయడం, తిరిగి చెత్త పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టడం ద్వారా పారిశుద్ధ్య పనితీరును మెరుగుపరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఈ.ఎన్.వి. నరేష్ కుమార్‌ను ఆదేశించారు. పారిశుద్ధ్య కార్మికుల హాజరు, వ్యర్థాల సేకరణ వాహనాల పనితీరు, ఇంటింటి చెత్త సేకరణను అధికారులు ప్రతిరోజూ పర్యవేక్షించాలని కమిషనర్ స్పష్టం చేశారు. పరిశుభ్రమైన విశాఖ నగర నిర్మాణం జీవీఎంసీతో పాటు ప్రతి పౌరుడి బాధ్యతని, ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ జీవీఎంసీకి పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

ఈ పర్యటనలో జీవీఎంసీ సహాయ వైద్యాధికారి ప్రసాద్, టౌన్ ప్లానింగ్ అధికారి ప్రమీల, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోవింద్, వార్డు సచివాలయ శానిటరీ కార్యదర్శులు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారిని దర్శించుకున్న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ మరియు చింతకాయల విజయ్

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, అలాగే యువ నేత రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ మంగళవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయానికి విచ్చేసిన వీరికి తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు ఆలయ మర్యాదలతో ఘనంగా స్వాగతం పలికి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో వేద పండితులు వారికి సంప్రదాయబద్ధంగా వేదాశీర్వచనాలు అందించారు. అనంతరం ఆలయ అధికారులు వారికి స్వామివారి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను అందజేశారు. కలియుగ దైవమైన శ్రీవారిని దర్శించుకోవడం తమకు ఎంతో ఆనందాన్ని, తీపి ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని వారు భక్తిశ్రద్ధలతో పేర్కొన్నారు.

## విశాఖలో ఘనంగా మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలు

(7వ పేజీ తరువాయి)

అంచెలంచెలుగా ఎదిగి సినీ పరిశ్రమలో తిరుగులేని ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహోన్నత వ్యక్తి చిరంజీవి అని కొనియాడారు. ఆయన సినీ రంగంలోనే కాకుండా సమాజ సేవలోనూ, ముఖ్యంగా ఆపదలో ఉన్న పేద కళాకారులను ఆదుకోవడంలో ఎప్పుడూ ముందుంటారని ప్రశంసించారు.

**కళాకారులకు వెన్నుదన్నుగా ఉంటాం**

కళను నమ్ముకున్న కళాకారులకు సమాజంలో సముచిత స్థానం దక్కాలని, ఏ కళాకారుడికి ఎలాంటి కష్టం వచ్చినా తాను వ్యక్తిగతంగా వెన్నంటే ఉండి ఆదుకుంటానని జీవీ రామచంద్రరావు స్పష్టం చేశారు. కళారంగానికి, కళాకారుల సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు నిరంతరం ఉంటాయని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రవణం స్వామి నాయుడు ,కందుల నాగరాజు, గంటి మురళి, ఈతపాకల సుజాత, ఏడీసీపీ ఖాన్‌లతో పాటు పెద్ద సంఖ్యలో స్థానిక కళాకారులు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవి పుట్టినరోజు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కళాకారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఎంతగానో అలరించాయి.

## పోర్టు కాలుష్యంతో విశాఖ ఉక్కిరిబిక్కిరి!

(7వ పేజీ తరువాయి)

క్లోజ్డ్ గోడౌన్లు ఏర్పాటు చేయాలని వంశీకృష్ణ కోరారు. పోర్టు పరిసరాల్లో భారీగా గ్రీన్‌బెల్ట్ అభివృద్ధి చేయడంతో పాటు పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న అండర్‌గ్రౌండ్ స్టాక్ విధానాలను పరిశీలించి, సాధ్యమైన చోట విశాఖలోనూ అమలు చేయాలని కోరారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలకు అదనంగా రెండు, మూడు ఎయిర్ క్వాలిటీ మానిటరింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి కాలుష్య స్థాయిలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలపై హెచ్చరికలతో సరిపెట్టకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

**పోర్టు సీఎస్ఆర్ నిధులు స్థానికులకే ఉపయోగపడాలి..**

పోర్టు పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల సంక్షేమానికి పోర్టు సంస్థల సీఎస్ఆర్ నిధులను మరింత సమర్థవంతంగా వినియోగించాలని వంశీకృష్ణ కోరారు. ఇప్పటికే పోర్టు ప్రాంతాన్ని సందర్శించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మరోసారి పోర్టు పరిసర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు ఎదుర్కొంటున్న కాలుష్య సమస్యను స్వయంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. "పోర్టు అభివృద్ధి అవసరమే.. కానీ అభివృద్ధి పేరుతో విశాఖ ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టకూడదు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండూ సమతుల్యంగా సాగాలి" అని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు.

## ఘనంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు

ఆనందపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:



జై యాత యువసేన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆనంద పురం 24 కాలనీలో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను మంగళ వారం ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం జిల్లా జై యాత యువసేన సంక్షేమ సంఘం అధ్యక్షుడు కుప్ప రాజశేఖర్ మాట్లాడుతూ, పాపన్న గౌడ్ నిరుపేదలు, బలహీన వర్గాల ప్రజలను ఏకం చేసి పోరాటం చేసిన ధీరోదాత్త నాయకుడని కొనియాడారు. గోల్కొండ కోటను స్వాధీనం చేసుకుని ప్రజా పాలనకు నాంది పలికిన ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం పాపన్న గౌడ్ జయంతి, వర్ధంతి కార్యక్రమాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో భీమిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ కుప్ప రామలక్ష్మి, సంఘం ప్రధాన కార్యదర్శి ముడసల శ్రీను, సభ్యులు కుప్ప అప్పారావు, చుక్క గణేష్, చుక్క రాజు, పీతల రాజు, కుప్ప లోకేష్, ముడసల బంగారాజు, చుక్క నర్సింగరావు, బుడుమూరి సత్తిబాబు, పీతల పైడమ్మ, చుక్క కొండమ్మ, ముడసల బంగారమ్మ, కుప్ప లీలావతి, వనము దేవి, గండి బోయిన రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఏబీవీపీ ఆధ్వర్యంలో ఘనంగా తిరంగా ర్యాలీ

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త :




వందేమాతరం 150 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వతంత్రోద్యమంలో వందేమాతరం విశిష్టతను తెలియజేస్తూ ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద విద్యార్థులతో భారీ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సింగ్ సోలంకి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం ఈ దేశంలో స్వతంత్రోద్యమానికి పునాది పోసిందని ఉన్నారు. పూర్తి వందేమాతరం యొక్క భావాన్ని ప్రతి ఒక్క విద్యార్థి తెలుసుకోవాలని అన్నారు. ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట గోపి మాట్లాడుతూ నేటి యువత వందేమాతర స్ఫూర్తితో దేశ ప్రగతిలో భాగం అవ్వాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ విశాఖపట్నం విభాగ్ కన్వీనర్ ఉమ్మిడి నితిన్, జిల్లా సంఘటన కార్యదర్శి చందు, జిల్లా కన్వీనర్ ప్రసాద్, నగర కార్యదర్శి ధనుష్ తదితరులు భారీ సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## ఏయూలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం

ఆంధ్రవిశ్వవిద్యాలయం, ఆగస్టు 18, ప్రభాతవార్త :




ఆంధ్ర విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలలోలో నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఉన్నత విద్య కమీషనర్ సూచనల మేరకు మాదకద్రవ్యాల వినియోగానికి వ్యతిరేకంగా విద్యార్థులు, అధ్యాపకులు మరియు సిబ్బందిలో అవగాహన కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా విశ్వవిద్యాలయంలోని ఆయా విభాగాల్లో ప్రతిజ్ఞ చేసినట్లు నిర్వహించినట్లు కార్యక్రమ సమన్వయకర్త, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ ఆచార్య హరనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండటంతో పాటు, వాటి వల్ల కలిగే అనర్థాలపై సమాజంలో అవగాహన పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది తదితరులు పాల్గొని నషా ముక్త్ భారత్ నిర్మాణానికి తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిజ్ఞ చేశారు. యువత మాదకద్రవ్యాలకు ఆకర్షితులు కాకుండా విద్యా సంస్థల స్థాయిలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా వివరించారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య పులిపాటి కింగ్, ప్రిన్సిపాల్స్, పాలక మండలి సభ్యులు ఆచార్య టి.చిట్టిబాబు, ఆర్.పద్మశ్రీ, విభాగాధిపతులు, ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మేఘాద్రిగడ్డ గురుకుల విద్యార్థుల తరలింపుపై తల్లిదండ్రుల ఆందోళన

(నక్కపల్లి ,ప్రభాతవార్త)



మేఘాద్రిగడ్డలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల కళాశాలలో చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలలకు తరలించే చర్యలపై విద్యార్థుల తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ మృదుల ప్రియదర్శినిని కలిసి వినతిపత్రం అందజేశారు. గత నెలలో గురుకులంలో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను ఇతర పాఠశాలలకు తరలించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. తాజాగా ఇంటర్మీడియట్ విద్యార్థులను కూడా ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే సమాచారంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో ఆందోళన నెలకొంది అని ప్రిన్సిపాల్ వివరించారు. తమ పిల్లలను గురుకులంలోనే కొనసాగించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతర పాఠశాలలకు తరలించవద్దని తల్లిదండ్రులు ప్రిన్సిపాల్‌ను కోరారు. గతంలో కూడా ఇదే అంశంపై ఆందోళన వ్యక్తం చేసిన సమయంలో స్థానిక ఎమ్మెల్యే ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది ఉండదని, వారిని తరలించబోమని హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. అయితే ప్రస్తుతం విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఒప్పించి గురుకులాన్ని ఖాళీ చేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులను పదేపదే పాఠశాలలు మార్చడం వల్ల వారి చదువుపై, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. “పేద, అణగారిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఏర్పాటు చేసిన గురుకులాలను బలోపేతం చేయాలి తప్ప, వాటిని తొలగించడం లేదా విద్యార్థులను ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదు” అని పూర్వ విద్యార్థుల సంఘ నాయకులు పేర్కొన్నారు. ప్రభుత్వం ఐఐటీ, నీట్ వంటి పోటీ పరీక్షల కోచింగ్ కోసం కొత్త భవనాలు, మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, ఉన్న గురుకులాలను తొలగించకుండా వాటిలోనే విద్యార్థులకు విద్య కొనసాగించాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. భవిష్యత్తులో మరిన్ని గురుకులాలను మూసివేసే పరిస్థితి రాకుండా ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆందోళనలను పరిష్కరించాలని కోరారు. ప్రిన్సిపాల్‌కి వినతిపత్రం అందజేసిన వారిలో పూర్వ విద్యార్థుల సంఘం స్వేరోస్ తరఫున కనకరాజు స్వేరో, విద్యార్థుల తల్లిదండ్రులు జ్యోతి, ఎద్దు ఉమా, దివ్య, పైడిరాజు, సింహాచలం, సునీత పాల్గొని గురుకుల విద్యార్థుల విద్యా భవిష్యత్తును కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు.

## అర్హులైన చేనేత కార్మికులందరికీ ‘నేతన్న సేవలో’ పథకం

నక్కపల్లి ,ప్రభాతవార్త



పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలోని అర్హులైన చేనేత కార్మికులందరికీ ‘నేతన్న సేవలో’ పథకం అమలు చేయాలని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పలువురు చేనేత కార్మికులకు ‘నేతన్న సేవలో’ పథకం కింద నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ కాలేదని స్థానిక నాయకులు, చేనేత కార్మికులు హోంమంత్రి అనిత దృష్టికి తీసుకెళ్లిన విషయం తెలిసినదే.! దీనిపై స్పందించిన మంత్రి క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయి విచారణ చేపట్టి, అర్హులైన ప్రతి చేనేత కార్మికుడికి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు సోమవారం పాయకరావుపేట చేనేత సొసైటీ కార్యాలయంలో జిల్లా జౌళిశాఖ డీవో యశ్వంత్ విచారణ చేపట్టారు. మంగళవారం పాయకరావుపేట నియోజకవర్గంలోని పాయకరావుపేట, నక్కపల్లి, కోటవురట్ల ప్రాంతాలకు చెందిన నాయకులు కూడా నక్కపల్లిలో జిల్లా జౌళిశాఖ డీవో యశ్వంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. నియోజకవర్గవ్యాప్తంగా ‘నేతన్న సేవలో’ పథకం అమలుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, అర్హత కలిగిన చేనేత కార్మికులందరికీ పథకం వర్తించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హత ఉన్న ఏ ఒక్క చేనేత కార్మికుడూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని నాయకులు అధికారులను కోరారు. అర్హులైన చేనేత కార్మికులందరికీ వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుందని, ఎవరూ ఎలాంటి అపోహలకు గురికావాల్సిన అవస రం లేదని నాయకులు తెలిపారు. ఆయనను కలిసిన వారిలో సాంస్కృతిక విభాగం రాష్ట్ర డైరెక్టర్ విలియం కేరి, టీడీపీ మండలశాఖ అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, లింగం నాయుడు, మాజీ టిడిపి అధ్యక్షులు పెద్దిరెడ్డి చిట్టిబాబు, పాండురంగ దేవస్థానం చైర్మన్ మజ్జూరి నారాయణరావు, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు వైబోయిన వెంకటరమణ, టీడీపీ పట్టణ అధ్యక్షులు అడ్డూరి లోవరాజు, యాలవరహాలు ఉన్నారు.

## దుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

ఎస్.రాయవరం, ప్రభాతవార్త



మండల కేంద్రమైన ఎస్.రాయవరం సర్వసిద్ధి ధర్మవరం అగ్రహారం పలు గ్రామాల్లో మంగళ గౌరీ వ్రతాలు దుర్గంబిక ఆలయాల్లో ముత్తయిదులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ అమ్మవారికి దుర్గంబికమ్మ వారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి చండీయామంలో నిర్వహించిన వారికి సన్మాన కార్యక్రమం కూడా బొలిశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వారిని సన్మానించారు ఈ కార్యక్రమంలో పండితులు రంగస్వామి, శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ అర్చకులు చక్రవర్తులు పండితులు పాల్గొని భక్తులను ఆశీర్వదించారు.

## ఎన్ఏఓబి కార్యాలయం మార్పు

ఎస్.రాయవరం, ప్రభాతవార్త



ఎన్ఏఓబికి సంబంధించిన ఎస్‌డిసి కార్యాలయం ఎలమంచిలి సమీపంలో గల సర్వసిద్ధి జంక్షన్ వద్దకు మార్పు చేశారు. మంగళవారం నుంచి కార్యాలయంలో పనులు నిర్వహించారు.

## సింహాద్రినాధుని దర్శించుకొన్న బీజేపీ జాతీయ నాయకులు



సింహాచలం, ఆగస్టు 18, ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీ జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి సంతోష్ జీ, జాతీయ సంఘటన కార్యదర్శి శివ ప్రకాష్‌జీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాస్ వర్మ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించు కున్నారు. సింహాచలం చేరుకున్న బీజేపీ జాతీయ నాయకులకు ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు, సహాయ కార్యనిర్వహణాధికారి కె.తిరుమలేశ్వరరావు, ప్రధానార్చకులు శ్రీనివాసాచార్యులు ఆలయ సంప్రదాయాల ప్రకారం ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ నాదస్వర బృందం, వేద పండితుల వేద మంత్రోచ్ఛారణల నడుమ నాయకులు ముందుగా అత్యంత మహిమాన్వితమైన కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. అనంతరం బేడ మండపంలో ప్రదక్షిణలు నిర్వహించి శ్రీ వరాహలక్ష్మీ నరసింహ స్వామి వారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానంతరం కల్యాణ మండపంలో వేద పండితులు నాదస్వర వాయిద్యాలతో, వేద మంత్రోచ్ఛారణలు, వేద ఘోషల మధ్య వారికి వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు స్వామివారి ప్రసాదాలను, జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని బీజేపీ జాతీయ నాయకులకు అందజేశారు. బీజేపీ జాతీయ నాయకులు సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారి మహిమాన్వితమైన క్షేత్ర విశిష్టతను, ఆలయ ఆధ్యాత్మిక ప్రాధాన్యతను తెలుసుకుని ఆనందం వ్యక్తం చేశారు. స్వామివారి దర్శనం ఎంతో ఆధ్యాత్మిక అనుభూతిని కలిగించిందని పేర్కొంటూ, సింహాద్రి అప్పన్న కృపా కటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేద పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గీతంలో రసాయన, జీవ వ్యర్థాల నిర్వహణ కేంద్రం ప్రారంభం

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక విభాగం (డి.ఎస్.టి) అందించిన “పర్స” (ప్రమోషన్ ఆఫ్ యూనివర్సిటీ రీసెర్చి అండ్ సైంటిఫిక్ ఎక్సలెన్స-పియుఆర్ఎస్ఇ) పథకం ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన ప్రమాదకర రసాయన, జీవ వ్యర్థాల నిర్వహన కేంద్రాన్ని మంగళవారం 18న గీతం స్కూల్ ఆఫ్ డీన్ ప్రొఫెసర్ అనంతరామకృష్ణ పారంభించారు. విశ్వ విద్యాలయ వ్యాప్తంగా వివిధ ల్యాబ్‌లు, పరిశోధనల నుంచి వెలువడే ఉపయోగించిన యాసిడ్‌లు, ప్రమాదకర కర్బన ద్రావకాలు, జీవ వ్యర్థాలను సురక్షితంగా నిల్వ చేయడానికి, నిర్వహించడానికి ఈ కేంద్రం తోడ్పడు తుంది. ఈ సందర్భంగా సైన్స్ డీన్ ప్రొఫెసర్ ఎస్.అనంతరామకృష్ణ మాట్లాడుతూ ప్రయోగశాలు, పరిశోధన ల ద్వారా వెలువడే ప్రమాదకర రసాయన, జీవ వ్యర్థాలను సురక్షితంగా, బాధ్యాతాయుతంగా నిర్వహించడం ఎంతో కీలకమని, సురక్షితమైన, స్థిరమైన పరిశోధనా వాతావరణాన్ని ప్రోత్సహించడంలో ఈ కేంద్రం ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గీతం పరిశోధన, అభివృద్ధి విభాగం డైరక్టర్ ప్రొఫెసర్ యు.ఎ.రామగోపాల్, డిఎస్‌టి-పర్స కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రవికుమార్ గురజాడ, రసాయన శాస్త్ర విభాగం అధిపతి ప్రొఫెసర్ వేణుగోపాల్, రీసెర్చి డెవలప్‌మెంట్ డిప్యూటీ డైరక్టర్లు డా.పి.షణ్ముక ఆనంద్, డాక్టర్ టి.మంజునాథ్, గీతం అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎట్టకేలకు కృష్ణపురం దివాన్జీ సాగునీటి కాలువకి నీటివిడుదల

పద్మనాభం, ఆగస్టు 18, ప్రభాతవార్త



మండలంలో కృష్ణపురం దివాన్జీ సాగునీటి కాలువకి ఎట్టకేలకు మంగళవారం నాయకులు సాగునీటిని విడుదల చేసారు.పొట్నూరులో గోస్తనీ నదిపై ఉన్న మినీఆనకట్టు వద్ద ఈ కాలువకి సంబంధించిన ఉన్న గేటుకి, గంగాదేవికి గ్రామ టీడీపీ నాయకులు సుంకర అచ్చుంనాయుడు, పైడినాయుడు, మొకర చిన్నశ్రీను, రైతులు పూజలు చేసారు. అనంతరం గేట్లు ఎత్తి పసుపు,కుంకుమ, అక్షింతలను గంగలో కలిపారు. దీంతో కృష్ణాపురం, పొట్నూరు, పద్మనాభం, అర్చకునిపాలెం, ఇసుకలపాలెం గ్రామ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అయితే కాంట్రాక్టర్ కాలువ పూడిక తీతను మొక్కుబడిగా తీసారని రైతులు తీవ్రంగా విమర్శిస్తున్నారు.

## నైపుణ్యాల సాధనతోనే ఉజ్వల భవిష్యత్తు

### భోగాపురం విమానాశ్రయంలో సౌకర్యాలు అభినందనీయం -అల్లూరి సీతారామరాజు విమానాశ్రయం దేశానికే తలమానికం కాగలదని ఆకాంక్ష -పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు

విశాఖపట్నం, ఆగస్టు 18 ప్రభాతవార్త



యువత తమకిష్టమైన రంగంలో నైపుణ్యాలను పెంపొందించుకుని, నిరంతరం శ్రమిస్తే జీవితంలో తిరుగులేని విజయాలు సాధించవచ్చని భారతదేశ పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు పిలుపు నిచ్చారు. విజయనగరం జిల్లా భోగాపురం సమీపంలోని జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఆయన సందర్శించి, శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. అంతకు ముందు భోగాపురంలో ఇటీవల ప్రారంభించిన అల్లూరి సీతారామరాజు విమానాశ్రయాన్ని సందర్శించిన ఆయన, అక్కడి సౌకర్యాలను అభినందించారు. ఓ వైపు తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తూనే, అత్యాధునిక అంతర్జాతీయ ప్రమాణాలతో దేశానికే తలమానికంగా విమానాశ్రయాన్ని నిర్మించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే తనకు మిత్రుడైన జీఎంఆర్ గ్రూప్ అధినేత గ్రంధి మల్లికార్జునరావు, బి.వి.ఎన్.రావుల ఆధ్వర్యంలో నడుస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. స్వర్ణభారత్ ట్రస్ట్, ముప్పవరపు ఫౌండేషన్, జీఎంఆర్ ఫౌండేషన్ వంటి సంస్థలు నిరుద్యోగ యువతకు ఉచిత వసతి, భోజన సదుపాయాలతో స్వయం ఉపాధి శిక్షణ అందిస్తూ వారి కాళ్లపై వారు నిలబడేలా ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఎలక్ట్రీషియన్, ఏసీ, టీవీ, మొబైల్ మెకానిజం, ఐటీ వంటి సాంకేతిక రంగాలలో శిక్షణ ద్వారా యువత స్వావలంబన సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జి.ఎం.ఆర్. సంస్థ ప్రతినిధులు, శిక్షణార్థులు పాల్గొన్నారు.

## గుడిలోవలో నేటి నుంచి ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్

### జనాభా అసమతుల్యత, మాదకద్రవ్యాల నివారణపై చర్చలు

ఆనందపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త




విశాఖ సమీపంలోని గుడిలోవ విజ్ఞాన విహార పాఠశాలలో ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్ బుధవారం నుంచి మూడు రోజుల పాటు జరగనుంది. ఈ విషయాన్ని ఆర్ఎస్ఎస్ జాతీయ ప్రచార ప్రముఖ్ సునీల్ అంబేకర్ తెలిపారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో మారుతున్న జనాభా పరిస్థితులు, జనాభా అసమతుల్యత, యువతలో మాదకద్రవ్యాల వినియోగం, సామాజిక మార్పులు తదితర అంశాలపై సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. ఆర్ఎస్ఎస్ ప్రేరణతో పనిచేస్తున్న 32 సంస్థలకు చెందిన సుమారు 327 మంది ప్రతినిధులు సమావేశానికి హాజరుకానున్నారు. ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ మోహన్ భాగవత్, సర్‌కార్యవాహ దత్తాత్రేయ హోసబలే తదితరులు పాల్గొంటారని తెలిపారు. సామాజిక సామరస్యం, పర్యావరణ పరిరక్షణ, కుటుంబ వ్యవస్థ, పౌర కర్తవ్యాలు వంటి ‘పంచ పరివర్తన్’ అంశాలపైనా చర్చిస్తామన్నారు. యువతలో ఆర్ఎస్ఎస్‌పై ఆసక్తి పెరుగుతోందని, ‘జాయిన్ ఆర్ఎస్ఎస్’ ద్వారా 2026లో నమోదు సంఖ్య గణనీయంగా పెరిగిందని తెలిపారు. విలేకరుల సమావేశంలో దూసి రామకృష్ణ, ప్రదీప్ జోషి, బయ్యా వాసు, వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

## అవంతి విద్యాసంస్థల వైస్ చైర్మన్ శివ నందీశ్ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు

విశాఖపట్నం, ఆగస్టు 18, ప్రభాతవార్త



అవంతి విద్యాసంస్థల వ్యవస్థాపకులు, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు తనయుడు, అవంతి విద్యాసంస్థల వైస్ చైర్మన్ ముత్తంశెట్టి శివ నందీశ్, కనక శ్రావణి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. లిటిల్ హగ్స్ (తాళ్లవలస), బాబా ఆశ్రమం (నేరెళ్లవలస), అమ్మఒడి (మధురవాడ) తదితర ఆశ్రమాల్లో సేవా కార్యక్రమాలు చేపట్టారు. అలాగే నారాయణ సేవ ఆశ్రమంలోని గోవులకు ఒకరోజు నారాయణ సేవ నిర్వహించి, శ్రీ సాయినాథునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా ఆశ్రమ స్వామీజీ, ఆశ్రమవాసులు శివ నందీశ్, కనక శ్రావణి దంపతులకు శ్రీ సాయినాథుని ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ఆకాంక్షించారు. అవంతి కుటుంబ సభ్యులందరికీ అన్ని విధాలా శుభాలు కలగాలని ఆశీర్వదించారు.

## పద్మనాభం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలు

పద్మనాభం, ఆగస్టు 18, ప్రభాతవార్త



రాష్ట్ర ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు పద్మనాభం మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ మొదలైంది. ఈ మేరకు మంగళవారం ఎంపిడిఒ బి చిన్నారావు, ఈఒ ఆర్‌డి బి వి రమణ పంచాయతీ ఎన్నకల సంబంధించి ఇరవై రెండు పంచాయితీలలో 226 పోలింగ్ బూతులను, ఎంపిటీసీలు, జెడ్పీటీసీ ఎన్నికల సంబంధించిన నలభై మూడు పోలింగ్ బూతులను పరిశీలించారు. అలాగే ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఓటర్లను వేరుచేసే ప్రక్రియలో మండల అధికారులు నిమగ్నమై ఉన్నారు. స్థానిక ఎన్నికల సంబందించి అన్ని ఏర్పాట్లును సిద్దం చేసుకుంటున్నారు.

## కొండవాల ప్రాంతంలో ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం

ఆరిలోవ, ఆగస్టు 18, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం శాసనసభ్యులు వెలగపూడి రామకృష్ణ బాబు ఆదేశాల మేరకు వార్డు టిడిపి అధ్యక్షులు, వార్డ్ ఇంచార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో 12వ వార్డులో ఉన్నటువంటి కొండవాలు ప్రాంతం 53, 54, 57 బూత్ కమిటీలు కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనపై ఆయా బూత్ పరిధిలో ఉన్నటువంటి బూత్ కన్వీనర్లు, నాయకులు, కార్యకర్తలు కలిసి మంగళవారం ఇంటింటా తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం అందిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను ఇచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దేశ విదేశాలలో అనేక ఐటి కంపెనీలను విశాఖకు తీసుకురావడంతో రానున్న కాలంలో యువతకు పెద్ద ఎత్తున ఉద్యోగావకాశాలు వస్తాయని తెలియజేస్తూ కరపత్రాలను అందజేశారు. అనంతరం ఫోటో తీసి మై టిడిపి యాప్ నందు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జ్ గాడి సత్యం,జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఒమ్మి పోలరావు,బీసీ సెల్ అధ్యక్షులు పరదేశి ఆనంద్,బూత్ అధ్యక్షులు ఒమ్మి మోహన్, పామోటి జగదీష్, రాపర్తి గణపతి, సర్వసిద్ధి గోపి తదితరులు పాల్గొన్నారు.

## అమ్మా సేవా సంకల్ప ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాధిత పిల్లలకు మధ్యాహ్న భోజనం

గాజువాక,ఆగస్టు 18,ప్రభాతవార్త




మరణించిన తర్వాత కూడా నలుగురికి సేవ చేయాలనే ఆలోచన ప్రతి ఒక్కరిలో కలగాలని అమ్మా సేవా సంకల్ప ఫౌండేషన్ అధ్యక్షుడు బొత్స దిలీప్ పిలుపునిచ్చారు. బొత్స ఉమ మరణించి 29 నెలలు పూర్తయిన సందర్భంగా గాజువాకలోని డిజైర్ సొసైటీలో ఉన్న ఎయిడ్స్ బాధిత పిల్లలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ జ్ఞాపకార్థం గత 29 నెలలుగా విరామం లేకుండా 50కి పైగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. విద్య, ఆరోగ్యం, అన్నదానం, వస్త్రాదానంతో ముందుకు వెళ్తున్న తమ ఫౌండేషన్ ద్వారా మరికొందరు నిరాశ్రయులకు సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ వైజాగ్ డైమండ్స్ అధ్యక్షుడు కే. మారుతీ, జెసిఐ వైజాగ్ అచీవర్స్ అధ్యక్షురాలు శిరీష, మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్వి సోమశేఖర్, బొత్స దామోదర్, సొసైటీ మేనేజర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెదగదిలిలో మహా అన్న సంతర్పణ ..ముఖ్యఅతిథిగా బుడుమూరు గోవింద్

ఆరిలోవ, ఆగస్టు 18, ప్రభాతవార్త



తూర్పు నియోజకవర్గం పెద గదిలి గ్రామ ప్రజల ఆరాధ్య దైవం శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ 9వ వార్షికోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయ ధర్మకర్త పైడి రాజు, కమిటీ సభ్యులు ఆహ్వానం మేరకు 9వ వార్డు ఇంచార్జి, స్థానిక అంబేద్కర్ సేవా సంఘం అధ్యక్షులు బుడుమూరి గోవింద్ ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంగళవారం ఆలయ ప్రాంగణంలో ఆయన చేతుల మీదగా మహా అన్నసంతర్పణ కార్యక్రమం ప్రారంభించారు. వివిధ ప్రాంతాల నుండి భక్తులు, ప్రజలు అన్నదాన కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పిట్టా శంకర్రావు, నిశాంత్, రాయి అప్పాజీ, దువ్వి సంతోష్, సంపంగి బ్రదర్స్, రాయి నూకరాజు, హరి, అనుగుపల్లి శంకర్రావు, మిల్లు సోంబాబు తదితరులు పాల్గొన్నారు.

## యారాడ తోటలో పేకాట స్థావరంపై దాడి : 9 మంది అరెస్ట్

గాజువాక,ఆగస్టు 18,ప్రభాతవార్త



యారాడ ప్రాంతం ఓ తోటలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మెరుపు దాడి చేశారు. పక్కా సమాచారంతో నిఘా పెట్టిన పోలీసులు.. రహస్యంగా జూదం ఆడుతున్న తొమ్మిది మందిని రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల రాకను గమనించి దాడి సమయంలో మరికొందరు అక్కడ నుంచి పరారైనట్లు తెలిసింది. పట్టుబడిన నిందితులను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం న్యూపోర్ట్ పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన న్యూపోర్ట్ సీఐ, పరారైన వారి కోసం గాలిస్తూ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## భాజపా జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసిన కేఎన్ఆర్

గాజువాక,ఆగష్టు 18,ప్రభాతవార్త



విశాఖపట్నం వైజాగ్ కన్వెన్షన్‌లో నిర్వహించిన భాజపా రాష్ట్ర కార్యవర్గ విస్తృత స్థాయి సమావేశం లో పాల్గొన్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను రాష్ట్ర మీడియా ప్యానెలిస్ట్, గాజువాక ఇంచార్జ్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై, ప్రస్తుతం రాజ్యసభ సభ్యుడిగా, భాజపా జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నితిన్ నబీన్ ఆగస్టు 17న భోగాపురం విమానాశ్రయం ద్వారా తొలిసారి విశాఖ వచ్చారని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ నాయకత్వంలో వారికి ఘన స్వాగతం లభించిందన్నారు. మరుసటి రోజు సింహాచల అప్పన్న స్వామిని దర్శించుకున్న అనంతరం రాష్ట్ర కార్యవర్గ భేటీలో, అలాగే హోటల్ ఐటీసీ వెల్కమ్‌లో జరిగిన యువ మేధావుల సదస్సులో పాల్గొన్నారని పేర్కొన్నారు. బుధవారం నుంచి మరో మూడు రోజుల పాటు విశాఖలో జరిగే జాతీయ స్థాయి సదస్సులో ఆయన పాల్గొంటారని వెల్లడించారు.

## షీలానగర్ మానవ అవశేషాల గుట్టు విప్పిన పోలీసులు

గాజువాక ఆగష్టు 18,ప్రభాతవార్త

షీలానగర్ జంక్షన్ సమీపంలో లభ్యమైన మానవ అవశేషాల ఘటన వెనుక ఉన్న వాస్తవాలను గాజువాక పోలీసులు ఛేదించారు. సీసీ కెమెరాల పరిశీలనకు నాలుగు బృందాలు, నగరంలోని శ్మశాన వాటికలను తనిఖీ చేసేందుకు మరో నాలుగు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించినట్లు వెల్లడించారు. కంచరపాలెం బర్మా క్యాంప్‌లోని శ్మశాన వాటికలో జీవీఎంసీ ఆధ్వర్యంలో పదేళ్లకు ఒకసారి పాత మట్టిని తొలగించి కొత్త మట్టి వేస్తారని, ఆ ప్రక్రియలో భాగంగా నిన్న రాత్రి ఐదు డంపర్ల మట్టిని తరలించినట్లు గుర్తించారు. అందులోని ఒక డంపర్ మట్టిని షీలానగర్ వద్ద కుమ్మరించడం వల్లే ఈ అవశేషాలు బయటపడ్డాయని పోలీసులు స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఎలాంటి అపోహలు, వదంతులు నమ్మవద్దని, ప్రచారంలో ఉన్న అసత్య వార్తలను తోసిపుచ్చాలని ప్రజలకు, విలేకరులకు పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## గాజువాకలో మరో 20 పార్కుల మంజూరు...త్వరలో ప్రారంభం

### ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు

గాజువాక,ఆగష్టు 18,ప్రభాతవార్త



ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస రావు చొరవతో గాజువాక నియోజకవర్గానికి కొత్తగా 20 పార్కులు మంజూరయ్యాయి. వీటితో కలిపి నియోజక వర్గంలో త్వరలో శంకు స్థాపనకు సిద్ధంగా ఉన్న పార్కుల సంఖ్య 70కి చేరిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు తెలిపారు. మంగళవారం ఆ ప్రాంతాలను పరిశీలించిన మొల్లి పెంటిరాజు మాట్లాడుతూ 74వ వార్డు దయాల్ నగర్ కొండపై 8 ఎకరాల విస్తీర్ణంలో విఎంఆర్‌డి ఆధ్వర్యంలో రూ.20 కోట్ల వ్యయంతో భారీ పబ్లిక్ పార్కును నిర్మించ నున్నారు. విశాఖ కైలాసగిరి తరహాలో దీనిని తీర్చిదిద్దనున్నారు. పూర్వం ఈ ప్రాంతంలో ఏనుగులు సంచరించడం వల్ల ‘గజవాక’ అనే పేరు ఉండేదని, ఆ చారిత్రక నేపథ్యంతో ఈ పార్కుకు “గాజువాక - గజేంద్ర గిరి” లేదా “వైకుంఠ గిరి” అని పేరు పెట్టాలని యోచిస్తున్నారని తెలిపారు. పారిశ్రామిక ప్రాంత ప్రజలకు ఆహ్లాదాన్ని అందించడం, యువతను వ్యసనాలు, మొబైల్ ఫోన్లకు దూరంగా ఉంచి యోగా, వ్యాయామాల వైపు మళ్లించడమే ఈ పార్కుల అభివృద్ధి ముఖ్య ఉద్దేశమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రీనింగ్ అండ్ బ్యూటీఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్ మొల్లి పెంటిరాజు తెలిపారు. ఆయన వెంట 74వ వార్డు ఇన్చార్జ్ పల్లా రమణ, క్లస్టర్ ఇన్చార్జి దువ్వి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## 58వ వార్డ్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు ఘన సన్మానం

గాజువాక,ఆగష్టు 18 ప్రభాతవార్త



జివిఎంసి వెస్ట్ జోన్ 58వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి. రవికుమార్ కు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ‘ఉత్తమ శానిటరీ ఇన్‌స్పెక్టర్’ అవార్డు లభించింది. వార్డును మోడల్ వార్డుగా తీర్చిదిద్దేందుకు ఆయన చేస్తున్న కృషిని గుర్తించిన ఉన్నతాధికారులు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మంగళ వారం శ్రీహరిపురంలో మాజీ కార్పొరేటర్ శీరం ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో రవి కుమార్‌ను ఘనంగా సన్మానించారు. వార్డు పరిశుభ్రతలో ఆయన సేవలు అభినంద నీయమని ఉమామహేశ్వరి కొనియాడారు. సన్మాన గ్రహీత రవికుమార్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల అపరిమిత శ్రమ ఫలితంగానే ఈ గుర్తింపు వచ్చిందన్నారు. భవిష్యత్తులో కార్మికులను సమన్వయం చేసుకుంటూ 58వ వార్డును మరింత ఉత్తమంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు శానిటరీ సెక్రటరీలు, సూపర్‌వైజర్లు, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

LICHFL LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్
బ్యాక్ ఆఫీస్, 4వ అంతస్తు, ఉత్తర విభాగం, జీవన్ సమృద్ధి, న్యూ ఇన్వెస్ట్‌మెంట్ భవనం, ఎల్.ఐ.సి. ఎనెక్స్ భవనం, తిక్కన్న రోడ్డు, విశాఖపట్నం - 530004. ఫోన్ : 0891-2746480

నోటీసు రూలు 4(2A) of SARFAESI ACT
Housing Loan No.: 711500011094

To:
శ్రీ ఉద్దరాజు విజయవర్మ మరియు శ్రీమతి ఉద్దరాజు @ దండు అమిత, డి.నెం. 1-365/ఎ, ప్లాట్ నెం. 18 & 18ఎ, కో-ఆపరేటివ్ సొసైటీ లే అవుట్, విశాలాక్షి నగర్, విశాఖపట్నం. మరియొక చిరునామా: చిన అమిరం, భీమవరం, పశ్చిమగోదావరి జిల్లా.

మీకు ది. 18.03.2026న RPAD ద్వారా SARFAESI Act, Rule 4(2A) ప్రకారం ఆవరణ డి.నెం. 1-365/ఎ, ప్లాట్ నెం. 18 & 18ఎ, కో-ఆపరేటివ్ సొసైటీ లే అవుట్, విశాలాక్షి నగర్, విశాఖపట్నం ప్రాంగణము నుండి గృహోపకరణాలు తీసివేయమని నోటీసు పంపాము. తేది.30.03.2026న శ్రీ విజయవర్మ గారు స్వయముగా సదరు నోటీసును అందుకున్నా, నేటి వరకు గృహోపకరణాలు తీయలేదు. కావున పై తెలుపబడిన ఇంటి నుండి గృహోపకరణాలు ఈ నోటీసు ప్రచురించిన రోజు నుంచి 7 రోజులలోపు తీసివేయడంలో విఫలమైనచో LIC HFL వారు వాటిని అత్యధిక టెండరుదారునకు విక్రయించి వచ్చిన మొత్తాన్ని మీ ఖాతాలో జమచేయబడును.

తేది. : 18.08.2026
ప్రదేశం : విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి
LIC హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

# మాతృభాష పరిరక్షణకు విద్యావిధానంలో మార్పు చేయాలి

**గన్నవరం(కృష్ణా), ఆగస్టు 18, ప్రభాతవార్త :** భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన మన రాష్ట్రంలో తెలుగుభాషను పరిరక్షించేందుకు ప్రస్తుత విద్యావిధానంలో మార్పులు చేయాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ అభిప్రాయపడ్డారు. మంగళవారం అసెంబ్లీలో జీరో అవర్‌లో యార్లగడ్డ మాట్లాడుతూ మన రాష్ట్రంలో విద్యార్థులు తెలుగులో మాట్లాడుతున్నప్పటికీ తెలుగులో రాయలేకపోవటం బాధాకరమన్నారు. ఇంటర్ విద్యలో మార్కుల కోసం పరిగెత్తే క్రమంలో ఎక్కువ మంది విద్యార్థులు హిందీ, సంస్కృతంలను రెండవభాషగా ఎంచుకోవటం వల్ల తెలుగు భాష కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేసారు. గత విద్యాసంవత్సరం పదవ తరగతి పరీక్షా ఫలితాలు చూస్తే 37,679 మంది విద్యార్థులు తెలుగు పరీక్ష ఫెయిల్ అయ్యారని, ఆంగ్లంలో 8,771మంది, హిందీలో 1436మంది ఫెయిల్ అయ్యారని ఈగణాంకాలను పరిశీలిస్తే తెలుగు భాష పరిస్థితి అర్థం అవుతుందని ఆవేదన వ్యక్తం చేసారు. తెలుగుభాషను పాఠ్యాంశంగా కాకుండా విద్యార్థుల్లో భాష పట్ల ఆసక్తి కలిగేలా పాఠ్యాంశాలు రూపొందించాలని కోరారు. తెలుగులోనూ 99మార్కులు సాధించేలా ప్రశ్నపత్రాలు రూపకల్పన చేయాలని, తెలుగుభాష పరిరక్షణకు ఉపాధ్యాయులు, భాషా ప్రవీణులు, పండితులతో కమిటీ వేయాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో విద్యారంగంలో చేపడుతున్న సంస్కరణలు ప్రశంసనీయమన్నారు. తెలుగుభాష అభివృద్ధికి రూ.10కోట్లు కేటాయించటం పట్ల విద్యాశాఖామంత్రి లోకేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈఏడాది ప్రయివేటు పాఠశాలల నుండి లక్షమందికి పైగా విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరటం శుభపరిణామంగా యార్లగడ్డ పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ తరగతులు, ఏఐ ఆధారిత విద్య, డిజిటల్ బోధన వంటి ఆధునిక విధానాలను ప్రవేశపెట్టడం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపడుతున్నాయని వెంకట్రావ్ అభిప్రాయపడ్డారు.

# లారీలో పుష్ప సినిమా స్టైల్‌లో మద్యం స్మగ్లింగ్





లారీలో పట్టుబడిన మద్యాన్ని కింద ఉంచుతున్న దృశ్యం ♦ పట్టుబడిన మద్యాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

- గోవా నుంచి తాడిపత్రికి అక్రమ రవాణా
- లారీ క్యాబిన్‌లో ప్రత్యేక అర ఏర్పాటు చేసి స్మగ్లింగ్ చేసిన వైనం

**తాడిపత్రిఅర్బన్, ఆగస్టు 18 ప్రభాతవార్త** అనంతపురం జిల్లా తాడిపత్రిలో పుష్ప సినిమా స్టైల్‌లో మద్యం అక్రమ రవాణా చేస్తున్న లారీ పోలీసుల తనిఖీల్లో పట్టుబడింది. భారీగా గోవా మద్యం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. "పుష్ప" సినిమా తరహాలో లారీలో ప్రత్యేక బాక్స్ ఏర్పాటు చేసి గోవా నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యవహారాన్ని పోలీసులు గుట్టు రట్టు చేశారు. పోలీసులకు వచ్చిన సమాచారంతో తాడిపత్రి రైల్వే స్టేషన్ ఫ్లైఓవర్ వద్ద లారీని తనిఖీ చేయగా భారీగా మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. లారీ క్యాబిన్ వెనుక భాగంలో కింద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బాక్స్‌లో భారీగా మద్యం బాటిళ్లను తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. చాలా రోజుల నుంచి గోవా నుంచి తాడిపత్రికి అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. లారీకి రెండు నెంబర్ ప్లేట్లు ఉండటం కూడా పోలీసుల దృష్టికి వచ్చింది. ఒకటి కర్ణాటక రాష్ట్రానికి చెందిన నెంబర్ ప్లేట్ కాగా, మరొకటి ఏపి నెంబర్ ప్లేట్‌గా గుర్తించారు. పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు తాడిపత్రి పట్టణ సిఐ ఆరోహణరావు ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి లారీతో పాటు మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు నిందితుల వివరాలు, మద్యం రవాణా మార్గంపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఇంతకాలం నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకొని వచ్చి ఎవరికీ విక్రయిస్తున్నారన్న కోణంలో విచారణ చేస్తున్నారు.

# 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్'గా తిరుపతి

**అభివృద్ధి చేసేందుకు బృహత్తర ప్రణాళిక మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.750-800 కోట్లు**




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, తుడా చైర్మన్ డాలర్ దివాకర్ రెడ్డి

**తిరుపతి కలెక్టరేట్, ఆగస్టు 18 ప్రభాతవార్త :** తిరుపతి నగరాన్ని ఒక మహానగరంగా, సుందరమైన , వాతావరణ మార్పుల ప్రభావాలను తట్టుకునే నగరంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 'సిటీ ఆఫ్ ట్యాంక్స్' ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.మంగళవారం స్థానిక కలెక్టరేట్ లోని తిరుపతి పట్టణంలోని చెరువుల అనుసంధానం పై తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి, తుడా విసి మరియు జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ ఎం.జయకృష్ణ లతో కలసి జిల్లా కలెక్టర్ పాత్రికేయ సమావేశం ఏర్పాటు చేశారు. అసిస్టెంట్ కమిషనర్ శారదా దేవి, తుడా సెక్రెటరీ శ్రీకాంత్ బాబు, జర్మనీ ప్రతినిధులు రైనార్, నార్బర్ట్, కిరణ్, అర్చన గోస్వామి, ఇరిగేషన్ అధికారులు, తుడా అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టర్ మాట్లాడుతూ కె ఎఫ్ డబ్ల్యు జర్మనీ ప్రభుత్వ యాజమాన్యంలోని బ్యాంకు అని, భారతదేశంలో గత 55-60 సంవత్సరాలుగా వివిధ అభివృద్ధి, క్లైమేట్ రెసిలియంట్ ప్రాజెక్టులకు సహకరిస్తోందన్నారు. భారతదేశంలో కె ఎఫ్ డబ్ల్యుకు సుమారు రూ.16,000 కోట్లకు పైగా ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో ఉందన్నారు. తిరుపతిలో చేపట్టనున్న ఈ ప్రాజెక్టు కెఎఫ్ డబ్ల్యుతో కలిసి పరిశీలిస్తున్న తొలి ప్రధాన ప్రాజెక్టు అని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజన్‌కు అనుగుణంగా తిరుపతిని మహానగరంగా అభివృద్ధి చేయడంతో పాటు, నగరానికి ఉన్న చెరువులు, జల వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలనే లక్ష్యంతో తుడా ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్, ఇరిగేషన్ తదితర శాఖల సమన్వయంతో గత 6-8 నెలలుగా సమగ్ర అధ్యయనం జరుగుతోందన్నారు. ఈ క్రమంలో ఢిల్లీతో పాటు దక్షిణ కొరియాలో కూడా నీటి వనరుల నిర్వహణ, చెరువుల అభివృద్ధి, పట్టణ ప్రణాళికలపై అధ్యయనం చేసినట్లు తెలిపారు. గ్రేటర్ తిరుపతి పరిధిలోని సుమారు 34 చెరువులను గొలుసుకట్టు విధానంలో అనుసంధానం చేసి క్యాస్కేడ్ ట్యాంక్స్‌గా అభివృద్ధి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. చెరువుల బండ్లను పటిష్టంగా అభివృద్ధి చేయడంతో పాటు, నీటి వనరులకు ఎటువంటి నష్టం కలగకుండా అవసరమైన ప్రాంతాల్లో రిక్రియేషనల్, కమర్షియల్ స్పేస్‌లను ఏర్పాటు చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించనున్నట్లు చెప్పారు.

2021లో తిరుపతి నగరాన్ని తీవ్ర వరదలు ముంచెత్తిన పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని భవిష్యత్తులో అలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా ఫ్లడ్ మేనేజ్‌మెంట్ వ్యవస్థను ప్రాజెక్టులో భాగంగా రూపొందిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని చెరువులను పరస్పరం అనుసంధానం చేసి, అదనపు నీటిని అవసరమైన సందర్భాల్లో స్వర్ణముఖి నదికి మళ్లించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. నగర పరిధిలోని స్టార్మ్ వాటర్ డ్రైన్లను సమర్థవంతంగా నిర్వహించి, మురుగునీరు చెరువుల్లోకి చేరకుండా చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. మురుగునీటిని ప్రత్యేక వ్యవస్థ ద్వారా తరలించి, అవసరమైన ప్రాంతాల్లో ఎస్ టి పి లు ఏర్పాటు చేసి చెరువుల్లోకి స్వచ్ఛమైన నీరు మాత్రమే చేరేలా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. కెఎఫ్ డబ్ల్యు నుంచి సుమారు రూ.750-800 కోట్ల వరకు రుణ సహాయం పొందే దిశగా ప్రాథమిక చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రాజెక్టును దశలవారీగా అమలు చేయనున్నామని, తొలి దశలో సుమారు రూ.550 కోట్లతో పశ్చిమ ప్రాంతంలోని చెరువుల అనుసంధానం, వేస్ట్ వాటర్ మేనేజ్‌మెంట్, స్టార్మ్ వాటర్ మేనేజ్‌మెంట్, ఫ్లడ్ మిటిగేషన్ పనులను చేపట్టనున్నట్లు తెలిపారు. తొలి దశ పనులను సుమారు నాలుగు సంవత్సరాల్లో పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. ఇప్పటికే డిపిఆర్ తయారీ ప్రక్రియ ప్రారంభమైందని, బాహ్య రుణ సహాయం కావడంతో కేంద్ర ప్రభుత్వ అనుమతులు పొందాల్సి ఉంటుందని వివరించారు. డిపార్ట్మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్, గవర్నమెంట్ ఆఫ్ ఇండియా నుంచి అవసరమైన అనుమతులు పొందిన అనంతరం రుణ ప్రక్రియ ముందుకు సాగుతుందని తెలిపారు. ప్రాజెక్టు కోసం తీసుకునే రుణాన్ని తిరిగి చెల్లించేందుకు కూడా ముందస్తు ప్రణాళిక రూపొందిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. తుడా ఆధ్వర్యంలో ఇప్పటికే చేపడుతున్న ఆస్తుల మానిటైజేషన్‌తో పాటు, చెరువుల అభివృద్ధి అనంతరం ఏర్పడే కమర్షియల్, రిక్రియేషనల్ ఆదాయాలను వినియోగించి ప్రాజెక్టు నిర్వహణ, రుణ చెల్లింపులకు అవసరమైన ఆదాయాన్ని సమకూర్చే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు చెప్పారు. తిరుపతి వేగంగా అభివృద్ధి చెందుతున్న టైర్2 నగరాల్లో ఒకటని, భవిష్యత్తులో జనాభా, నివాస ప్రాంతాలు, వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరగనున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలు, భూగర్భ జలాల స్థాయిని పెంచడం అత్యంత కీలకమన్నారు. తిరుపతికి వచ్చే పర్యాటకులు, భక్తులు ప్రస్తుతం సగటున సుమారు 18 గంటలు మాత్రమే నగరంలో గడుపుతున్నారని, ఈ వ్యవస్థ ద్వారా వారికి ఆహ్లాదకరమైన పర్యాటక, వినోద ప్రదేశాలను అందుబాటులోకి తీసుకువచ్చి వారి బసను 48 నుంచి 72 గంటలకు పెంచేలా చర్యలు తీసుకోవచ్చని తెలిపారు. చెరువుల చుట్టూ పర్యాటక, వినోద సదుపాయాలు అభివృద్ధి చేయడం ద్వారా నగర సౌందర్యం పెరగడంతో పాటు స్థానికంగా ఆదాయ, ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని చెప్పారు.తుడా ఛైర్మన్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశాల మేరకు తిరుపతిని 'సిటీ ఆఫ్ లేక్స్ అండ్ ట్యాంక్స్'గా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో గత 6-8 నెలలుగా సమగ్రంగా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. మొదట 12 చెరువులను, అనంతరం 20 చెరువులను అనుసంధానం చేయాలని భావించినప్పటికీ, భవిష్యత్తులో గ్రేటర్ తిరుపతి విస్తరణను దృష్టిలో పెట్టుకుని ఒకేసారి 34 చెరువులను అనుసంధానం చేసేలా మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నట్లు తెలిపారు. నగరంలోని డ్రైనేజ్ నీరు చెరువుల్లోకి చేరకుండా ప్రత్యేకంగా మురుగునీటి నిర్వహణ వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎస్ టి పిల ద్వారా నీటి నాణ్యతను మెరుగుపరచనున్నట్లు చెప్పారు. ప్రాజెక్టు మొత్తం వ్యయం సుమారు రూ.750-800 కోట్ల వరకు ఉండవచ్చని తెలిపారు. పేరూరు చెరువు నుంచి అవిలాల చెరువుకు నీటి అనుసంధానానికి సంబంధించి సుమారు 5.6 కిలోమీటర్ల నుంచి 7 కిలోమీటర్ల వరకు కాలువ పనులకు టెండర్లు పిలిచినట్లు, అవిలాల చెరువు బండ్ అభివృద్ధికి సుమారు రూ.23 కోట్లతో పనులు చేపట్టే చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. అవిలాల, అనాసముద్రం తదితర చెరువులను భవిష్యత్ పర్యాటక, వినోద కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. అనాసముద్రం పరిసర ప్రాంతాల్లో భవిష్యత్తులో పెద్ద ఎత్తున నివాస ప్రాంతాలు అభివృద్ధి చెందనున్నందున, అక్కడి చెరువును టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే దిశగా మాస్టర్ ప్లాన్, డి పి ఆర్ సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. కపిలతీర్థం నుంచి వచ్చే నీటిని వృథా కాకుండా నిల్వ చేసి వినియోగించడంతో పాటు, మాల్వాడి గుండం నీటిని కూడా సమర్థవంతంగా వినియోగించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే మల్లిమడుగు డ్యామ్ నుంచి తాగునీటిని మంగళం పంప్‌హౌస్‌కు తీసుకువచ్చే అంశాన్ని కూడా ప్రణాళికలోపొందుపరిచామన్నారు. తిరుపతిని కేవలం ఆంధ్రప్రదేశ్‌లోనే కాకుండా దేశవ్యాప్తంగా ఒక కేస్ స్టడీగా నిలిచే ఆదర్శ నగరంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమని తెలిపారు. కె ఎఫ్ డబ్ల్యు ప్రతినిధి రైనర్ మాట్లాడుతూ, తిరుపతిలో క్లైమేట్ రెసిలియంట్ ప్రాజెక్టుకు సంభావ్య భాగస్వామ్యాన్ని పరిశీలించేందుకు జర్మన్ ప్రభుత్వం తరపున తమ బృందం పర్యటిస్తున్నట్లు తెలిపారు. భారతదేశంతో కె ఎఫ్ డబ్ల్యుకు సుదీర్ఘ భాగస్వామ్యం ఉందని, అర్బన్ డెవలప్‌మెంట్ రంగంలో భారతదేశవ్యాప్తంగా సుమారు రూ.16,000 కోట్ల ప్రాజెక్టుల పోర్ట్‌ఫోలియో ఉందన్నారు. తిరుపతిలో పరిశీలిస్తున్న ప్రాజెక్టు తమకు ముఖ్యమైనదని తెలిపారు. రెండు రోజుల క్షేత్రస్థాయి పరిశీలనలో ప్రాజెక్టు యొక్క విస్తృత ప్రయోజనాలను గమనించామని, ఇది క్లైమేట్ రెసిలియన్స్‌తో పాటు అర్బన్ డెవలప్‌మెంట్ లక్ష్యాలకు అనుగుణంగా ఉందన్నారు. ప్రాజెక్టు తదుపరి దశలో అవసరమైన హైడ్రాలజికల్ స్టడీస్, సాంకేతిక అధ్యయనాలు, డి పి ఆర్ అభివృద్ధికు కె ఎఫ్ డబ్ల్యు సహకరిస్తుందని తెలిపారు. అనంతరం కొన్ని నెలల్లో అప్రైజల్ మిషన్ తిరిగి వచ్చి ప్రాజెక్టు పరిమాణం, రుణ అవసరాలపై తదుపరి నిర్ణయాలు తీసుకుంటుందని చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, తుడ చైర్మన్ లు కెఎఫ్ డబ్ల్యు బృందం, ఐ సి ఎల్ ఈ ఐ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.

# క్రెడిట్ అవుట్‌రీచ్‌తో ప్రజలకు మరింత విస్తృతంగా రుణాలు

- నరసరావుపేట తరహాలో జిల్లాలోనూ క్రెడిట్ అవుట్‌రీచ్ నిర్వహణకు సన్నద్ధం కావాలి

**నెల్లూరు, ఆగస్టు 18, ప్రభతవార్త -** కలెక్టరేట్ ఇటీవల పల్నాడు జిల్లా నరసరావుపేటలో విజయవంతంగా నిర్వహించిన క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమం తరహాలో నెల్లూరు జిల్లాలోనూ కార్యక్రమాన్ని నిర్వహించి, ఎక్కువ మంది ప్రజలకురుణాలు అందించేలా బ్యాంకర్లు ప్రణాళికాబద్ధంగా సన్నద్ధం కావాలని నెల్లూరు పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమితి, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేటలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో రూ.3 వేల కోట్ల రుణాలను ప్రజల అవసరాలకు అందించి, విద్య, ఉపాధి అవకాశాలు, వ్యాపారాభివృద్ధికి తోడ్పాటునందించినట్లు గుర్తుచేశారు. ఇదే తరహాలో జిల్లాలో క్రెడిట్ అవుట్ రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు, అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. బ్యాంకులు కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా ప్రజల ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమాజంలో మంచి పాత్ర పోషించాలని సూచించారు. - రూ.4 వేల కోట్ల రుణాల లక్ష్యంతో క్రెడిట్ అవుట్ రీచ్: కలెక్టర్.. జిల్లాలో రూ.4 వేల కోట్ల రుణాలను ప్రజల అవసరాలకు అందించేలా క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల తెలిపారు. ఇందుకు స్టేట్ లెవల్ బ్యాంకర్ల సమితి సహకారం తీసుకుంటామని చెప్పారు. వ్యవసాయ యాంత్రీకరణను ప్రోత్సహించేలా వ్యవసాయ అనుబంధ రంగాలకు ఎక్కువ రుణాలు మంజూరు చేసేలా బ్యాంకర్లు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. హార్వెస్టర్లు, ట్రాక్టర్లు, డ్రోన్లు, బేలర్ల వంటి అత్యాధునిక వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను ప్రోత్సహించాలని అన్నారు. ప్రజలతో బ్యాంకర్లు మంచి సంబంధాలను కలిగి ఉండాలని కలెక్టర్ సూచించారు. ఒక్కో బ్యాంకు ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసుకుని ప్రజలకు మరింత చేరువయ్యేలా తమ కార్యకలాపాలను కొనసాగిస్తే, ఈ అనుబంధం జీవితాంతం కొనసాగుతుందని చెప్పారు.

# పోలంపల్లి మునేటి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని అసెంబ్లీలో ఎమ్మెల్యే రాజగోపాల్ వేడుకోలు



అసెంబ్లీలో ప్రసంగిస్తున్న జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్

**జగ్గయ్యపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట అసెంబ్లీ పరిధిలోని వత్సవాయి మండలం పోలంపల్లి మునేటి ప్రాజెక్టుకు నిధులు ఇవ్వాలని తెలుగుదేశం పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) శాసనసభ సమావేశంలో కోరారు. మంగళవారం సభలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన తప్పిదాల కారణంగా సరైన డిజైన్ లేకుండా నిర్మించటం వలన డ్యామ్ దిగువున గల 26 గ్రామాల రైతులకు సాగునీరు అందటంలేదని విచారం వ్యక్తంచేశారు. రైతు కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చొరవ తీసుకుని ప్రాజెక్టు డిజైన్‌ను సమూలంగా మార్పులుచేసి సంబంధిత అన్ని శాఖల ద్వారా అవసరమైన సాంకేతిక అనుమతులను పొందివున్నట్లు తేటతెల్లంచేశారు. ప్రస్తుతం నిధుల విడుదల చేయటం ఒక్కటే మిగిలిందని, రైతుల వెతలను గుర్తించి వారికి న్యాయం చెయ్యాలని ఆయన కోరారు. ఇటీవల జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సమావేశం ఆర్థిక సమస్యలు, పరిష్కారాల విషయం, అధిక ప్రాధాన్యత కలిగిలిన అంశాల్లో ఈప్రాజెక్టు ప్రస్తావన కూడా వచ్చిందని గుర్తుచేశారు.

# వినికిడి లోపం ఉన్న విద్యార్థులకు బాపట్లలో ప్రత్యేక డిగ్రీ కాలేజ్

**విజయవాడ, ఆగస్టు 18, ప్రభాతవార్త:** వినికిడి లోపం ఉన్న విద్యార్థినీవిద్యార్థుల ఉన్నత విద్య కోసం బాపట్లజిల్లా వెదుళ్ళపల్లిలో ప్రత్యేక ప్రభుత్వ డిగ్రీకళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పరిపాలనా అనుమతులు మంజూరు చేసినట్లు విభిన్న ప్రతిభావంతులు, ట్రాన్స్‌జెండర్, వయోవృద్ధుల సంక్షేమశాఖ డైరెక్టర్ యం.వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. మహిళలు, శిశువులు, విభిన్నప్రతిభావంతులు మరియు వయోవృద్ధుల సంక్షేమశాఖ జి.ఓ.యం.ఎస్.నం16 ద్వారా నూతన కళాశాల ఏర్పాటుకు అనుమతి లభించినట్లు చెప్పారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించిన ప్రతిష్టాత్మక ఇంద్రధనుస్సు దివ్యాంగుల సమగ్ర అభివృద్ధి కార్యక్రమం కింద ఈకళాశాల ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు.

# మాదకద్రవ్యాల అరికట్టేందుకు అందరూ ముందుకు రావాలి

**విజయవాడ, ఆగస్టు 18, ప్రభాతవార్త :** సమాజానికి పెనుముప్పుగా మారిన మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ వంతు కృషిచేయాలని ఆర్‌అండ్‌బి ఇంజనీర్ ఇన్‌ఛీఫ్ వి.రామచంద్ర పిలుపునిచ్చారు. కేంద్రసామాజిక న్యాయం సాధికారత మంత్రిత్వశాఖ చేపట్టిన ' నశాముక్త్ భారత్ అభియాన్ ' కార్యక్రమంలో భాగంగా ఆర్‌అండ్‌బిశాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలో మాదకద్రవ్యాల వ్యతిరేక ర్యాలీ నిర్వహించారు. ఈర్యాలీని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద రామచంద్ర జెండా ఊపి ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించటం ద్వారా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టవచ్చున్నారు. యువత, విద్యార్థులు మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఛీఫ్ ఇంజనీర్ కే.నవీన్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిమాణాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈర్యాలీ చేపట్టినట్లు చెప్పారు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుండి బెంజ్‌సర్కిల్ మీదుగా ఆర్‌అండ్‌బి శాఖ హెచ్ఓడి భవనం వరకు ర్యాలీనిర్వహించారు. ఈకార్యక్రమంలో సూపరింటిండెంట్ ఇంజనీర్ జి.వి.భాస్కరరావు, ఈఈ రవిశంకర్, డిఈఈ వై.శశిభూషణ్ తదితరులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రియుడి చేతిలో మహిళ దారుణ హత్య

**- గత ఐదు సంవత్సరాలుగా సహజీవనం**

**కావలి (నెల్లూరు), ఆగస్టు 18, ప్రభాతవార్త :** గత ఐదు సంవత్సరాలుగా సహజీవనం చేస్తూ మనస్పర్థలు కారణంగా ప్రియుడు మహిళను హత్య చేసిన సంఘటన కావలి వెంగళరావు నగర్ లోని వంటేరు వరదరెడ్డి పార్కు వద్ద మంగళవారం జరిగింది. సంఘటన ప్రదేశాన్ని కావలి టూ టౌన్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ గిరిబాబు వారి సిబ్బందితో పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు జలదంకి కి చెందిన ఉప్పు సునీత (35) శీను తో గత 15 సంవత్సరాల క్రితం వివాహం జరిగిందన్నారు. వీరు హైదరాబాదులో బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారన్నారు. వీరికి ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారని వీరు కొన్ని కారణాల వలన విడిపోయి వేరువేరుగా ఉంటున్నారన్నారు. ఈ క్రమంలో కొండాపురం మండలం, కొత్తపేట గ్రామానికి చెందిన మల్లి మహేంద్ర తో సునీతకు పరిచయం ఏర్పడిందన్నారు. మహేంద్ర కు కూడా వివాహమై ఇద్దరు పిల్లలు ఉండి భార్యకు దూరంగా ఉంటున్నారన్నారు. సునీత, మహేంద్రలు గత ఐదు సంవత్సరాలుగా జలదంకి తదితర ప్రాంతాలలో సహజీవనం చేస్తూ ఐదు నెలల క్రితం సునీత పిల్లల చదువుల కొరకు కావలి వెంగళరావునగర్ లోని వంటేరు వరదారెడ్డి మున్సిపల్ పార్కు వద్ద అద్దెకు ఇల్లు తీసుకొని ఉంటున్నారన్నారు. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని భార్యా భర్త కలిసి ఉండేందుకు ఇటీవల కౌన్సిలింగ్ కూడా నిర్వహించడం జరిగిందన్నారు. మల్లి మహేంద్ర ఇటీవల బేల్దారి పనులకు హైదరాబాదుకు వెళ్లడం జరిగిందన్నారు. భార్యాభర్తలు రెండవ కౌన్సిలింగ్లో పూర్తిగా కలవనున్న క్రమంలో సునీత మల్లి మహేంద్ర ఫోన్ నెంబర్‌ని బ్లాక్ లో పెట్టడం జరిగిందన్నారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం మల్లి మహేంద్ర కావలిలోని సునీత ఉంటున్న నివాసానికి వెళ్లి సునీతను నిలదీయడం జరిగిందన్నారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య జరిగిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయడం జరిగిందన్నారు. ఈ ఘర్షణలో మహేంద్ర స్క్రూ డ్రైవర్‌తో సునీతను విచక్షణ రహితంగా పొడిచి గాయపరిచి దాడి చేయడం జరిగిందన్నారు.

# ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వండి కలెక్టర్

**విజయవాడ, ఆగస్టు 18, ప్రభాతవార్త :** తీవ్రవర్షాభావ పరిస్థితులు వేధిస్తున్న ప్రస్తుత తరుణంలో ఎన్‌టిఆర్‌జిల్లాలో రైతులు ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. మైలవరం మండలం మొర్సుమిల్లిలో మంగళవారం పోలం పిలుస్తుంది కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈసందర్భంగా అపరాల సాగును పరిశీలించారు. అనంతరం ఆయన రైతులతో మాట్లాడుతూ ఎల్‌నినో కారణంగా నీటిఎద్దడి ఏర్పడిందని, ఈతరుణంలో ఆరుతడి పంటలు సాగుచేస్తూ అందుబాటులో ఉన్న నీటివనరులను పొదుపుగా వినియోగించాలని సూచించారు.

# గుంటూరులో వైద్య విద్యార్థుల గర్జన

**గుంటూరు మెడికల్,ఆగస్టు 18(ప్రభాతవార్త )** జూనియర్ వైద్యుల రాష్ట్రవ్యాప్త సమ్మె తొమ్మిదో రోజుకు చేరుకుంది. మూడో దశ రెండో రోజు ఆందోళనలో భాగంగా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో జూనియర్ వైద్యులు నిరసన కార్యక్రమాలు కొనసాగించారు. గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల పరిధిలోని ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో జూనియర్ వైద్యులు ఉదయం సూపరింటెండెంట్ కార్యాలయం వద్ద సమావేశమై రిలే నిరాహార దీక్షను కొనసాగించారు. అనంతరం ఉదయం 10.30 గంటల సమయంలో సుమారు 500 మంది ఇంటర్న్ వైద్యులు, పీజీ వైద్యులు, సూపర్ స్పెషాలిటీ పీజీ వైద్యులు, సీనియర్ రెసిడెంట్ వైద్యులు శాంతియుత పాదయాత్ర నిర్వహించారు. ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి అత్యవసర విభాగం ద్వారం నుంచి ప్రారంభమైన పాదయాత్ర ఎంటీపీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్, జిల్లా కలెక్టర్ కార్యాలయం, గుంటూరు ప్రభుత్వ వైద్య కళాశాల మీదుగా తిరిగి ప్రభుత్వ సాధారణ ఆసుపత్రికి చేరుకుంది. తఈ సందర్భంగా జూనియర్ వైద్యులు తమ న్యాయ బద్ధమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు.పాదయాత్రలో భాగంగా ఎంటీపీ సర్కిల్, మూడుబొమ్మల సెంటర్ వద్ద జూనియర్ వైద్యులు మానవహారాలు ఏర్పాటు చేశారు. శాంతియుతంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలు, డిమాండ్లపై ప్రజల దృష్టిని ఆకర్షించారు.

# ఎపికి దేశంలో 2వ స్థానం: మంత్రి నారా లోకేష్

- కేవలం 24 నెలల్లోనే 9వ స్థానం నుంచి రెండో ర్యాంకుకు చేరిన రాష్ట్రం

**విజయవాడ.,ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రపంచ పెట్టుబడిదారుల దృష్టి ఇప్పుడు ఏపీపై ఉందని వ్యాఖ్య నూతన పెట్టుబడులను ఆకర్షించడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో స్థానానికి చేరుకుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తెలిపారు. కేవలం 24 నెలల వ్యవధిలోనే రాష్ట్రం 9వ స్థానం నుంచి 2వ స్థానానికి ఎగబాకిందని ఆయన వెల్లడించారు. ఈ ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనిక నాయకత్వం వల్లే సాధ్యమైందని లోకేశ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్, పారదర్శక పాలన, వ్యాపార నిర్వహణలో వేగం (స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) వంటి అంశాలే ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ప్రగతికి మూలస్తంభాలుగా నిలుస్తున్నాయి" అని వివరించారు. రాష్ట్రం వేగంగా పారిశ్రామిక శక్తిగా ఎదుగుతుండటం గర్వకారణమని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సానుకూల వాతావరణంతో ప్రపంచవ్యాప్తంగా పెట్టుబడిదారులు ఆంధ్రప్రదేశ్ వైపు చూస్తున్నారని లోకేశ్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఫలితాలను అందిస్తుండటంతో, ఇప్పుడు ప్రపంచం చూపు ఏపీ వైపు ఉందని ఆయన వ్యాఖ్యానించారు.

## జెండా మోసిన బిసి అన్నలకు రాజకీయ అధికారం

# కూటమి ప్రభుత్వ చరిత్రాత్మక నిర్ణయం

- స్థానిక సంస్థల్లో బిసిలకు 34 శాతం రిజర్వేషన్లు బిసిలు ఓటు బ్యాంకు కాదు టిడిపి, కూటమి ప్రభుత్వానికి వెన్నెముక..

**విజయవాడ, ఆగస్టు 18,ప్రభాతవార్తప్రతినిధి:** సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించే దిశగా రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయం బీసీల రాజకీయ సాధికారతలో చారిత్రాత్మక అడుగు అని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ కీలక నిర్ణయం తీసుకోవడంలో తాను కూడా భాగస్వామిని కావడం ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని తెలిపారు... బీసీలు కేవలం ఓటు బ్యాంకు కాదు... తెలుగుదేశం పార్టీకి, కూటమికి మొదటి నుంచి వెన్నెముక. పార్టీ కష్టకాలంలోనూ జెండాను వదలకుండా, ఎండనక-వాననక గడపగడపకూ తిరిగి పార్టీని ప్రజల్లో నిలబెట్టిన బీసీ కార్యకర్తలకు రాజకీయంగా సముచిత గౌరవం, అవకాశాలు కల్పించాలన్నదే మా ప్రభుత్వ సంకల్పం" అని పేర్కొన్నారు. నిన్నటి వరకు పార్టీ కోసం జెండా మోసిన సామాన్య బీసీ కార్యకర్త... రేపు అదే గ్రామంలో సర్పంచ్‌గా, ఎంపీటీసీగా, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధిగా ప్రజలకు నాయకత్వం వహించాలి. బీసీలకు అవకాశాలు కల్పించడమే కాదు... వారిని అధికారంలో భాగస్వాములను చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు గారి లక్ష్యం" అని అనిత తెలిపారు.స్థానిక సంస్థల్లో ప్రస్తుతం ఉన్న 24.15 శాతం బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచుతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసే దిశగా ప్రభుత్వం ముందడుగు వేయడం, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే కూటమి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు.తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచే బీసీల రాజకీయ ఎదుగుదలకు పెద్దపీట వేసిందని, స్వర్గీయ ఎన్టీఆర్ బీసీలకు రాజకీయ గుర్తింపు, అవకాశాలు కల్పిస్తే... అదే స్ఫూర్తితో సీఎం చంద్రబాబు బీసీలను నాయకత్వ స్థానాల్లో నిలబెడుతున్నారని పేర్కొన్నారు. బీసీల సంక్షేమం అంటే కేవలం పథకాలు, ఆర్థిక సహాయం మాత్రమే కాదు. రాజకీయంగా నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో వారిని కూర్చోబెట్టడమే నిజమైన సాధికారత. జెండా మోసిన చేతులకే అధికార బాధ్యతలు అప్పగించే ఈ చారిత్రాత్మక నిర్ణయంలో మంత్రివర్గ సహచరురాలిగా భాగస్వామిని కావడం నాకు ఎంతో సంతోషాన్ని ఇచ్చింది" అని హోంమంత్రి అనిత అన్నారు. బీసీల ఆత్మగౌరవాన్ని మరింత పెంచే ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌తో పాటు మంత్రివర్గ సహచరులకు హోంమంత్రి వంగలపూడి అనిత ధన్యవాదాలు తెలిపారు.

## బెజవాడ ఫ్లోటర్స్ స్పోర్ట్స్‌క్లబ్ ఈతల పోటీలలో

# జగ్గయ్యపేట స్విమ్మర్ల విజయభేరి



**జగ్గయ్యపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :** బెజవాడ ఫ్లోటర్స్ స్పోర్ట్స్‌క్లబ్ నిర్వహించిన ఈతల పోటీలలో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ ప్రదర్శించి పతకాల పంట పండించారు. పోటీల్లో మొత్తం 21 మంది పాల్గొని 27 పతకాలు సొంతం చేసుకున్నారు. 7 స్వర్ణాలు, 6 రజితాలు, 14 కాంస్య పతకాలతో విజయభేరి మోగించారు. ఈపోటీల్లో ఆరు సంవత్సరాల నుండి 50 సంవత్సరాల వయసుగల వారికి వారి వయసుల వారీగా ఫ్రీ-స్టైల్ 25, 50 మీటర్లు, బ్యాక్-స్ట్రోక్ 25 మీ.ల పోటీల్లో పాల్గొన్న జగ్గయ్యపేట స్విమ్మర్లు అందరూ పలు కేటగిరుల్లో పతకాలు సాధించినట్లు జగ్గయ్యపేట డ్రీమర్స్ స్విమ్మర్స్ అసోసియేషన్ యువకోచ్ పొట్టాబత్తిన సందీప్ మీడియాకు తెలిపారు. ఇరువురు పురుషులు, ఏడుగురు బాలికలు, 12 మంది బాలురు ఈపోటీల్లో పాల్గొన్నట్లు చెప్పారు. విజేతలు వీరే : జగ్గయ్యపేట ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ ఆళ్ళ హరీష్, నేత్ర వైద్యులు సామినేని దీపక్ కుమార్, బాలలు సామినేని కీర్తిక, గజేంద్రన్ సంజనాదేవిశ్రీ, అక్కిమళ్ళ యస్మిక ఆనంది, వేపమేరి ప్రణీత, వేపమేరి హేమాన్షి, అడ్డగొట్టం అర్షి, ఆళ్ళ ధ్వని, గంజిబోయిన పార్థో అభిమన్యు, వర్తినేని చేతన్‌శ్రీసాయి, మేక పూజన్ సాయి, కాసరెల్లి అశ్విన్, పోతురాజు జీవన్‌సాయి ప్రవీణ్, జుత్తు మహిధర్, సోమివెట్టి మోక్షనివాస్, ఈద నిఖిల్ త్రిలోక్‌రాజ్, గజేంద్రన్‌జైకార్తీక్, దార్ల శ్యామ్ విహాన్, అక్కిమళ్ళ తన్విష్, ఉపొత్తుల కార్తీక్‌సూర్య విజేతలుగా నిలిచినట్లు వివరించారు. కాగా విజేతలను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, కెడిసిసి బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురామ్, మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, డిఎస్‌పి మోటపోతుల కిషోర్‌బాబు, డిఎస్‌ఏ కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి, కుర్రా శ్రీనివాస్, కూరపాటి సరితాదేవి, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ, పలువురు స్విమ్మర్లు విజేతలను అభినందించారు.

## కలెక్టర్ ఆదేశాలకు అనుగుణంగానే
# 71 సెంట్ల భూమి సేల్ డీడ్ జరిగిందా?
### - సమగ్ర విచారణ జరపాలి : ప్రజాసంఘాల డిమాండ్




వీరఘట్టం, ఆగస్టు 18, ప్రభాతవార్త :

వీరఘట్టం గ్రామ పరిధిలోని వివిధ సర్వే నెం బర్లలో ఉన్న మొత్తం 71 సెంట్ల భూమికి సంబం ధించి జరిగిన సేల్ డీడ్ కలెక్టర్ ప్రొసిడింగ్స్‌కు అనుగుణంగా జరిగిందా, లేదా, అనే అంశంపై సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో డిమాండ్ చేశారు. ఈ మేరకు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎన్.సింహాచలం, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర మాట్లాడుతూ 1975లో అప్పటి శ్రీకాకుళం జిల్లా కార్యాలయం నుండి డి.డిస్.నెం.14073/74 పేరుతో జారీ చేసిన కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అందుబాటులో ఉన్న వివరాల ప్రకారం, వీరఘట్టం పంచాయతీ సమితి స్థాయి సంఘం, సాధారణ సమావేశ తీర్మానం, బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నివేదిక, తహసీల్దార్ నివేదిక తదితర రికార్డుల ఆధారంగా సర్వే నంబర్ 417/2 – 14 సెంట్లు, సర్వే నంబర్ 419/2 – 32 సెంట్లు, సర్వే నంబర్ 401/6 – 25 సెంట్లు, మొత్తం 71 సెంట్ల భూమిని డాక్టర్ కె.అమృతం, ఎంబీబీఎస్ వారికి సెల్ఫ్ ఎంప్లాయిమెంట్ స్కీం ప్రైవేట్ ఆసుపత్రి స్థాపన కోసం విక్రయించేందుకు అనుమతి మంజూరు చేసినట్లు తెలుస్తోందన్నారు. అయితే, ఈ కలెక్టర్ ప్రొసీడింగ్స్ ఆధారంగా పంచాయతీ సమితి ద్వారా కొప్పర అమృతంకు భూమిపై పూర్తి హక్కులు బదలాయిస్తూ సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ జరిగినట్లు ఉన్న పత్రాలను పరిశీలిస్తే, కలెక్టర్ ప్రొసీడింగ్స్‌లో పేర్కొన్న ఉద్దేశ్యం మరియు రిజిస్టర్ అయిన సేల్ డీడ్ మధ్య వ్యత్యాసాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు తెలిపారు. ప్రత్యేకంగా, కలెక్టర్ ప్రొసీడింగ్స్‌లో డి.డిస్.నెం.14073/74గా ఉండగా, సేల్ డీడ్‌లో డి.డిస్.నెం.14033/74గా నమోదు కావడం గమనించాల్సిన అంశమని వారు అన్నారు. అదేవిధంగా, కలెక్టర్ అనుమతిలో ప్రైవేట్ ఆసుపత్రి స్థాపన కోసం భూమి విక్రయించేందుకు అనుమతి ఇచ్చినట్లు పేర్కొనబడినప్పటికీ, సేల్ డీడ్‌లో ఆసుపత్రి నిర్మాణానికి సంబంధించిన ఉద్దేశం, షరతులు లేదా పరిమితులు స్పష్టంగా పొందుపరిచారా అనే విషయాన్ని కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అందువల్ల కింది అంశాలపై అధికారులు సమగ్ర విచారణ జరపాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. 1975లో జారీ చేసిన అసలు కలెక్టర్ ప్రొసీడింగ్స్‌ను పరిశీలించాలి. డి.డిస్.నెం.14073/74 మరియు డి.డిస్.నెం.14033/74 రెండూ ఒకటే వ్యవహారానికి సంబంధించినవా, లేక వేర్వేరు ప్రొసీడింగ్స్‌సా అనేది నిర్ధారించాలి. పంచాయతీ సమితికి 71 సెంట్ల భూమిని విక్రయించి పూర్తి హక్కులు బదలాయించే అధికారం అప్పట్లో చట్టపరంగా ఉందా లేదా అదే అంశాన్ని పరిశీలించాలి. కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్న నిబంధనలు, షరతులు ఏమిటో స్పష్టంగా నిర్ధారించాలన్నారు. పంచాయతీ సమితి తీర్మానాలు, సాధారణ సమావేశ తీర్మానం, బి డి ఓ నివేదిక, తహసీల్దార్ నివేదిక తదితర అసలు రికార్డులను పరిశీలించాలన్నారు. కలెక్టర్ అనుమతి ఏ ప్రయోజనం కోసం ఇచ్చారు. సేల్ డీడ్ అదే ప్రయోజనానికి అనుగుణంగా జరిగిందా లేదా పరిశీలించాలి. భూమి బదలాయింపులో కలెక్టర్ అనుమతి పరిధిని మించి ఏదైనా చర్య జరిగిందా అనేది నిర్ధారించాలన్నారు. విచారణలో కలెక్టర్ ప్రొసీడింగ్స్‌కు విరుద్ధంగా లేదా అనుమతి పరిధిని మించి సేల్ డీడ్ జరిగినట్లు నిర్ధారణ అయితే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకుని సేల్ డీడ్‌ను రద్దు చేసే ప్రక్రియ చేపట్టి, ప్రభుత్వ భూమి హక్కులను పరిరక్షించి, భూమిని ప్రజా ప్రయోజనాల కోసం వినియోగించాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేశాయి. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులకు సంబంధించిన రికార్డులపై పూర్తి పారదర్శకతతో విచారణ జరిపి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఎన్.ప్రసాద్, వై.ప్రసాదు, కే.సన్యాసినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## వీడీవీకే కేంద్రాలకు యంత్రాల సరఫరాలో నాణ్యత తప్పనిసరి



సీతంపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :

వీడీవీకే కేంద్రాలకు సరఫరా చేసే యంత్ర పరికరాలు నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలని ఐటీడీఏ పీవో పవార్ స్వప్నిల్ స్పష్టం చేశారు. మంగళవారం సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో వీడీవీకే కేంద్రాలకు అవసరమయ్యే వివిధ రకాల యంత్ర పరికరాల కొనుగోలు కోసం టెండర్ల ప్రక్రియ నిర్వహించారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా పరికరాలను సరఫరా చేసే టెండర్ దారులను బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. వీడీవీకే కేంద్రాల ద్వారా గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించడం, స్థానికంగా లభించే అటవీ, వ్యవసాయ ఉత్పత్తులకు విలువ జోడించి ఆదాయం పెంచే ఉద్దేశంతో అవసరమైన యంత్ర పరికరాలను సమకూర్చేందుకు ఈ టెండర్లను నిర్వహించారు. కార్యక్రమంలో డీడీ అన్నదొర, పీహెచఓ వెంకట గణేష్, ఏవో సునీల్, ఐటీఐ ప్రిన్సిపాల్ గోపాలకృష్ణ, డీపీఎం ఆర్.వి.రమణ, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా నాయకులకు మతి భ్రమించింది
### రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్



ఆమదాలవలస, ఆగస్టు 18, ప్రభాతవార్త:

వైకాపా నాయకులకు మతిభ్రమించిందని రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒక మహిళ ఎస్సైపై దాడి చేసి జైలుకి వెళ్లి వచ్చిన తర్వాత నియోజకవర్గ ఇన్‌చార్జి చింతాడ రవికుమార్‌కు మతిభ్రమించిందని విద్యాసాగర్ అన్నారు. రోజుకు ఒక మాట మాట్లాడి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. గతంలో వైకాపా ఇన్‌చార్జ్ చింతాడ రవికుమార్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు రాష్ట్ర మంత్రి నారా లోకేష్ దగ్గర, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దగ్గర విలువ లేదని పలు పర్యములు ప్రెస్ మీట్‌లు పెట్టి చెప్పారని, జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కూన రవికుమార్ మాపై తప్పుడు కేసులు పెట్టించారని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. ఒక మహిళ ఎస్సైపై దురుసుగా ప్రవర్తించి దాడి చేసినందుకు ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మీపై కేసులు నమోదు చేశారని, అంతే తప్ప ఇందులో ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఏమిటి సంబంధమని ప్రశ్నించారు. నీవే చెప్పావు కదా ప్రెస్‌మీట్‌లు పెట్టి ఎమ్మెల్యే రవికుమార్‌కి అంత పలుకుబడి లేదు అలాంటప్పుడు ఈ కేసులు ఎమ్మెల్యే రవికుమార్ పెట్టించారని అని చెప్పడం మీ అవివేకానికి నిదర్శనం అన్నారు. ఎమ్మెల్యే రవికుమార్ చేస్తున్న ఇసుక, భూ దందాలను అడిగినందుకే నాపై తప్పుడు కేసులు పెట్టారని అనడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా వైకాపా నాయకులు లేనిపోని ఆరోపణలు మానుకోవాలని హితవు పలికారు. గత వైకాపా హయాంలో నియోజవర్గం అభివృద్ధిలో కుంటి పడిందని, నేడు టిడిపి 27 నెలలలో అభివృద్ధిని ఎమ్మెల్యే కూన రవికుమార్ పరుగులు పెట్టిస్తున్నారన్నారు. ఏమైనా తప్పులు జరిగితే ప్రజల తరుపున పోరాటాలు చేసి ప్రజలు మనసు గెలుచుకోవాలే తప్ప, టిడిపి చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక ఎమ్మెల్యే రవికుమార్ పై టిడిపి నాయకులపై బురద జల్లడం మానుకోవాలని తమ్మినేని విద్యాసాగర్ అన్నారు. రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంపదరావు మురళీధర్, నాగళ్ళ మురళీధర్, కింజరాపు శివ, బగాది భాస్కరరావు, బోయిన బాలకృష్ణ, బోనెల అప్పారావు, తంగి గురయ్య, తదితరులు పాల్గొన్నారు.

## మోడల్ స్కూల్‌లో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు

ఇచ్ఛాపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

పురుషోత్తపురం ఏ పి మోడల్ స్కూల్ కాలేజీలో అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ దుప్పల వైకుంఠరావు చెప్పారు. ఇంగ్లీష్ ఎకనామిక్స్ సబ్జెక్టులు భోదించుటకు గెస్ట్ ఫ్యాకల్టీ కింద నియమిస్తున్నట్లు చెప్పారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో బీఈడీ అర్హత ఉండాలని కోరారు. ఈ నెల 21 లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 12 వేల రూపాయలు గౌరవ వేతనం ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకి 9177458429 నెంబర్‌కి సంప్రదించాలని కోరారు.

## తహశీల్దార్‌కి అభినందనలు



ఇచ్ఛాపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:

ఉత్తమ తహసీల్దార్‌గా అవార్డు పొందిన వెంకటరావుని తెలుగుదేశం నాయకులు అభినందించారు. మండల అధ్యక్షుడు లోపింటి పద్మనాభం రాష్ట్ర నాటక పరిషత్ డైరెక్టర్ కామేశ్వరరావు, సాడి సహదేవ్ రెడ్డి, పెదిని బాబ్జి, దూపాన సూర్యనారాయణ, దుర్యోధన, లోహిదాస్, తదితరులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంతోనే మెరుగైన అభివృద్ధి : తమ్మినేని

ఆమదాలవలస, ఆగస్టు 18, ప్రభాతవార్త :



కూటమి ప్రభుత్వ పరిపాలనతో ప్రజలకు మెరుగైన పాలన అందుతుందని రాష్ట్ర టిడిపి లీగల్ సెల్ కార్యదర్శి తమ్మినేని విద్యాసాగర్ తెలిపారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధి 13వ వార్డులో కూటమి ప్రభుత్వ పాలనపై ఇంటింటా ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వ పరిపాలన రెండేళ్లు పూర్తి కావడంతో ప్రజలకు అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధిపై లబ్ధిదారులకు వివరించారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. పింఛన్ల పెంపుతో మొదలై ఉచితంగా గ్యాస్ సిలిండర్లు, అన్నదాత సుఖీభవ, తల్లికి వందనం, స్త్రీ శక్తి పథకం, తదితర సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు అందించడం జరుగుతుందని తెలియజేశారు. అవినీతి రహిత పాలన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తూ, సంక్షేమ పథకాల సొమ్ములను నేరుగా బ్యాంక్ ఖాతాలకు జమ చేస్తున్నట్లు తెలియజేశారు. వార్డులో ఎటువంటి సమస్య ఉన్న స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ సహకారంతో పరిష్కరించడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో బాగాది రమణమూర్తి, గొల్లపల్లి వేణు, దుంపల ఉదయ్ కుమార్ పలువురు నాయకుల పాల్గొన్నారు.

## ఎల్‌నినోపై రైతులకు అవగాహన

కంచిలి, ఆగస్టు 18, ప్రభాతవార్త :

రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ఎల్‌నినో నివారణ కార్యాచరణ ప్రణాళికపై మకరాపురం రైతు సేవా కేంద్రం పరిధి చంద్రుపుట్టుగ గ్రామంలో రైతులతో వ్యవసాయ అధికారులు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల వ్యవసాయ అధికారి కొంకేన సురేష్ మాట్లాడుతూ, వర్షాభావ పరిస్థితుల వలన వరి పంటకు అనుకూలమైన వాతావరణం లేనందున రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి పెట్టాలని సూచించారు. రాగులు, కందులు, ఇతర అపరాలు మరియు కాయగూరల వంటి పంటలను సాగు చేయడం వల్ల నీటి కొరత ఉన్నా మంచి దిగుబడి పాటు లాభాలు కూడా వస్తుందని వివరించారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా విత్తన గుళికలు, ప్రి-మాన్సూన్ డ్రై సోయింగ్ విధానాల గురించి రైతులకు వివరించారు. పంటలపై విచక్షణారహితంగా పురుగు మందులు, తెగులు మందులు, కలుపు మందులు వాడకుండా సరైన సమయంలో సరైన మోతాదులో మాత్రమే వాడాలని సూచించారు. కార్యక్రమం అనంతరం ప్రి-మాన్సూన్ డ్రై సోయింగ్ వేసిన పంట పొలాన్ని అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఐసీఆర్‌పీలు, గ్రామ ఉద్యాన సహాయకురాలు శాంతమ్మ , రైతులు పాల్గొన్నారు.

## మకరాంపురం ఎన్‌హెచ్-16 సర్వీస్ రోడ్డు అధ్వానం



కంచిలి, ఆగస్టు 18, ప్రభాతవార్త :

మండలం మకరాంపురం ఆదివారం సంత, ఎన్‌హెచ్-16 వద్ద సర్వీస్ రోడ్డు పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. సుమారు 50కి పైగా ప్రమాదాలు జరిగినా ఎన్‌హెచ్ అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చుట్టుపక్కల గ్రామస్తుల రాకపోకలు, స్కూల్ పిల్లలు, ఆదివారం సంతకు వచ్చే జనసందోహం ఎక్కువగా ఉండటంతో ప్రమాదాలు నిత్యం జరుగుతున్నాయి. రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. సర్వీస్ రోడ్డు బురదమయం కావడం పెద్ద పెద్ద గోతులు ఏర్పడడం, వర్షం పడితే వాహనాలు గోతుల్లో కూరుకుపోతున్నాయి. దీనిపై స్పందించిన మకరాంపురం గ్రామ శిరిడి సాయి ఆలయ ధర్మకర్త రమణ సాయి తన సొంత ఖర్చుతో కొంత మేర మరమ్మత్తు చేయించినా శాశ్వత పరిష్కారం లేదు. ఇప్పటికైనా ఎన్‌హెచ్ అధికారులు స్పందించి రోడ్డును గ్రావెల్ వేసి శుభ్రం చేయాలని, స్ట్రీట్ లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## సీతయ్య ఫౌండేషన్‌కు 14 బియ్యం ప్యాకెట్లు విరాళం

కంచిలి, ఆగస్టు 18, ప్రభాతవార్త :



ఇచ్ఛాపురం మండలం ఇన్నీసుపేట గ్రామ దేవత శ్రీ దుర్గామాత ఆలయ కమిటీ సభ్యులు దుంగ భాస్కరరావు, గాయత్రి దంపతులు, కమిటీ సభ్యులు కంచిలి మండలం మండపల్లిలోని సీతయ్య ఫౌండేషన్ వానప్రస్థ ఆశ్రమానికి విచ్చేశారు. ఆశ్రమంలో ఆశ్రయం పొందుతున్న అనాథలు, ఏ దిక్కులేని వృద్ధులకు నిత్యాన్నదానం నిమిత్తం 14 బియ్యం బస్తాలను తమ స్వహస్తాలతో అందజేశారు. ఈ సందర్భంగా సీతయ్య ఫౌండేషన్ వ్యవస్థాపకులు గుల్ల రమేష్, గుల్ల మోహనరావు మాట్లాడుతూ ఇన్నీసుపేట ప్రజలు ముఖ్యంగా యువత చూపిస్తున్న దాతృత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఇలాంటి సహాయం ఆశ్రమంలోని వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

## ఆపదలో ఉన్న కుటుంబానికి 'ఇప్పిలి' ఆర్థిక సహాయం



కంచిలి, ఆగస్టు 18, ప్రభాతవార్త :

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే నిజమైన మానవత్వం అని నిరూపిస్తూ బూరగాం గ్రామానికి చెందిన దూపాన మాధవరావుకు జెడ్పీటీసీ ఇప్పిలి లోలాక్షి, మాజీ ఎంపీపీ ఇప్పిలి కృష్ణారావు ఆర్థిక సహాయం అందించారు. గత కొంతకాలంగా మాధవరావు బోన్ మారో వ్యాధితో బాధపడుతూ వైద్య చికిత్స పొందుతున్నారు. వారి కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న ఇప్పిలి కృష్ణారావు మానవతా దృక్పథంతో స్పందించి వైద్య ఖర్చుల కోసం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ 'కష్టాల్లో ఉన్న కుటుంబానికి చేయూతనివ్వడం, బాధలో ఉన్న మనిషికి భరోసా కల్పించడమే నిజమైన ప్రజాసేవ' అని అన్నారు. ప్రజల కోసం, ప్రజల మధ్య, ప్రజల కష్టాల్లో అండగా నిలిచే ఇప్పిలి కృష్ణారావు గ్రామంలో అందరిచేత ప్రశంసలు అందుకున్నారు.

## బెంతు ఒరియా విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వాల్సిందే
### ఓఎస్‌డి ఆకుల రమణను కోరిన విప్ అశోక్

కవిటి, ఆగస్టు 18, ప్రభాతవార్త :



ఆర్థిక, సామాజిక, విద్యాపరంగా వెనుకబడి ఉన్న బెంతు ఒరియా విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వాల్సిందిగా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను ప్రభుత్వ విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ కోరారు. అనంతరం ఆయన సలహా మేరకు నారా లోకేష్ ఓఎస్‌డి ఆకుల రమణను కలిసి బెంతు ఒరియాల సమస్యలను ఆయన దృష్టిలో పెట్టారు. ప్రస్తుతం బెంతుఒరియా విద్యార్థులకు ఉన్నత చదువులు చదువుకోవడానికి ఆర్థిక లేమి ఆటంకంగా మారింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వము సంబంధిత శాఖ ఈ విద్యార్థులకు ఫీజు రియంబర్స్‌మెంట్ అందిస్తే వారు ఉన్నత చదువులు సకాలంలో పూర్తి చేస్తారని రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. ఇందుకు వారంతా సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

## నాయీ బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడిగా 'కుప్పిలి'

కోటబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త :



జిల్లా నాయి బ్రాహ్మణ సంఘం అధ్యక్షునిగా కుప్పిలి వెంకట్రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నూతనంగా ఎన్నుకోబడ్డ ఆ సంఘం ఉపాధ్యక్షుడు, కోటబొమ్మాళికి చెందిన పట్నాన భాస్కరరావు తెలిపారు. శ్రీకాకుళం పట్టణ నాయి బ్రాహ్మణ సేవా సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నిక జిల్లా ముఖ్య అతిథులు డాక్టర్ ఆర్. అరవింద్, దొంతికుర్తి త్రినాధరావు మాస్టారు ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లాలో ఉండేటువంటి అన్ని మండలాల నాయి బ్రాహ్మణ ప్రెసిడెంట్లు మరియు ఇతర ప్రతినిధులు తో సంప్రదించిన అనంతరం కుప్పిలి వెంకటరావుని జిల్లా అధ్యక్షులుగా, ఉపాధ్యక్షులుగా పట్నాన భాస్కర్ రావుని ప్రధాన కార్యదర్శిగా, కూర్మాపు కృష్ణ ప్రసాద్ సహాయ అధ్యక్షులుగా కుప్పిలి ఈశ్వరరావు, సహాయ కార్యదర్శిగా ఏలూరు రాంబాబు, కోశాధికారిగా జమ్మూ రవికుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. వీరితోపాటు అధికార ప్రతినిధులుగా జమ్మూ గంగులు , అమలాపురం మధు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగర నాయి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు కుప్పిలి నాగరాజు, ప్రధాన కార్యదర్శి గోరింట శ్రీను, గౌరవ అధ్యక్షులు గజపతిరావు, అరసవిల్లి పాలకమండలి ట్రస్ట్ సభ్యులు చెవిటిపల్లి కొండలరావు, సింహాచలం, హరికృష్ణ , జిల్లాలో ఉండేటువంటి వివిధ హోదాలో నగర నాయి బ్రాహ్మణ సోదరులు పాల్గొన్నారు.

## 458 పశువులకు ముద్ద చర్మవ్యాధి నివారణ టీకాలు

కోటబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త :



మండలంలో గల పట్టుపురం, మణినాగేశ్వరపురం, నీలంపేట, జగన్నాథపురం, కూర్మనాధపురం గ్రామాలలో మంగళవారం 458 పశువులకు ఉచితంగా ముద్దచర్మ వ్యాధి (లంపీస్కిన్ వ్యాధి) నివారణ టీకాలు వేయటం జరిగిందని పశువైద్యాధికారి డాక్టర్ ఎమ్. ప్రజ్ఞచైతన్య తెలిపారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పశువులకు ఎక్కువగా ఈ వ్యాధి బారిన పడే అవకాశం ఉన్నందున నివారణ కోసం ప్రతి పాడి రైతు తమ పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని ఆమె సూచించారు. మండలానికి 10వేలు డోసులు వేయటం లక్ష్యం కాగా ఇప్పటి వరకు మండలంలో 5817 టీకాలు వేయటం జరిగిందని ఆమె తెలిపారు. పశువైద్య సిబ్బంది బి.రాంబాబు, సిహెచ్.రాంబాబు, బాలమ్మ, ఫణీంద్ర, భాస్కరరావు, రామకృష్ణ ,తదితరులు పాల్గొన్నారు.

## పోలాండ్‌లో కే.జీ.వలస వాసి మృతి



సంతబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త :

సంతబొమ్మాళి మండలం కాపుగోదాయవలస గ్రామానికి చెందిన బచ్చల రాంబాబు ఇతర దేశమైన పోలాండ్ లో కూలి పనుల నిమిత్తం వెళ్లి మృతి చెందారు. 10 నెలల క్రితం ఆ దేశం వెళ్లి పనులు చేస్తున్న సమయంలో అనారోగ్యానికి గురయ్యారని చికిత్స పొందుతూ మృతి చెందారని భార్య లావణ్య మంగళవారం తెలిపారు. తను పనులు చేస్తుంటేనే మా కుటుంబం జీవనం సాగి వెళ్తుండేదని భార్య లావణ్య బోరున విలపించారు. కుటుంబంతో పాటు గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. చిన్న కుమార్తె చరిష్మా కడుపులో ఉన్న సమయంలో వెళ్ళిపోయారని కనీసం చిన్న కుమార్తె ముఖం చూడలేని పరిస్థితుల్లో పరలోకాలకు వెళ్లారంటూ కన్నీరు మున్నీరుగా విలపించారు. భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# శ్రీకాకుళం వార్త



## వర్షాలు కురవాలంటూ పాలపోలమ్మ తల్లికి పూజలు



సంతబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త :

వర్షాలు కురవాలంటూ మంగళవారం సంతబొమ్మాళి మండలం బోరుభద్ర గ్రామంలో వెలసి ఉన్న శ్రీ పాలపోలమ్మ తల్లికి గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ముర్రాటలు సమర్పించారు. గత కొద్ది నెలల నుంచి సరైన వర్షాలు కురవకపోవడం, తీవ్రమైన ఎండలు కాస్తుండడంతో వరి ఎదలు ఎండిపోతున్న పరిస్థితులు దాపురించాయి. దీంతో గ్రామస్తులందరూ శ్రీ పాలపోలమ్మ తల్లిని వేడుకుంటూ బిందెలతో ఘటాభిషేకం నిర్వహించారు. అమ్మవారికి చల్లదనం చేస్తే అంత మంచే జరుగుతుందని అంటూ ముందుగా విశేష పూజలు చేశారు. ఆలయం పూజారులు భాగ్యనాయుడు పూర్ణచంద్రరావు రామచంద్రరావులు అమ్మవారి దండకాలు చదువుతూ శుభం చేకూర్చాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలి
### నందిగాం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన ఎస్పీ

శ్రీకాకుళం, ఆగస్టు 18, ప్రభాతవార్త :



నందిగాం పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను, పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను, ముఖ్యమైన కేసుల దర్యాప్తు పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ క్రమంలో స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో జిల్లా ఎస్పీ స్వయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులతో పోలీసులు మర్యాదపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సానుభూతితో విని, చట్టపరమైన పరిష్కారం చూపేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని పరిశీలించిన ఎస్పీ, ముఖ్యమైన కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేసి, ఆధారాలను పకడ్బందీగా సేకరించి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించేలా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలు అందించే అంశాలపై సిబ్బందికి జిల్లా ఎస్పీ పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ వెంట ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ టి.ఇమ్మాన్యుయల్ రాజు ఉన్నారు.

## కురుడు వసతి గృహ సంక్షేమాధికారి సస్పెన్షన్

కోటబొమ్మాళి, ఆగస్టు 18 ప్రభాతవార్త :

విద్యార్థి తోటి విద్యార్థులతో ఆటకు వెళ్ళి తిరిగి వసతిగృహంకు రాకపోవడంతో అటు తల్లిదండ్రులకు, బంధువులకు, ఇటు పోలీసులకు ఎలాంటి పిర్యాదు చేయకుండా అజాగ్రత్తగా ఉండడంతో బాలుడి మృతికి బాధ్యుల్ని చేస్తూ మండలం కురుడు బిసి వసతి గృహ సంక్షేమాధికారి కె.లక్ష్మణరావును జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం రాత్రి సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అదే వసతి గృహ వాచ్‌మెన్ వి.అప్పన్నను పూర్తిగా విధుల నుంచి తొలగిస్తున్నట్లు బీసీ సంక్షేమాధికారి ఇ.అనూరాధ తెలిపారు. కాగా విచారణలో వసతి గృహ వార్డెన్, వాచ్‌మెన్ నిర్లక్ష్యంగా వ్యవహరించాలని తేలటంతో వార్డెన్‌ను సస్పెండ్, వాచ్‌మెన్‌ను పూర్తిగా విధుల నుంచి తొలగించటం జరిగిందని, ప్రస్తుతం నిమ్మాడ వసతి గృహ వార్డెన్ శివప్రసాద్‌ను ఇన్‌చార్జ్‌గా నియమించటం జరిగిందని ఏడీసీడబ్ల్యూ త్రినాధరావు మంగళవారం తెలిపారు.

## పాఠశాలకు కలర్ ప్రింటర్ వితరణ

కోటబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త:



కోటబొమ్మాళి మండలం కిష్టుపురం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు దేశభక్తి గీతాలు ఆలపించి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యార్థులను అభినందించారు. ఆ సందర్భంగా విద్యార్థుల విద్యా అవసరాలను దృష్టిలో ఉంచుకుని గ్రామానికి చెందిన పాగోటి ముత్తురాజు మాట ఇవ్వడం జరిగింది. ఈ రోజు పాఠశాలకు ఎప్సన్ కలర్ ప్రింటర్‌ను విరాళంగా అందజేశారు. ఈ ప్రింటర్ ద్వారా విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, ప్రాజెక్టులు, వర్క్‌షీట్లు, ధ్రువపత్రాలు తదితరాలను సులభంగా సిద్ధం చేసుకునే అవకాశం కలుగుతుందని ఉపాధ్యాయులు తెలిపారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన దాత పాగోటి ముత్తురాజును పాఠశాల కమిటీ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. విద్యాభివృద్ధికి సమాజం సహకరించడం అభినందనీయమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## జాతీయ స్థాయిలో సత్తా చాటిన తిలారు విద్యార్థిని



కోటబొమ్మాళి, ఆగస్టు 18, ప్రభాతవార్త:

తిలారు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని కొనపల చరిష్మా జాతీయ స్థాయి ఎనఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్) ఉపకార వేతనానికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎస్. చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. ఈ స్కాలర్‌షిప్ ద్వారా చరిష్మాకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రతి ఏడాది రూ.12 వేల చొప్పున ఉపకార వేతనం అందనుంది. పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థినిని ఘనంగా అభినందించి, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. చరిష్మా తల్లిదండ్రులు గోవిందరావు, నాగమణి చేనేత వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. సాధారణ కుటుంబానికి చెందిన తమ కుమార్తె జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచి ఉపకార వేతనానికి ఎంపిక కావడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. పట్టుదలతో చదివితే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా జాతీయ స్థాయిలో విజయాలు సాధించగలరని చరిష్మా నిరూపించిందని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

## శ్రీకాకుళంలో ఎంపీ కప్-2026 చెస్ ఛాంపియన్‌షిప్

శ్రీకాకుళం, ఆగస్టు 18 ప్రభాతవార్త :




యువతలో, చిన్నారుల్లో మేధోశక్తి, ఏకాగ్రత, వ్యూహాత్మక ఆలోచనా విధానాన్ని పెంపొందించే లక్ష్యంతో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచనల మేరకు ఎంపీ కప్ 2026 చెస్ చాంపియన్షిప్ పోటీలను నిర్వహించనున్నట్టు ఎర్రన్న క్రీడా ఉత్సవం నిర్వాహకులు తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను పత్రికా ప్రకటన ద్వారా వెల్లడించారు. ఈ చెస్ ఛాంపియన్‌షిప్ ఆగస్టు 22, 23 తేదీల్లో శ్రీకాకుళంలోని ఎన్టీఆర్ భవన్ తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఆవరణలో జరగనుంది. పోటీలను అండర్-10, అండర్-15, ఓపెన్ విభాగాల్లో పురుషులు, స్త్రీలకు వేరు వేరుగా నిర్వహించనున్నారు. చిన్నారులు, యువ చెస్ క్రీడాకారులు, అనుభవజ్ఞులైన క్రీడాకారులు ఈ పోటీల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు ఆకర్షణీయమైన నగదు బహుమతులు అందించనున్నారు. చెస్ క్రీడపై ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. పోటీల్లో పాల్గొనేందుకు పోస్టర్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని లేదా ఎర్రన్న క్రీడా ఉత్సవం వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

## క్రీడలతోనే శారీరక దృఢత్వం, క్రమశిక్షణ : డిఎస్పీ




శ్రీకాకుళం (క్రీడలు), ఆగస్టు 18, ప్రభాతవార్త :

యువత దురాలవాట్లకు దూరంగా ఉంటూ శారీరక దృఢత్వం, సమాజంలో ఉన్నతమైన క్రమశిక్షణను అలవర్చుకోవడానికి క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని శ్రీకాకుళం డీఎస్పీ సిహెచ్ వివేకానంద స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 21, 22, 23 తేదీలలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న 'రాష్ట్రస్థాయి టైక్వాండో ఛాంపియన్‌షిప్-2026' పోటీల గోడ పత్రికను మంగళవారం ఆయన తన కార్యాలయంలో లాంఛనంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో టైక్వాండో అసోసియేషన్ ఆఫ్ శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ ప్రధాన కార్యదర్శి కొమర భాస్కరరావుతో పాటు పలువురు అసోసియేషన్ ప్రతినిధులు, పోలీసు అధికారులు, క్రీడా బృందం సభ్యులు పాల్గొన్నారు.

19-08pg8.qxdo/p:19-08pg8.qxd 1/1/02 7:27 AM Page 1





### ప్రపంచ ఛాంపియన్‌షిప్..

# ఆయుష్ సంచలనం

### వరల్డ్ నంబర్ 1 షి యు కీ ఓటమి

**న్యూఢిల్లీ:** బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో, భారత ఆటగాడు ఆయుష్ శెట్టి అద్భుతమైన సంచలనం సృష్టించాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో జరిగిన ఉత్కంఠభరితమైన పోరులో, అతను డిఫెండింగ్ ఛాంపియన్, ప్రపంచ నంబర్ 1 అయిన చైనాకు చెందిన షి యు క్విని 21-14, 13-21, 21-19 తేడాతో ఓడించాడు. నాలుగు మ్యాచ్‌ల తర్వాత షీపై శెట్టికి ఇదే తొలి విజయం. శెట్టి ఆత్మవిశ్వాసంతో మ్యాచ్‌ను ప్రారంభించి, 3-0 ఆధిక్యాన్ని సాధించి, తొలి గేమ్ విరామ సమయానికి 11-5 ఆధిక్యాన్ని నిలబెట్టుకున్నాడు. విరామం తర్వాత కూడా ర్యాలీలపై తన ఆధిపత్యాన్ని కొనసాగించి, తొలి గేమ్‌ను 21-14 తేడాతో ముగించాడు. రెండో గేమ్‌లో షి పుంజుకుని 3-1 ఆధిక్యంలోకి వెళ్లగా, శెట్టి పోరాడి స్కోరును 4-4తో సమం చేశాడు. ఆ తర్వాత పోరు హోరాహోరీగా సాగగా, ఆధిక్యం పదేపదే చేతులు మారింది. శెట్టి 7-7తో స్కోరును సమం చేసి, కొద్దిసేపు ఆధిక్యంలోకి వెళ్లినప్పటికీ, షి 11-9 ఆధిక్యంతో విరామ సమయానికి వెళ్లాడు. అగ్రశ్రేణి ఆటగాడు తన ఆధిక్యాన్ని మరింత పటిష్టం చేసుకుని, ఐదు పాయింట్ల ఆధిక్యాన్ని సంపాదించాడు. కొన్ని వైడ్ షాట్‌ల వల్ల శెట్టి పాయింట్లు సాధించినప్పటికీ, రెండవ గేమ్‌ను 21-13 తేడాతో గెలిచి నిర్ణయాత్మక గేమ్‌కు దారితీశాడు. ఆఖరి గేమ్‌లో శెట్టి మళ్లీ ఆధిక్యం సాధించాడు. హోరాహోరీగా ప్రారంభమైనప్పటికీ, అతను 6-3, ఆపై 9-4 ఆధిక్యంతో దూసుకుపోయి, విరామ సమయానికి 11-5 ఆధిక్యాన్ని సాధించాడు. చివరి నిమిషాల్లో షి నాలుగు మ్యాచ్ పాయింట్లను కాపాడుకున్నప్పటికీ, శెట్టి సంయమనం కోల్పోకుండా తర్వాతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తన కెరీర్‌లోని అతిపెద్ద విజయాలలో ఒకటి పూర్తి చేసుకున్నాడు.



# జూనియర్ మహిళల హాకీ.. క్వార్టర్ ఫైనల్స్‌కు చండీగఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్

**న్యూఢిల్లీ:** పూల్ మ్యాచ్‌ల చివరి రోజున విజయాలు సాధించిన చండీగఢ్, ఒడిశా, మధ్యప్రదేశ్, మణిపూర్ హాకీ జటున జూనియర్ మహిళల జాతీయ ఛాంపియన్‌షిప్ 2026 క్వార్టర్ ఫైనల్స్‌లో తమ స్థానాలను ఖరారు చేసుకున్నాయి. మంగళవారం పూల్ ఎ లో చండీగఢ్ జట్టు పంజాబ్‌ను 3 -1 తేడాతో ఓడించి టోర్నమెంట్‌లో తమ తొలి విజయాన్ని నమోదు చేసుకుంది. చండీగఢ్ తరఫున దీక్ష (33వ నిమిషం), రవీనా (34), ప్రియా చౌహాన్ (46) గోల్స్ చేయగా, పంజాబ్ తరఫున జైస్మీన్ కౌర్ 40వ నిమిషంలో ఒక గోల్ చేసింది. పూల్ బిలో ఒడిశా బెంగాల్‌పై 6-0 తేడాతో ఘన విజయం సాధించింది. ద్రుపతి నాయక్ రెండు గోల్స్ (10వ, 47వ నిమిషాల్లో) చేయగా, అజిత ఎక్కా (29), ఎక్కా సోనాలి (30), బినాటి మింజ్ (44), భోలి డోలి (49) కూడా గోల్స్ సాధించారు. పూల్ డిలో మధ్యప్రదేశ్ హిమాచల్‌ను 6-0 తేడాతో ఓడించి ఆరు పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. మధ్యప్రదేశ్ తరఫున తన్వి (12), కాజల్ (19, 26, 52), మితాలి శర్మ (58), కుద్రత్ (59) గోల్స్ చేశారు. పూల్ సి లో మణిపూర్ మహారాష్ట్రను 3-2 తేడాతో ఓడించింది. ఈ మ్యాచ్‌లో సల్లు పుఖ్రంబం హ్యాట్రిక్ (21, 43, 47వ నిముషాల్లో) పూర్తి చేశాడు. దీనికి ప్రతిగా మహారాష్ట్ర తరఫున రూబీ రాథోర్ (49), తనిష్క షిండే (53) గోల్స్ చేశారు.

# 288 రన్స్‌ఆధిక్యంతో.. శ్రీలంకపై గెలుపు దిశగా భారత్

**న్యూఢిల్లీ:** శ్రీలంకతో తొలి టెస్ట్‌లో టీమిండియా విజయం ముంగిట నిలిచింది. కానీ వరుణుడిపైనే భారత్ విజయవకాశాలు ఆధారపడి ఉన్నాయి. బుధవారం ఆఖరి రోజు ఆటలో వరుణుడు రెండు సెషన్ల పాటు అంతరాయం కలిగించకపోతే భారత్ విజయం లాంఛనం కానుంది. 372 పరుగుల భారీ లక్ష్య ఛేదన కోసం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన శ్రీలంక నాలుగో రోజు మంగళవారం ఆట ముగిసే సమయానికి 34 ఓవర్లలో 4 వికెట్లకు 84 పరుగులు చేసింది. క్రీజులో ధనంజయ డిసిల్వా(31 నాటౌట్), సొనాల్ దినుషా(25 నాటౌట్) ఉన్నారు. భారత బౌలర్లలో మానవ్ సుతార్ రెండు, మహమ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ తలో వికెట్ తీసారు. భారత్ విజయానికి 6 వికెట్లు కావాల్సి ఉండగా, శ్రీలంక ఇంకా 288 పరుగులు చేయాల్సి ఉంది. అంతకుముందు భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 48.5 ఓవర్లలో 193 పరుగులకు ఆలౌటైంది. రిషభ్ పంత్(66) హాఫ్ సెంచరీతో సత్తా చాటగా, దేవదత్ పడిక్కల్(44) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. శ్రీలంక బౌలర్లలో అసితా ఫెర్నాండో(4/31) నాలుగు, ప్రబాత్ జయసూర్య(3/43) మూడు, కేశర నువాంత ఒక వికెట్, లాహిరు కుమార్ 2 వికెట్లు పడగొట్టారు. భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 178 పరుగల భారీ ఆధిక్యం సాధించడంతో శ్రీలంక ముందు 372 పరుగుల భారీ లక్ష్యం నమోదైంది.





నాలుగో రోజు ఆటలో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన టీమిండియా యశస్వి జైస్వాల్ మూడో బంతికే డకౌట్ కాగా, కేఎల్ రాహుల్(35), దేవదత్ పడిక్కల్(44) పరుగులు చేశారు. రాహుల్‌ను ప్రభాత్ జయసూర్య ఔట్ చేయగా పడిక్కల్(44)ను కేశర నువంత పెవిలియన్ చేర్చాడు. రెండో సెషన్ ఆరంభంలోనే ధ్రువ్ జురెల్ ఔటైనా, రవీంద్ర జడేజాతో(9) రిషభ్ పంత్ దూకుడుగా ఆడాడు. ఈ క్రమంలో 53 బంతుల్లో రిషభ్ పంత్ హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. శతకం దిశగా సాగిన పంత్(66)ను లాహిరు కుమార ఔట్ చేశాడు. పంత్ వికెట్ తర్వాత భారత ఇన్నింగ్స్ పేకమేడలా కుప్పకూలింది. ఆఖరి సెషన్‌లో భారత్ నిప్పులు చెరగడంతో శ్రీలంక 47 పరుగులకే 4 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. మరో వికెట్ పడకుండా నాలుగో రోజు ఆటను ముగించారు.





# నేడే పాకిస్థాన్‌తో భారత్ కీలక పోరు

### గెలవకుంటే టోర్నీ నుండి నిష్క్రమణ

**న్యూఢిల్లీ:** పురుషుల హాకీ ప్రపంచకప్‌లో ఇంగ్లాండ్ చేతిలో ఎదురైన 2-4 ఓటమి భారత జట్టు సెమీఫైనల్ ఆశలను తీవ్రంగా దెబ్బతీసింది. ప్రస్తుతం మూడు పాయింట్లతో పూల్ డి లో రెండో స్థానంలో ఉన్న భారత్, తర్వాతి రౌండ్ దాటాలంటే ఈ నెల 19న పాకిస్తాన్‌తో జరిగే మ్యాచ్‌లో విజయం సాధించడం అత్యవసరం. ఈ ఓటమి ప్రభావం రెండో రౌండ్‌లోనూ కొనసాగే అవకాశం ఉండటం అభిమానులను కలవరపెడుతోంది. ర్యాంకింగ్స్ పరంగా చూస్తే భారత్ 8వ స్థానంలో, పాకిస్తాన్ 12వ స్థానంలో ఉన్నప్పటికీ, మైదానంలో దాయాదుల మధ్య పోరు ఎప్పుడూ ఒత్తిడితో కూడుకున్నదే. ఒకవేళ భారత్ పాకిస్తాన్ చేతిలో ఓడిపోతే టోర్నీ నుంచి నిష్క్రమించడం ఖాయమవుతుంది. డ్రా చేసుకుంటే మాత్రం వేల్స్‌పై ఉన్న మెరుగైన రికార్డు ఆధారంగా రెండో రౌండ్‌కు అర్హత సాధించే అవకాశం ఉంటుంది. అయితే ఈసారి హాకీ ప్రపంచకప్‌లో ప్రవేశపెట్టిన కొత్త నియమాలు భారత జట్టుకు పెద్ద సవాలుగా మారాయి. గతంలా క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించకుండా, తొలి రౌండ్ నుంచి అర్హత సాధించిన 8 జట్లను క్రాస్‌ఓవర్ పూల్స్(ఈ, ఎఫ్) పేరిట రెండు గ్రూప్‌లుగా విడదీస్తారు. తొలి రౌండ్‌లో ఎదురైన ఫలితాల పాయింట్లు, గోల్స్ వ్యత్యాసం నేరుగా రెండో రౌండ్‌కు కూడా వర్తిస్తాయి. పాకిస్తాన్‌పై భారత్ విజయం సాధించి పూల్ డి నుంచి రెండో స్థానంతో ముందంజ వేసినా, పూల్ ఎ లో అగ్రస్థానాల్లో నిలిచే జట్లతో కలసి పూల్ ఈ లో పోరాడాల్సి ఉంటుంది. అక్కడ ఇంగ్లాండ్‌తో మళ్లీ మ్యాచ్ ఉండదు. కానీ ఇంగ్లాండ్ చేతిలో పొందిన ఈ ఓటమి పాయింట్ల పట్టికపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. అంటే, పూల్ ఈ లో భారత్ సెమీఫైనల్ బెర్త్ దక్కించుకోవాలంటే తర్వాతి రెండు మ్యాచ్‌ల్లోనూ కచ్చితంగా గెలిచి తీరాలి. ఇక రెండో రౌండ్‌లో భారత్‌కు ఎదురయ్యే ప్రత్యర్థులు సామాన్యమైనవారు కాదు. పూల్ ఎ నుంచి మాజీ ఛాంపియన్ నెదర్లాండ్స్, ఒలింపిక్ విజేత అర్జెంటీనా గ్రూప్ ఈ లోకి అడుగుపెట్టడం దాదాపు ఖాయంగా కనిపిస్తోంది. ఇటీవలి కాలంలో అర్జెంటీనాతో జరిగిన చివరి నాలుగు మ్యాచ్‌ల్లోనూ భారత్ పరాజయం పాలైంది. అలాగే నెదర్లాండ్స్‌పై గడిచిన పది మ్యాచ్‌ల్లో కేవలం మూడు విజయాలు మాత్రమే నమోదు చేయగలిగింది. 1975 తర్వాత మళ్లీ ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరుకోలేకపోయిన భారత్, ఈసారి ఆ సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలంటే మైదానంలో అద్భుతాలు చేయాల్సిందే. ఇంగ్లాండ్‌పై చేసిన పొరపాట్లను సరిదిద్దుకుని, వ్యూహాత్మక దృఢత్వంతో ఆడితేనే భారత హాకీ జట్టు ఆశలు సజీవంగా ఉంటాయి.

# సిన్సినాటి ఓపెన్.. జ్వెరెవ్, డి మినార్ ముందంజ

### కోస్టియుక్, స్టేర్న్స్ చేతిలో విలియమ్స్ సిస్టర్స్ ఓటమి

**ఓహియో:** సిన్సినాటి ఓపెన్ 2026లో జ్వెరెవ్, డి మినార్ ముందంజలో ఉండగా, కోస్టియుక్-స్టేర్న్స్ జోడీ చేతిలో విలియమ్స్ సోదరీమణులు ఓటమి చెందారు. టాప్ సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ పోరాడి నాలుగో రౌండ్‌లోకి ప్రవేశించగా, సెరెనా-వీనస్ విలియమ్స్ తమ మొదటి డబుల్స్ మ్యాచ్‌లో ఓడిపోయారు. ఈ ఏడాది రోలాండ్ గారోస్ గెలిచి, వింబుల్డన్ రన్నరప్‌గా నిలిచిన జర్మన్ స్టార్ జ్వెరెవ్, టెర్రాన్స్ అట్మాన్‌ను 7-6(4), 7-6(6) తేడాతో ఓడించి, ఈ సీజన్‌లో తన ఏటీపీ కెరీర్‌లో





అత్యుత్తమమైన 46వ మ్యాచ్‌ను గెలుచుకున్నాడు. జ్వెరెవ్, 2025 సిన్సినాటి సెమీఫైనలిస్ట్ అయిన ఆ ఫ్రెంచ్ ఆటగాడిని బ్యాక్‌హ్యాండ్ షాట్‌తో ఓడించాడు. ఇక 14 గ్రాండ్ స్లామ్ టైటిళ్లు, మూడు ఒలింపిక్ స్వర్ణ పతకాలు సాధించిన విలియమ్స్ సోదరీమణులు వీనస్ విలియమ్స్, సెరెనా విలియమ్స్ అమెరికాకు చెందిన పేటన్ స్టేర్న్-ఉక్రెయిన్‌కు చెందిన మార్టా కోస్టియుక్‌ల చేతిలో 6-2, 1-6, 10-8 తేడాతో ఓడిపోయారు. మొదటి సెట్‌లో తోబుట్టువులు చెరొకసారి తమ సర్వ్‌ను కోల్పోయి, చివరి ఏడు గేమ్‌లలో ఆరింటిని కోల్పోయారు. కానీ, రెండవ సెట్‌లో ఆధిపత్యం చెలాయించి, 10 పాయింట్ల టైబ్రేకర్ మూడవ సెట్‌లో 8-2తో వెనుకబడినప్పటికీ పుంజుకున్నారు. కానీ వీనస్ చేసిన డబుల్ ఫాల్ట్ కారణంగా ఓటమి పాలయ్యారు. అలాగే పురుషుల ఐదవ సీడ్ అలెక్స్ డి మినార్ ఆర్థర్ ఫెరీని 7-5, 7-6 (7/3) తేడాతో ఓడించాడు. 30 నిమిషాల ఆట నిలిచిపోయిన తర్వాత ఈ ఆస్ట్రేలియన్ ఒక సెట్ మరియు 5-1 ఆధిక్యంలో ఉన్నాడు.

# 5జీ టెక్నాలజీలో వరల్డ్ నంబర్‌వన్‌గా మారుతున్న భారత్..!




**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** 5జీ టెక్నాలజీ వినియోగంలో భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలవనుందని, 2030 నాటికి దేశంలో 5జీ స్వీకరణ 62 శాతానికి చేరుకుంటుందని గ్లోబల్ మొబైల్ కమ్యూనికేషన్స్ సిస్టమ్ తన తాజా నివేదికలో వెల్లడించింది. ఇది ఆసియా పసిఫిక్ ప్రాంత సగటు 50 శాతం కంటే గణనీయంగా ఎక్కువగా ఉంది. బంగ్లాదేశ్, ఇండోనేషియా, పాకిస్థాన్‌లతో పాటు భారత్‌ను కూడా ప్రముఖ దేశంగా జీఎస్ఎంఎ గుర్తించింది. ఒకప్పుడు నెట్‌వర్క్ కవరేజీ పెద్ద సవాల్‌గా ఉండగా, ఇప్పుడు దేశంలో ఆ సమస్య దాదాపు పరిష్కారమైందని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం కవరేజీ గ్యాప్ 5 శాతానికి పడిపోవడంతో అసలు సవాల్ కవరేజీ నుంచి వినియోగం, స్వీకరణ వైపు మారిందని తెలిపింది. స్మార్ట్‌ఫోన్ల ధరలు, డిజిటల్ నైపుణ్యాల కొరత, ఆన్‌లైన్ భద్రతపై నమ్మకం వంటివి మొబైల్ ఇంటర్నెట్ వాడకానికి ప్రధాన అవరోధాలుగా ఉన్నాయని వివరించింది. ఈ సవాళ్లను అధిగమించేందుకు భారత్ చేస్తున్న ప్రయత్నాలను నివేదిక ప్రశంసించింది. భారత్‌నెట్, ప్రధానమంత్రి గ్రామీణ డిజిటల్ సాక్షరత అభియాన్ వంటి పథకాలను ఉదాహరణగా పేర్కొంది. పీఎంజీదిశ ద్వారా ఇప్పటికే 6.4 కోట్ల మంది గ్రామీణ పౌరులకు డిజిటల్ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చినట్లు గుర్తు చేసింది. 2026 నాటికి ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీపై చేసే ఖర్చు 11.7 శాతం పెరుగుతుందని అంచనా వేసింది. టెక్నాలజీలో స్వావలంబనపై భారత్ దృష్టి సారించిందని, ఖీఆత్మనిర్భర్ భారత్ఖీ విధానం ఇందుకు నిదర్శనమని నివేదిక పేర్కొంది. బీఎస్ఎన్ఎల్ దేశీయంగా అభివృద్ధి చేసిన 4జీ టెక్నాలజీని వాడటం, దానిని 5జీకి అప్‌గ్రేడ్ చేసుకునే వీలుండటం గొప్ప విషయమని తెలిపింది. అంతేకాకుండా భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకుని భారత్ ఇప్పటికే 6జీ స్పెక్ట్రమ్ రోడ్‌మ్యాప్‌ను కూడా ప్రకటించడం దాని దీర్ఘకాలిక ప్రణాళికకు అద్దం పడుతోందని 5జీ, కృత్రిమ మేధ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్ వంటివి తయారీ, సేవల రంగాల్లో ఉత్పాదకతను గణనీయంగా పెంచుతాయని నివేదిక అంచనా వేసింది.

## వాణిజ్యం

# అక్టోబరు రెండునుంచి 'బ్యాంకింగ్ ఫర్ యూత్'

### కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 18:** దేశంలోని మరింత మంది యువతను బ్యాంకింగ్ వ్యవస్థలోకి తీసుకురావడమే లక్ష్యంగా ప్రభుత్వ రంగ బ్యాంకులు యువతకు ఎలాంటి ఛార్జీలు లేకుండా నో ఫ్రిల్స్ బ్యాంకు ఖాతాలను అందించాలని కేంద్ర



ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. మంగళవారం జరిగిన పీఎస్బీ కాన్క్లేవ్‌లో ఆమె మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి ప్రభుత్వ రంగ బ్యాంకులు నెల రోజుల పాటు బ్యాంకింగ్ ఫర్ యూత్ ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 16 ఏళ్ల పైబడిన యువతతో పాటు యువ ఉద్యోగులను ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయనున్నారు. యువతకు బ్యాంకింగ్ సేవలను చేరువ చేయడంతో పాటు, వారి ఆర్థిక ప్రయాణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులను భాగస్వాములుగా చేయడం ఈ ప్రచారం ప్రధాన ఉద్దేశం.యువ భారతీయుల ఆర్థిక ప్రయాణంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక భాగస్వాములుగా మారాలని సీతారామన్ అన్నారు. యువత కోసం చేపట్టే ఈ కార్యక్రమం కేవలం నెల రోజులకే పరిమితం కాకుండా, నిరంతరం కొనసాగిస్తూ యువతను బ్యాంకింగ్ వ్యవస్థలో భాగం చేయాలని సూచించారు.అదే సమయంలో యువతకు అధికారిక రుణ వ్యవస్థపై అవగాహన కల్పించడంపై బ్యాంకులు దృష్టి పెట్టాలని ఆమె చెప్పారు.




# సెన్సెక్స్, నిఫ్టీలకు తప్పని నష్టాలు

### సూచీలపై ఐటి షేర్ల ఒత్తిడి

**ముంబయి, ఆగస్టు 18:** దేశీయ స్టాక్ మార్కెట్లు మంగళవారం నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ వరుసగా ఆరో ట్రేడింగ్ సెషన్‌లోకూడా పతనం కాగా, సెన్సెక్స్ వరుసగా మూడో రోజు నష్టపోయింది. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు, అమెరికా-ఇరాన్ మధ్య మళ్లీ పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 91 డాలర్లను దాటడం మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రభావం చూపింది. విదేశీ సంస్థాగత మదుపరుల కొనసాగుతున్న అమ్మకాలు, అమెరికా బాండ్ ఈల్డ్స్ పెరగడం, రూపాయి బలహీనపడటం కూడా మార్కెట్లపై ఒత్తిడి పెంచాయి.ఐటీ షేర్లలో భారీగా అమ్మకాలు కనిపించగా, ఫార్మా, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాలు మాత్రమే ప్రధానంగా లాభపడ్డాయి.బీఎస్ఈ సెన్సెక్స్ 492.70 పాయింట్లు నష్టపోయి 77,235.46 వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 132.75 పాయింట్లు క్షీణించి 24,154.90 వద్ద స్థిరపడింది. వరుసగా మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ మొత్తం 1.08 శాతం, ఆరు సెషన్లలో నిఫ్టీ 1.74 శాతం నష్టపోయాయి. నిఫ్టీలో ఇన్ఫోసిస్ 2.18 శాతం, భారతీ ఎయిర్‌టెల్ 1.78 శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 0.82 శాతం నష్టపోయి సూచీపై ఒత్తిడిని పెంచాయి. బీఎస్ఈ మిడ్‌క్యాప్ 150 సూచీ 0.35 శాతం పడిపోగా, బీఎస్ఈ స్మాల్‌క్యాప్ 250 సూచీ 0.19 శాతం లాభపడింది. బీఎస్ఈలో మొత్తం 1,930 షేర్లు లాభపడగా, 2,384 షేర్లు నష్టపోయాయి. మరో 233 షేర్లలో మార్పు లేదు.కమోడిటీ మార్కెట్అక్టోబర్ 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ ముడిచమురు ఫ్యూచర్స్ ధర 18 సెంట్లు పెరిగి బ్యారెల్‌కు 91.45 డాలర్లకు చేరింది. విదేశీ మారక మార్కెట్‌లో రూపాయి స్వల్పంగా బలహీనపడింది. డాలర్‌తో పోలిస్తే పాక్షికంగా కన్వర్టబుల్ రూపాయి 95.65 వద్ద ట్రేడవుతుండగా, గత సెషన్‌లో ఇది 95.42 వద్ద ముగిసింది.అక్టోబర్ 5, 2026 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన ఎంసీఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.42 శాతం తగ్గి రూ.1,52,282కు చేరాయి.ఇక షేర్లపరంగా సిగ్మా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. వన్ 97 కమ్యూనికేషన్స్ 2.15 శాతం, నెల్కో 12.62 శాతం పడిపోయాయి.మరోవైపు డీసీఎక్స్ సిస్టమ్స్ 3.19 శాతం, నెట్‌వెబ్ టెక్నాలజీస్ ఇండియా 2.16 శాతం, కేపీఐ గ్రీన్ ఎనర్జీ 1.95 శాతం లాభపడ్డాయి.

# కోరం లేక టాటా సన్స్ ఏజీఎం తొలిసారి వాయిదా

**ముంబయి, ఆగస్టు 17:** టాటా గ్రూప్ చరిత్రలో తొలిసారిగా టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం కోరం లేక వాయిదా పడింది. అవసరమైన స్థాయిలో సభ్యుల ప్రాతినిధ్యం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేసినట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా, మరికొందరు డైరెక్టర్లు వర్చువల్‌గా సమావేశంలో పాల్గొన్నారు. టాటా సన్స్ చైర్మన్ ఎన్. చంద్రశేఖరన్, డైరెక్టర్ అనితా జార్జ్ మాత్రం బాంబే హౌస్‌కు స్వయంగా హాజరయ్యారు. అయితే అవసరమైన కోరం పూర్తికాకపోవడంతో ఏజీఎంను వాయిదా వేశారు.ప్రస్తుతం సర్ రతన్ టాటా ట్రస్ట్‌పై నియంత్రణపరమైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. టాటా సన్స్ ఆర్టికల్ 86 ప్రకారం ఏజీఎంకు కనీసం ఐదుగురు సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కావాల్సి ఉంటుంది. ఇందులో సర్ దొరాబ్జీ టాటా ట్రస్ట్, సర్ రతన్ టాటా ట్రస్ట్‌లు సంయుక్తంగా నామినేట్ చేసిన ఒక అధీకృత ప్రతినిధి తప్పనిసరిగా ఉండాలి. ట్రస్ట్ బోర్డు కూర్పుపై విచారణ పెండింగ్‌లో



ఉండటంతో మహారాష్ట్ర ఛారిటీ కమిషనర్ ఆదేశాల మేరకు మే 15 నుంచి సర్ రతన్ టాటా ట్రస్ట్ సమావేశాలు నిర్వహించడం లేదా నిర్ణయాలు తీసుకోవడంపై ఆంక్షలు ఉన్నాయి. ఏజీఎంలో టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వ మార్పు, చంద్రశేఖరన్ వారసుడి ఎంపిక ప్రక్రియ ప్రధానంగా చర్చకు రావాల్సి ఉంది. టాటా ట్రస్ట్స్ చైర్మన్ నోయెల్ టాటా కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ప్రధానమంత్రి కార్యాలయానికి చెందిన ఓ సీనియర్ అధికారిని కలిసినట్లు సమాచారం. అత్యవసరంగా చంద్రశేఖరన్ వారసుడిని ఎంపికచేయాల్సిన పరిస్థితి ఉంది. లేనిపక్షంలో మార్కెట్లలో టాటాగ్రూప్ ప్రతిష్ఠ క్షీణించడంతోపాటు లిస్ట్ అయిన షేర్లు భారీ పతనం కూడా చవిచూడక తప్పదు.




# రూ.5వేల కోట్లనుంచి రూ.15 వేలకోట్లకు ఎఫ్‌డిఐ పరిమితులు పెంపు

**న్యూఢిల్లీ,ఆగస్టు 18:** భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు ఎఫ్డీఐల నిబంధనలను భారీగా సరళీకరించేందుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పెద్ద మొత్తంలో విదేశీ పెట్టుబడులకు అనుమతుల ప్రక్రియను సులభతరం చేయడంతో పాటు, డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను కూడా సడలించే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది. వాణిజ్య మంత్రిత్వ శాఖ పరిధిలోని డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ డిపిఐఐటి, ఎఫ్‌డీఐ అనుమతుల ప్రక్రియను క్రమబద్ధీకరించే ప్రతిపాదనను త్వరలో ముందుకు తీసుకురానున్నది.రూ. ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం అవసరమయ్యే ఎఫ్‌డీఐ ప్రతిపాదనల పరిమితిని ప్రస్తుత రూ.5,000 కోట్ల నుంచి రూ.15,000 కోట్లకు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ రూ.5,000 కోట్ల పరిమితి 2015 నవంబర్ నుంచి ఇప్పటివరకు మారలేదు.ఈ ప్రతిపాదనకు ఆమోదం లభిస్తే రూ.15,000 కోట్ల వరకు విలువైన విదేశీ పెట్టుబడి ప్రతిపాదనలను సంబంధిత మంత్రిత్వ శాఖలే పరిశీలించి ఆమోదిస్తాయి. ప్రతి ప్రతిపాదనను కేబినెట్‌కమిటీ వద్దకు పంపాల్సిన అవసరం ఉండదు. అనుమతుల ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు, పెట్టుబడిదారులకు ఎదురయ్యే జాప్యం తగ్గే అవకాశం ఉంది.డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులపై కూడా సడలింపులుడౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనల్లోనూ మార్పులు తీసుకురావాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ప్రతిపాదిత విధానం ప్రకారం, ఒక భారతీయ సంస్థకు పరోక్షంగా విదేశీ పెట్టుబడి వచ్చినప్పుడు, పైస్థాయి దేశీయ సంస్థ ఇప్పటికే అవసరమైన ప్రభుత్వ అనుమతి పొందినట్లయితే, ఆ భారతీయ సంస్థకు మరోసారి ప్రత్యేక ప్రభుత్వ అనుమతి తీసుకోవాల్సిన అవసరం లేకపోవచ్చు. ప్రస్తుతం ప్రభుత్వ అనుమతి మార్గంలో ఉన్న రంగాల్లో డౌన్‌స్ట్రీమ్ పెట్టుబడులు చేయాలంటే ముందస్తు అనుమతి తప్పనిసరి.




# వాల్‌స్ట్రీట్‌లోజేన్‌స్ట్రీట్‌కు రూ.1.25 లక్షలకోట్లనష్టం..!

**న్యూయార్కు, ఆగస్టు 17:** వాల్‌స్ట్రీట్ ట్రేడింగ్ దిగ్గజం జేన్ స్ట్రీట్ జులై నెలలో భారీ నష్టాలను చవిచూసింది. గత పదేళ్ల కాలంలో తొలిసారిగా ఒక నెలలో సుమారు రూ. 1.25 లక్షల కోట్ల పైచిలుకు నష్టాన్ని నమోదు చేసింది. ఎఐ రంగంపై దృష్టి సారించిన సిచ్యుయేషనల్ అవేర్‌నెస్ అనే హెడ్జ్ ఫండ్‌లో చేసిన పెట్టుబడులే ఈ భారీ నష్టానికి ప్రధాన కారణంగా నిలిచాయి. ఓపెన్ ఏఐ మాజీ పరిశోధకుడు లియోపోల్డ్ అషెన్‌బ్రెన్నర్ స్థాపించిన ఈ హెడ్జ్ ఫండ్, ఏఐ, సెమీకండక్టర్ షేర్ల పతనంతో తీవ్రంగా దెబ్బతింది. జూన్ నాటికి ఈ ఫండ్ శాన్‌డిస్క్‌లో సుమారు 5.7 బిలియన్ డాలర్లు, మైక్రాన్ టెక్నాలజీలో 5.6 బిలియన్ డాలర్ల మేర భారీగా పెట్టుబడులు పెట్టింది. జులైలో శాన్‌డిస్క్ షేర్లు 47 శాతం, మైక్రాన్ షేర్లు 29 శాతం మేర పడిపోవడంతో, ఈ ఫండ్ పోర్ట్‌ఫోలియో విలువ ఏకంగా 67 శాతం క్షీణించింది. మార్జిన్ కాల్స్ ఒత్తిడి పెరగడంతో, ఫండ్‌లోని పబ్లిక్ ఈక్విటీలను సిటాడెల్ సంస్థకు తక్కువ ధరకే విక్రయించాల్సి వచ్చింది. సదరు ఫండ్‌లో గణనీయమైన వాటా కలిగి ఉండటంతో పాటు, ఏఐ సంబంధిత స్టాక్స్‌లో నేరుగా పెట్టుబడులు పెట్టడం వల్ల జేన్ స్ట్రీట్‌కు సుమారు 15 బిలియన్ డాలర్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ఏడాది మొత్తంగా చూస్తే ఈ పెట్టుబడిపై ఇప్పటికీ సానుకూల ఫలితాలనే పొందుతున్నామని సంస్థ తన ఉద్యోగులకు పంపిన అంతర్గత నోట్‌లో పేర్కొంది. ఈ భారీ నష్టంవచ్చినా జూలై నాటికి ఈ ఏడాదిలో 40 బిలియన్ డాలర్లకు పైగా ట్రేడింగ్ ఆదాయాన్ని ఆర్జించినట్లు సంస్థ వెల్లడించింది. అమెరికాకు చెందిన జేన్ స్ట్రీట్ సంస్థ భారత స్టాక్ మార్కెట్ నిబంధనలను ఉల్లంఘించి,

## నాగబాబుకు కేబినెట్ హోదా పదవి దక్కడంపై హర్షం



**శృంగవరపుకోట,ఆగష్టు18,ప్రభాతవార్త :**

ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబుకు కేబినెట్ హోదా పదవి దక్కడం పట్ల ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు.కూటమి ప్రభుత్వం ఆయనకు ఆంధ్రప్రదేశ్ సొసైటీ ఫర్ గ్రీనింగ్ అండ్ రీఫారెస్టేషన్ ఎకలాజికల్ ఎన్ రిచిమెంట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా కేబినెట్ హోదా పదవిని కల్పించడం సంతోషకరమన్నారు.ఒకపక్క పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ అటవీ శాఖ మంత్రిగా ఉండడం ఆశాఖకు సంభందించి నాగబాబుకు ఈపదవి దక్కడం మరో విషేషమని ఆయనకొనియాడారు. నాగబాబుకు కేబినెట్ హోదా పదవి లభించడం పట్ల ఎస్.కోట నియోజకవర్గ జనసేన పార్టీ తరుపున ఇంచార్జ వబ్బిన అభినందనలు తెలిపారు.

## బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల ఆకస్మిక తనిఖీ

**పార్వతీపురం, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శి మరియు సీనియర్ సివిల్ జడ్జ్ ఏ కృష్ణ ప్రసాద్ స్థానిక చాకలి బెలగాంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు . వసతి గృహం యొక్క గదులు మరియు మరుగుదొడ్లు చాలా దయనీయమైన స్థితిలో ఉన్నట్లు గమనించి ఎప్పటికప్పుడు వాటిని శుభ్రంగా ఉండేటట్టు చూసుకోవాలని హితవు పలికారు. అన్ని రూములను పరిశీలించారు, డైనింగ్ హాల్ను వంట గదులను పరిశీలించారు. పిల్లలకు అందుతున్న మెనూ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని హెచ్చరించారు. విద్యార్థులతో వారికి మెనూ ప్రకారము భోజనం అందిస్తున్నారా లేదా అన్న వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## పాత బస్టాండ్ రోడ్డు మరమ్మతులు వెంటనే చేయాలి

**పార్వతీపురం, ఆగస్టు18, ప్రభాత వార్త:**




పట్టణంలోని ప్రధాన రహదారి పాత బస్టాండ్ వద్ద రోడ్డు మరమ్మత్తులు వెంటనే చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పట్టణ కార్య దర్శి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ సమీపంలో రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణమంతా అభివృద్ధి చేస్తున్నామని ప్రకటనలు గుప్పిస్తున్న ప్రభుత్వ పెద్దలకు మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న పాత బస్టాండ్ రోడ్డు మరమ్మత్తులు చేయాలని అనిపించకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. నిత్యం వందలాది భారీ వాహనాలు, ఆటోలు, వాణిజ్య వాహనాలు తిరుగుతున్న ఈ రోడ్డు పట్ల మున్సిపల్ అధికారులకు ఇంత నిర్లక్ష్యం దేనికని విమర్శించారు. తక్షణమే ఈ రోడ్ మరమ్మతులు మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపట్టాలని డిమాండ్ చేశారు, లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ప్రజలను కదిలించి ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎన్ వై నాయుడు, జిల్లా కమిటీ సభ్యులు బి వి రమణ, పట్టణ కమిటీ సభ్యులు బి సూరిబాబు, పి రాజశేఖర్, బి లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల దెబ్బలు తాళలేక యువకుడి మృతి?



**రామభద్రపురం,ఆగస్టు 18,ప్రభాత వార్త:**

మండల పరిధిలోని కొండకెంగువ గ్రామానికి చెందిన బండారు మణికంఠ(22)అనే యువకుడు సాలూరు పట్టణ పోలీసుల దెబ్బలు తాళలేక మృతిచెందినట్లు మృతుడి తల్లి అనూరాధ, సోదరుడు సతీష్ ఆరోపించారు.మృతుడి కుటుంబసభ్యులు అందించిన వివరాల ప్రకారం మృతుడు మణికంఠ సాలూరు పట్టణ పరిధిలోని గుమడాంలో ఏప్రిల్ నెలలో జరిగిన బంగారం చోరీ కేసులో రెండవ నిందితుడిగా ఉన్నాడు. చోరీ చేసిన బంగారంను అమ్మేందుకు మొదటి నిందుతుడికి సహకరించాడనే ఆరోపణతో రెండవ నిందుతుడిగా మణికంఠను పోలీసులు చేర్చారు.ఇటీవల ఆ చోరీ కేసును చేధించిన పట్టణ పోలీసులు మణికంఠను అదుపులోకి తీసుకున్నారు.ఈ విచారణలో భాగంగా పోలీసులు తీవ్రంగా కొట్టడంతో తీవ్ర గాయాల పాలైన మణికంఠ సోమవారం మృతిచెందాడు.మృతుడి తల్లి,అన్న మాట్లాడుతూ మణికంఠకు కొద్దికాలం క్రితం గుమడాంకి చెందిన యువకుడు తో పరిచయం ఏర్పడింది.ఆయువకుడు మణికంఠతో తన తల్లి అనారోగ్యంతో బాధపడుతుందని,బంగారం అమ్మి ఆసుపత్రికి తీసుకొని వెళ్ళాలని ఏప్రిల్ నెలలో చెప్పాడు.బంగారం అమ్మిన సొమ్ము జమచేసేందుకు అకౌంట్ నంబర్ అవసరమని దీనికి గానూ మణికంఠ అకౌంట్ నంబర్ కావాలని అడిగాడు.దీనితో చోరీ చేసిన బంగారం అమ్మిన సొమ్ము మణికంఠ ఖాతాలో పడింది.విచారణలో ఈ విషయాన్ని తెలుసుకున్న పట్టణ పోలీసులు మణికంఠను ఆగస్టు 7న అదుపులోకి తీసుకున్నారు.రెండు రోజులపాటు చిత్రహింసలకు గురిచేసి ఆగష్టు తొమ్మిదవ తేదిన అరెస్ట్ చూపించారని ఆరోపిస్తున్నారు.ఈలోపు స్టేషన్ కి వెళ్ళి మణికంఠను చూపించాలని తల్లి,సోదురుడు ప్రాధేయపడిన పట్టణపోలీసులు చూపించలేదన్నారు.అంతేకాకుండా చోరీసొత్తును రూ.3.60 లక్షలను చెల్లించాలని తమపై ఒత్తిడి చేశారన్నారు.ఆ తరువాత మణికంఠ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడని సాలూరు ఏరియా అసుపత్రికి తరలించామని పోలీసులు సమాచారం అందించారు.దీనితో ఆసుపత్రికి వెళ్లి మణికంఠను చూడగా అప్పటికే స్పృహ కోల్పోయి ఉన్నాడని,ఒళ్ళంతా తీవ్రగాయాలు ఉన్నాయని తెలిపారు.మెరుగైన వైద్యం కోసం సాలూరు పట్టణంలో ఉన్న నిహాల్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి కి తరలించామని మణికంఠను పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని మరింత మెరుగైన చికిత్స కోసం విజయనగరం తరలించారని చెప్పారన్నారు.విజయనగరం మెడికవర్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినప్పటికీ, పోలీసులు కొట్టిన దెబ్బలకు అంతర్గత రక్తస్రావం జరిగి,మూత్రం బంధించిందని దీనితో సోమవారం మణికంఠ మరణించాడని తల్లి,సోదరుడు,గ్రామస్థులువాపోతున్నారు.మృతదేహంతో తమ గ్రామంలోని రోడ్డుపై బైఠాయించి పోలీసుల వైఖరి నశించాలని నినదిస్తూ నిరసన తెలిపారు.మణికంఠ మృతికి కారణమైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## వీడియో,ఫొటోగ్రఫీ శిక్షణను సద్వినియోగపరుచుకోవాలి

**గరివిడి, ఆగస్టు 18, ప్రభాత వార్త:**



డ్వాక్రా సంఘాల మహిళలు వీడియో, ఫొటోగ్రఫీలో శిక్షణ పొంది ఆర్థికంగా ఎదగాలని చీపురుపల్లి నియోజకవర్గ ప్రత్యేక అధికారి, వెలుగు డిపిఎం రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వి ఓ ఏ లకు,మహిళా ఎంటర్ ప్రైనర్స్‌కు వీడియో, ఫోటో గ్రఫీ పై శిక్షణ అందించారు. శిక్షణ తరగతుల్లో పాల్గొన్న రాజ్య లక్ష్మీ మాట్లాడుతూ వి ఓ ఏ లు పొందిన శిక్షణ ద్వారా ఆర్థిక స్వావలంబన సారించాలని కోరారు. వెలుగు కార్యక్రమాలు, తదితర అంశాలపై ఆమె సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.కార్యక్రమంలో ఏపీఎం ధనలక్ష్మి, సి సి లు,స్త్రీ నిధి మేనేజర్,వి ఓ ఏలు పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికలలో

## బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు హర్షణీయం



**కొమరాడ, ఆగస్టు 18, ప్రభాత వార్త:**

రాష్ట్రంలోని వెనుకబడిన తరగతుల (బీసీ) సంక్షేమం, సామాజిక న్యాయం మరియు రాజకీయ, ఆర్థిక సాధికారత సాధనకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయానికి బీసీ ప్రజలందరి తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతిన్నట్లు రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ ఉదయ శేఖర్ పాత్రుడు పేర్కొన్నారు.మంగళవారం ఆయన ఒక ప్రకటన పేర్కొన్నారు. గతంలో తగ్గించబడిన బీసీల రిజర్వేషన్లను పునరుద్ధరిస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడం ద్వారా ప్రభుత్వం బీసీ వర్గాల పట్ల ఉన్న నిబద్ధత మరొకసారి చాటుకుందన్నారు. బీసీ సమాజాన్ని తెలుగుదేశం పార్టీకి మరియు ప్రస్తుత ప్రభుత్వానికి వెన్నుముకగా భావించి, వారి హక్కులను కాపాడటంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చూపిస్తున్న చొరవ అభినందనీయమన్నారు. స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం పెరగడం వల్ల బీసీ వర్గాల నుండి వేలాది మంది నాయకులు ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలక పాత్ర పోషించే అవకాశం లభిస్తుందన్నారు. విద్య, ఉద్యోగ మరియు సంక్షేమ రంగాల్లో కూడా బీసీలకు సరైన ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఎంతో మంది నిరుపేద బీసీ కుటుంబాలకు భరోసానిస్తున్నాయన్నారు. సామాజిక న్యాయాన్ని పునర్నిర్వచించి,బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడినందుకు ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు, యువ నాయకుడు నారా లోకేష్ కి, మరియు ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి బీసీ సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందన్నారు.

## లోవోల్టేజీ సమస్య తీర్చిన మంత్రికి అభినందనలు

**దత్తిరాజేరు, ఆగస్టు18, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని చినకాద గ్రామంలో గత కొన్ని సంవత్సరాల నుండి విద్యుత్ లోవోల్టేజీ సమస్యతో గ్రామస్తులందరూ బాధపడుతూ ఉండేవారమని, ఎంతోమంది రాజకీయ నాయకులు అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా . మా గ్రామాన్ని ఎవరు పట్టించుకోలేదన్నారు. గజపతినగరం నియోజకవర్గ శాసనసభ్యులు మరియు. రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి ఈ సమస్య తీసుకువెళ్లేమన్నారు. ఆయన గ్రామ ప్రజలు పడుతున్న కష్టాన్ని చూసి. వెంటనే విద్యుత్ అధికారులతో మాట్లాడి100 కేవీ వాట్స్ ట్రాన్స్ఫర్. ను మంజూరు చేశారు. మంగళవారం చినకాద గ్రామంలో విద్యుత్ అధికారులు100 కే.వి కెపాసిట్ ట్రాన్స్ఫర్ ని. బిగించడంతో లోవోల్టేజ్ సమస్య. ఈరోజు నుండి తీరడంతో గ్రామస్తులందరూ మంత్రికి అభినందనలు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యలకు స్పందిస్తూ గ్రామాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న. మంత్రి నాయకత్వంలో ఇటువంటి ప్రజా ఉపయోగకరమైన. పనులు మరెన్నో జరగాలని గ్రామ టిడిపి నాయకుడు నారాయణ మూర్తి రాజు మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నా కుమార్తె పెళ్లికి రండీ.. సీఎంకు ఎమ్మెల్యే కోళ్ల ఆహ్వానం

**శృంగవరపుకోట,ఆగష్టు18,ప్రభాతవార్త :**



అమరావతిలో సీఎం చంద్రబాబును ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అలాగే ఆమె భర్త రాష్ట్ర టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల అప్పల రాంప్రసాద్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా ఈనెల 27న మా కుమార్తెకు వివాహ జరగనుందని, వివాహ మహోత్సవంకు విచ్చేయాలని వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ అహ్వాన పత్రికను అందజేశారు.అదేవిధంగా విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబుకు అలాగే విశాఖలోని ఎంపీ భరత్‌కు వివాహ మహోత్సవ అహ్వాన పత్రికను ఎమ్మెల్యే కోళ్ల దంపతులు అందజేశారు.

## 20 లీటర్ల నాటు సారాతో ఇద్దరు వ్యక్తుల అరెస్టు

**కురుపాం, ఆగస్టు18,ప్రభాత వార్త :**



ఒడిస్సా, ఆంధ్రా పోలీసులు చర్చి దాడుల్లో ఇద్దరు వ్యక్తులను నాటు సారాతో పట్టుకొని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ పి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం నవోదయం 2.0 కార్యక్రమంలో అమలులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా ఎక్సైజ్ పార్వతీపురం టాస్క్ ఫోర్స్ఏ ఇఎస్ సంతోష్ ఆధ్వర్యంలో ఒడిస్సా సరిహద్దులో సారా తయారీ కొత్తగూడ గ్రామాలలో ఒడిస్సా పోలీస్ అధికారులతో కలిసి సంయుక్త దాడులు నిర్వహించినట్లు తెలిపారు.నాటు సారా తయారీ కోసం సిద్ధంగా ఉంచిన 8,200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను, రవాణా కోసం సిద్ధంగా ఉంచిన 200 లీటర్ల నాటు సారాయిని ధ్వంసం చేశామని తెలిపారు. అలాగే కురుపాం మండలం పరిధిలో గల కించాయి గూడ జంక్షన్ లో వాహన తనిఖీలు నిర్వహించగా హోండా షైన్ ద్విచక్ర వాహనం పై నాటు సారా రవాణా చేయుచున్న లాల్గాడిగూడ గ్రామానికి చెందిన ఆరిక రాజారావు, ఆరిక డుంబు లను 20 లీటర్ల నాటు సారాతో అరెస్టు చేసి , సారాయి,ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి న్యాయస్థానం నందు హాజరు పరిచామని తెలిపారు. ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ వీవీఎస్ .శేఖర్ బాబు సిబ్బంది, విజయనగరం ఎన్ఫోర్స్ మెంట్ ఎ ఇ ఎస్ ఎం వి. గోపాలకృష్ణ సిబ్బంది, గుణుపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది కురుపాం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్ జె రాజశేఖర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## జీఓ 3పై ఇచ్చిన హామీని అమలు చేయాలి

### ఆదివాసీ గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం



**కురుపాం,ఆగస్టు18, ప్రభాత వార్త :**

జీఓ నంబర్ 3కు ప్రత్యామ్నాయ చట్టం తీసుకురావడంతో పాటు 1/70 చట్టాన్ని రక్షించాలని, గిరిజన గ్రామాలను 5వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆరిక అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం కురుపాంలో ఆదివాసీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు కోరంగి సీతారాం అధ్యక్షతన జరిగిన సమావేశంలో అశోక్ మాట్లాడుతూ ఎన్నికల ముందు కురుపాం బహిరంగ సభలో జీఓ నంబర్ 3ను పునరుద్ధరిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు కావస్తున్నా హామీ అమలుకు చర్యలు తీసుకోకపోవడం దారుణమన్నారు. గిరిజనుల హక్కులను కాపాడేందుకు 1/70 చట్టంపై సుప్రీంకోర్టులో దాఖలైన కేసుల్లో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కావాలని కోరారు. సమస్యల పరిష్కారం కోసం ఆగస్టు 27న కురుపాంలో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు మండంగి రమణ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.అనిల్‌కుమార్, గిరిజన సమాఖ్య నాయకులు ప్రసాద్, లింగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బి.వి.రమణ, ఎన్.వై.నాయుడు, ఐద్వా జిల్లా కార్యదర్శి బి.లక్ష్మీ , తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ దేవత ఆలయంలో వైభవంగా మంగళ గౌరీ వ్రతం

**కురుపాం, ఆగస్టు18, ప్రభాత వార్త :**



పవిత్ర శ్రావణ మాసం పురస్కరించుకొని కురుపాం గ్రామ దేవత ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామ పురోహితులు సర్వాజోష్యుల రమేష్ శర్మ చేతుల మీద గా మంగళ గౌరీ వ్రతం మంగళవారం ఉదయం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా విఘ్నేశ్వర పూజ ,108పసుపు కొమ్ములు తో గ్రామదేవత శ్రీ పైడిమారమ్మ కు అర్చన ,1008నామాలతో కుంకుమ అర్చన ,లలిత సహస్రనామ స్తోత్రము ఘనంగా నిర్వహించారు. వందమంది మహిళలు ,భక్తులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. అనువంశిక సేవకులు బూరుబు నారాయణ రావు , ఆలయ కమిటీ సభ్యులు కొత్త కోట రవీంద్ర కుమార్ ,నెల్లి శ్రీనివాస్ ,సంచాన పోలినాయుడు ,వంశీ ,సూర్యనారాయణ ,అప్పలనాయుడు , చక్రి , తదితరులు పాల్గొన్నారు.

## హీరా కంపెనీ విస్తరణ చేయడం మాకందరికీ అభ్యంతరం లేదు



**బొబ్బిలి, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

బొబ్బిలి ఏఐఐసి గ్రోత్ సెంటర్ లో హీరా స్మెల్టర్ కంపెనీ విస్తరణ కోసం ఎతీశీ సత్తిబాబు ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయం సేకరణ సమావేశం నిర్వహించారు. హీరా కంపెనీ వలన మాకు ఎటువంటి హానిలేదని మేమందరం ఏకతాటిపై కంపెనీ విస్తరణకు మద్దతు తెలియజేస్తున్నామని చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు కార్మికులు మద్దతు తెలియజేశారు. పొల్యూషన్ లేని కర్మాకారముగా మాకు అన్ని విధాలుగా మా గ్రామాలకు సహాయ సహకారాలు అందిస్తున్నారని వారంతా ముక్తకంఠంతో తెలియజేశారు. అయిన భూములు ఇచ్చాం మా ఆస్తంతా కోల్పోయాము మా పిల్లలు ఉన్నత చదువులు చదువుకొని ఉన్నారు వారికి కావలసిన ఉద్యోగాలు ఇప్పిస్తే మా అందరికీ భూములు ఇచ్చిన బాధ ఉండదని వారు ఆవేదన వ్యక్తం చేశారు మాకు మా పిల్లలకు నాలుగవ తరగతి ఉద్యోగాలు తప్ప ఉన్నత ఉద్యోగాలు ఇవ్వలేదని ఇక ముందు అయినా కంపెనీ వారు మమ్మల్ని దృష్టిలో పెట్టుకొని మాకు మా పిల్లలకు ఉద్యోగాలు ఇప్పించాలని వారంతా కోరారు. 23.72 ఎకరాల కల 83 682 టన్నుల స్మెల్టర్ ఉత్పత్తి చేయుచున్నది. దీనిని లక్ష టన్నులు ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి అధికార అనుమతులు పొందుతున్నామని ఫ్యాక్టరీ యాజమాన్యం తెలియజేసింది. దీనికి మద్దతుగా ప్రతి ఒక్క ప్రక్క విలేజ్ సర్పంచులు ప్రజాప్రతినిధులు కార్మికులు ముక్తకంఠంతో అనుమతులు అంగీకరించారు. 20 924 కోట్లు రూపాయలు తో ఫెర్రో మాంగనీష్ మాంగనీస్ ఫెర్రోస్మెల్టర్స్ ఉత్పత్తికి ఉపక్రమించామని కంపెనీ యాజమాన్యం తెలియజేశారు. 7. 82 ఎకరాలు 869 చెట్లను పెంచుతున్నట్లు కంపెనీ తెలియజెప్పింది. గ్రోత్ సెంటర్ నేలకొల్పు అందుకు 1050 ఎకరాలు అప్పట్లో మా గ్రామాలు ఇచ్చామని ఇప్పుడు వీటి ధర గణనీయంగా పెరిగిందని మేమంతా పేదరికల అనుభవిస్తున్నామని మీరందరూ కంపెనీలు పెట్టుకొని మా కడుపు కొట్టొద్దని మాకు మా పిల్లలకు ఈ కంపెనీల్లో తగు స్థానం కల్పించాలని ఉద్యోగాలు అందజేయాలని వారంతా కోరారు దీనికి కంపెనీ యాజమాన్యం మా వంతు మేము సహకారం చేస్తామని తెలియజేశారు. హీరా కంపెనీ కాకుండా ఉన్న కంపెనీలపై విరుచుకుపడిన గ్రామస్తులు రాత్రింబవళ్లు వీటి నుంచే వచ్చే పొల్యూషన్ తో మా కుటుంబాలు చాలా ఇబ్బందులు పడుతున్నాయని దీనిపై అధికారులు నిర్లక్ష్యంగా చూస్తున్నారని పొల్యూషన్ రాకుండా చర్యలు తీసుకోవాలని చుట్టుపక్కల ఉన్న గ్రామస్తులు పెట్టారు దీనితో అధికారులు మేము వెంటనే వీటిపై చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. విశాఖ జోన్ కాలుష్య నియంత్రణ అధికారి నాయక్, పిసిబి ఈ ఈ సరిత. తహసిల్దార్ శ్రీను. సీఐ నారాయణరావు తదితర పెద్దలు. గ్రామస్తులు కంపెనీ యాజమాన్యం. ప్రతినిధులు పాల్గొన్నారు.

## నూకాలమ్మ తల్లికి జలాభిషేకం

**పాచిపెంట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



పాచిపెంట ప్రజల ఆరాధ్య దైవమైన నూకాలమ్మ దేవతకు మండలంలో కోటికిపెంట గ్రామ ప్రజల ప్రత్యేక మొక్కు మంగళవారం చెల్లించారు. పాచిపెంట మండలంలో కొలువై ఉన్న నూకాలమ్మ తల్లికి వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ కోటికిపెంట గ్రామ ప్రజలు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.గ్రామ ప్రజలందరూ కలిసి బిందెలతో నీటిని తీసుకుని పాచిపెంటలోని నూకాలమ్మ ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారి ఆలయ గోపురంపై నీటిని పోసి జలాభిషేకం నిర్వహించారు. వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని నూకాలమ్మ తల్లిని భక్తిశ్రద్ధలతో ప్రార్థించారు. కార్యక్రమంలో కోటికిపెంట గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

విజయనగరం
పార్వతీపురం మన్యం
25
వార్త

## మోటార్ సైకిల్ , ఆటో ఢీకొని ఒకరి మృతి

**బలిజిపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త :**

బలిజపేట మండలం శివరాంపురం గ్రామ శివారులో మలుపు వద్ద చిన అంకాలం చెందిన బోను అనిల్ కుమార్ అనే యువకుడు చినంకలం నుంచి బలిజిపేట బైకు పై వెళ్తుండగా రాజాం నుంచి పనుకువలస వస్తున్న ఆటో నీ ఢీకొని తలకు పెద్ద గాయం ఏర్పడి స్థానికులు సహాయంతో విజయనగరం ఆసుపత్రులు జాయిన్ చేయగా రాత్రి 9 గంటల ప్రాంతంలో మరణించారని డాక్టర్లు వెల్లడించారు మరియు ఆటోలో ఉన్న ఒక వ్యక్తికి కాలు కి పెద్ద గాయం అయింది క్షతగాత్రులు వెంటనే ఆసుపత్రికి తరలించారు ఈ కేసు బలిజిపేట ఎస్సై కే రాజేష్ దర్యాప్తు నిర్వహిస్తున్నారు.

## బలిజపేట, పదమాయవలసలో 'పొలం పిలుస్తుంది'




**బలిజిపేట, ఆగస్టు 18, ప్రభాతవార్త:**

బలిజిపేట మండలంలో బలిజిపేట , పదమాయవలస గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఎల్ నినో తాలూక ప్రభావము , వాటిని ఏరకంగా ఎదుర్కోవాలి అనే దాని కోసం డాక్టర్ స్రవంతి క్రాప్ ప్రొడక్షన్ సైంటిస్ట్ గారు అలాగే డాక్టర్ ఎంఎ విహారి రైతులను ఉద్దేశించి ప్రతి ఒక్కరు కూడా ఆరుతడి పంటలు అయినటువంటి పెసర లేదా మినుము పంటలు తక్కువ నీటి నీటి వసతితో మనము పండించుకోవచ్చు అలాగే వర్షభావ పరిస్థితులు తక్కువగా ఉండటం వలన ఈ సంవత్సరం రైతులందరూ కూడా వరి కి బదులుగా ఆరతడి పంటలు అయినటువంటి అపరాలను సాగు చేయవలసిందిగా రైతులను ఉద్దేశించి వివరించడం జరిగింది అలాగే వరి పంటలో యాజమాన్య పద్ధతులు అలాగే ఎరువులు యాజమాన్యం కలుపు యాజమాన్యం అలాగే నీటి యాజమాన్యం కోసం వివరించడం జరిగింది అలాగే ముఖ్యంగా మొక్కజొన్న లో వచ్చేటువంటి కత్తెర పురుగు అలాగే కాండం తొలిచే పురుగు నివారణ గురించి వివరించడం జరిగింది. మండల వ్యవసాయ అధికారి ఎస్ శివ గణేష్ అలాగే గ్రామ వ్యవసాయ సహాయకులు కిరణ్ కుమార్, రైతులందరూ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## పాంచాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

**పాచిపెంట, ఆగస్టు 18, ప్రభాతవార్త**



మండలంలో గల పాంచాలి గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి జమ్మూ శంకర్రావు ఆధ్వర్యంలో నిర్వహించారు. గట్టుమీద చెట్టు అనే కార్యక్రమంను రైతులను ఉద్దేశించి ఏవో మాట్లాడుతూ మండలంలో ప్రతి ఒక్క రైతు ఫార్మర్ ఐడి నెంబర్ను రైతు సేవ కేంద్రం నుండి గ్రామ వ్యవసాయ సహాయకులు వద్ద నమోదు చేసుకోవాలని కోరారు.ఫార్మర్ ఐడి ఉంటేనే ప్రభుత్వాన్ని సంబంధించిన పథకాలు గాని పంట బీమా గాని నష్టపరిహారం వంటివి లభిస్తాయి అని తెలియజేశారు .ప్రతి ఒక్కరూ పంట భీమా చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాబోవు రోజుల్లో ఎల్ నినో పరిస్థితులు తీవ్రంగా ఉంటాయి కావున ప్రతి ఒక్క రైతు ఎల్ నినో పి దృష్టిలో పెట్టుకొని వ్యవసాయాన్ని సాగు చేయాలని కోరారు. ఎక్కువగా నీటిపై ఆధారపడే పంటలు కాకుండా ఆరుతడి పంటలు పండించాలని కోరారు. వరికి బదులుగా అపరాలు ,చిరుధాన్యాలు లాంటివి పండించాలని తెలియజేశారు. అలాగే గట్టు మీద చెట్టు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్క రైతు తమ ప్రధాన క్షేత్రంలో ప్రతి గట్టున చెట్లు నాటి అదనపు ఆదాయాన్ని పొందాలని తెలియజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారి చింతాడ గణేష్,గ్రామ వ్యవసాయ సహాయకులు డి మోహన్ కృష్ణ ,ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తిరుపతి నాయుడు, రైతులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణతో దేశ వ్యాప్తంగా రాజకీయ కుట్ర ..!



**సాలూరు, ఆగస్టు18, ప్రభాతవార్త :**

ఎస్సీ వర్గీకరణ పేరుతో దళితులపై బీజేపీ మోడీ రాజకీయకుట్ర దేశవ్యాప్తంగా జరుగుతుందని ఆర్ఎసీసీఎస్ మాల మహానాడు నేషనల్ ప్రెసిడెంట్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు.మంగళవారం ఉదయం స్థానిక మీడియా ప్రెస్మీట్లో మాట్లాడుతు ఎస్సీ వర్గీకరణతో మాలసామాజిక వర్గం పూర్తిగా ఉనికి కోల్పోయిందన్నారు. అంతేకాకుండా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పార్లమెంట్లో చట్టం చేసేంతవరకు నిరంతరం శాంతియుత పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.అలాగే గతకాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు భీజంవేస్తే దాన్ని బిజెపి ప్రభుత్వం కొనసాగిస్తుందని క్లారిటీ ఇచ్చారు.నిజానికి ఎస్సీ రిజర్వేషన్ వలన వందలో 1-2 కి బెనిఫిట్ జరుగుతోందని ఇది కూడా అధికారిక లెక్క కాదు,ఈ వందలో యిద్దరికిచ్చే ఈ ఫలాలను,సమన్యాయం, సామాజిక న్యాయం పేరుతో దేశవ్యాప్తంగా ఎస్సీ లిస్టులో ఉన్న 1108 ఎస్సీ కులాలకు ఎలా పంచుతారని ప్రశ్నించారు.రేగిడి రామకృష్ణ,సింగారపు ఈశ్వరరావు,మజ్జి సతీష్,రాంబాబు, ఎడ్ల గోపి, నారాయణరావు,యడ్ల గోపి,గడ్డియ్య,చంద్రమోహన్, వీరేష్,తలసముద్రం సూర్యం పాల్గొన్నారు.

## ప్రతి కుటుంబానికి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయడమే లక్ష్యం

**వేపాడ ,ఆగష్టు 18, ప్రభాతవార్త:**



ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామిక వేత్తను తయారు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు వివోఏ లంతా నిరంతరం కృషి చేయాలని మండల వెలుగు ఏపీఎం డి సూర్యనారాయణ కోరారు . మంగళవారం వేపాడ వెలుగు కార్యాలయంలో నేషనల్ ఎంటర్ ప్రేన్యూర్షిప్ డే క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామానికి 15 మందిని పారిశ్రామికవేత్తలుగా తయారు చేయాలన్న లక్ష్యంతో గుర్తించడం జరిగిందన్నారు. మండలంలో 750 మందిని ఎంపిక చేసుకోవడం జరిగిందని ఈ మహిళలు డైరీ, ఆహార ఉత్పత్తులు , కిరణా షాపులు ,పిండి మిల్లులు, బేకరీ ఫుడ్స్ కూరగాయల పెంపకం, పౌల్ట్రీ మరియు చేపల పెంపకం వంటి యూనిట్లని కొత్తగా ఏర్పాటు చేసుకోవడానికి చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే మహిళలకు ఉన్న చిన్న తరహా పరిశ్రమలు కూడా అభివృద్ధి చేసుకోవడానికి వీరికి అన్ని రకాల సహాయ సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ సంవత్సరం వారికి రుణాలు మంజూరు చేస్తూ వారు చేస్తున్న చిన్న తరహా పరిశ్రమలు అభివృద్ధి చేసుకోవడానికి మీరంతా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సిసి డి.సత్యనారాయణ. కె ద్రాక్షయని మండలంలో ఉన్న వివోఏలు, తదితరులు పాల్గొన్నారు.

## నెల్లిమర్ల అభివృద్ధికి సీఎం చంద్రబాబు అండ

### కీలక అంశాలపై లోకం మాధవి ప్రత్యేక చర్చ

**నెల్లిమర్ల, ఆగస్టు 18, ప్రభాతవార్త:**



నెల్లిమర్ల నియోజకవర్గ అభివృద్ధికి మరింత వేగం తీసుకురావడమే లక్ష్యంగా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అమరావతిలో ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడుని ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిశారు.ఈ సందర్భంగా నెల్లిమర్ల నియోజకవర్గానికి సంబంధించిన ప్రజా సంక్షేమం, అభివృద్ధి, మౌలిక వసతులు, పెండింగ్ సమస్యలు సహా పలు కీలక అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు.అలాగే మంజూరైన సహాయానికి సంబంధించిన పత్రాలు/చెక్కుల విడుదల, పాజెక్టుకు సంబంధించిన సీఎంతో ప్రత్యేకంగా చర్చించారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూరే ఈ అంశాలను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కోరారు. నెల్లిమర్ల నియోజకవర్గంలోని ప్రతి మండలం, ప్రతి గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన ప్రభుత్వ సహకారం అందించాలని కోరారు. నెల్లిమర్ల అభివృద్ధిపై సీఎం ప్రత్యేక దృష్టి, ప్రభుత్వ సహకారంతో నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లడమే తన లక్ష్యమని స్పష్టం చేశారు.

## మొదలైన ఎన్నికల హడావుడి

**భోగాపురం, ప్రభాత వార్త:**

మండలంలో ఎన్నికల హడావిడి మొదలైంది. త్వరలో సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలు జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని పలు పోలింగు కేంద్రాలను అధికారులు పరిశీలిస్తున్నారు. అందులో భాగంగా ఎంపిడిఓ డిడి.స్వరూపారాణి పలు పాఠశాలను సందర్శించి పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అనువుగా ఉన్నాయా లేదా పరిశీలించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బొల్లి వీధి, పెద్ద హరిజన వీధిలోని ఎంపీపీ పాఠశాలలను బుధవారం సందర్శించారు.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No.1-187, Kushalpuram, Srikakulam Dist. Pin: 532001 Ph: 270684, 271144, 9848387562 Fax: 08942-271146, RNI No.APTEL/2004/13708, Editor : "DamerlaSai Baba, "responsible for selection of news under the PRB Act.